

ఆంధ్రజ్యోతి

www.andhrajyothy.com
ANDHRAJYOTHI



ఆదివారం | 28-12-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 292 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి మ.12:00 తదుపరి నవమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ.8:43 తదుపరి రేవతి, వర్జ్యం: రా.8:12-9:43, దుర్ముహూర్తం: సా.4:18-5:01, అమృతఘడియలు: తె.5:23-తె.6:55, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:47, సూర్యాస్తమయం: 5:45 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బాబుపై అంత పగెందుకు?



..కేసీఆర్ అండ్ కోకు, అటు జగన్ అండ్ కోకు ఇద్దరు ముఖ్యమంత్రుల పొడ గిట్టడం లేదు. రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బందులపాల్జేయడానికి కేసీఆర్ అండ్ కో-జగన్ అండ్ కో ఒకరికొకరు ఆదర్శంగా మెలుగుతుండటం విశేషం.

..నిన్నటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యమేలిన ముతక భాష ఇప్పుడు తెలంగాణలోకి కూడా దిగుమతి అయింది. తాజాగా రప్పా రప్పా నరుకుతామని జగన్ రెడ్డి మొదలెట్టిన రణన్నినాదాన్ని ఇప్పుడు భారత రాష్ట్ర సమితి నాయకులు కూడా అందిపుచ్చుకున్నారు. అభివృద్ధిలో పోటీ పడడంలో తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలబడాలి కానీ ముతక భాష ప్రయోగంలో కాదు.

..ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మళ్లీ ముడి సరుకుగా మార్చుకొని తెలంగాణ రాజకీయాలలో తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి కేసీఆర్ ప్రయత్నించడం చర్చనీయాంశం అవుతోంది.

..తెలంగాణలో బీఆర్ఎస్‌కు రాజకీయంగా కష్టం వచ్చినప్పుడల్లా చంద్రబాబును తెర మీదకు తెచ్చి రాజకీయంగా లాభపడటానికి అలవాటు పడిన ఆ పార్టీ పుష్కర కాలం తర్వాత కూడా అదే పంథాను ఎంచుకుంది.

..భౌగోళికంగా తెలంగాణ రాష్ట్రం కర్ణాటక రాష్ట్రానికి దిగువన, ఆంధ్రప్రదేశ్‌కు ఎగువన ఉంది. నీళ్ల విషయంలో అన్యాయం చేస్తే గీస్తే కర్ణాటక చేయగలుగుతుంది. ఆల్మట్టి ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోతే జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం తగ్గిపోతుంది. అంతే గానీ, దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్ ఏమి నష్టం చేయగలుగుతుంది?

..మూడు ఎన్నికల్లో గెలిచి, మూడు ఎన్నికల్లో ఓడిపోయినా కూడా రాజకీయాల్లో నిలదొక్కుకున్న ఏకైక నేతగా చంద్రబాబు ఒక్కరే ఈ దేశంలో కనిపిస్తారు. రాజకీయాలలో తాను చంద్రబాబు కంటే గొప్పవాడినని కేసీఆర్ భావించడం వల్లే తంటా అంతా.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



జిల్లాలు, మండలాల విభజనపై మంత్రులు, అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

రద్దుబాటలో అన్నమయ్య

జిల్లాలోని రాజంపేట కడపలోకి.. రైల్వేకోడూరు తిరుపతి జిల్లాలోకి

రాయచోటి ప్రతిపాదిత మదనపల్లెకు.. ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు

- రాయచోటి జిల్లా కేంద్రంపై అభ్యంతరాలు
- పరిగణనలోకి తీసుకోవాలన్న సీఎం
- కొత్త జిల్లాలు, డివిజన్లపై 927 వినతులు
- పోలవరం, మార్కాపురం, మదనపల్లె ఓకే
- వీటితో కలిపి మొత్తం జిల్లాలు 28
- రెవెన్యూ డివిజన్‌గా నక్కపల్లికి బదులు అడ్డరోడ్డు జంక్షన్
- నేడు సీఎం వద్ద మరోసారి సమావేశం
- మార్పులపై తుది నిర్ణయం.. అనంతరం క్యాబినెట్‌కు

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో ఊహించని పరిణామం తెరపైకి వచ్చింది. ప్రస్తుతమున్న 26 జిల్లాల్లో ఒకటైన అన్నమయ్య రద్దుబాటలోకి వస్తోంది. ప్రజల నుంచి వస్తున్న వినతులు, నిరసనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటున్న ప్రభుత్వం అన్నమయ్య జిల్లాను రద్దుల పద్దులోకి తీసుకురావాలనుకుంటోంది. కొత్త జిల్లాలు, డివిజన్ల ఏర్పాటుపై జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ల గడువు ముగిసిన నేపథ్యంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమావేశం నిర్వహించారు. మంత్రివర్గ ఉపసంఘానికి నేతృత్వం వహిస్తున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, హోం మంత్రి అనిత, రెవెన్యూ స్పెషల్ సీఎస్ జి.సాయిప్రసాద్, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. అన్నమయ్య జిల్లాను రద్దు చేసి అందులోని

మిగతా 14వ పేజీలో...

'తూర్పు'లో రప్పా రప్పా



- జగన్ ఫ్లెక్సీ వద్ద మేకపోతు తల నరికి ఉన్మాదం
- 2029లో జాతరే.. అంటూ శివాలు
- నాటు సారా తాగుతూ వీరంగం
- ఏడుగురి అరెస్టు.. పరారీలో ఒకడు
- నిందితులను రోడ్డుపై నడిపించిన పోలీసులు
- రప్పారప్పా అంటే కటకటాలే: హోం మంత్రి అనిత

12

నల్లజర్లలో మేక తల నరికి హల్‌చల్ చేసిన వారిని రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళుతున్న పోలీసులు

ఏ11గా అల్లు అర్జున్

- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై పోలీసుల చార్జిషీట్
- యాజమాన్యం నిర్లక్ష్యం, అల్లు అర్జున్ రాకతోనే ఘటన
- ఏ1, ఏ2 గా థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులు
- మరణం సంభవించే అవకాశం ఉందని తెలిసీ వెళ్లారు
- ఐపీసీ 304 పార్టు-2 కింద అభియోగాలు

14

కల్తీ నెయ్యి గురించి విన్నా!

- తిరుమలలో అది కొత్త విషయం కాదు.. ఎన్టీఆర్ కాలం నుంచీ నెయ్యి ట్యాంకర్లు వెనక్కి.. టీటీడీ మాజీ చైర్మన్ భూమన వ్యాఖ్యలు
- నెయ్యి నాణ్యత, రుచి గురించి 2సార్లు చైర్మన్‌గా తెలుసుకోలేదా?
- కొనుగోలు కమిటీ సభ్యునిగా తీసుకున్న చర్యలేంటి?.. సిట్ ప్రశ్నలు
- పలు ప్రశ్నలకు తెలియదంటూ భూమన జవాబు
- తిరుపతిలో రెండు గంటలపాటు ప్రశ్నించిన సిట్ అధికారులు

3

రాష్ట్రాలపై ప్రత్యక్ష దాడి

- నరేగా రద్దు.. రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాధికారాన్ని లాక్కోవడమే
- పంచాయతీ వ్యవస్థను తీవ్రంగా బలహీనపరిచే కుట్ర
- కార్మిక లోకానికి తీవ్ర నష్టం, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం
- జీ రామ్ జీతో పేదలకు నష్టం, కార్పొరేట్లకు లాభం: రాహుల్
- జనవరి 5 నుంచి 'నరేగా బచావో అభియాన్' ఉద్యమం
- 'సడక్ నుంచి సంసద్' వరకు: ఖర్గే

2

దుర్గగుడికి పవర్ కట్!

- 2023 ఫిబ్రవరి నుంచి 2.61 కోట్ల బిల్లు బకాయిలు
- దేవస్థానానికి నోటీసులు జారీ చేసిన సీపీడీసీఎల్
- స్పందించకపోవడంతో సరఫరా నిలుపుదల
- రూ.2 కోట్లు చెల్లింపునకు అంగీకారం.. పునరుద్ధరణ

12

అసోం ఓటరు జాబితా నుంచి 10.56 లక్షల పేర్ల తొలగింపు

గువాహతి, డిసెంబరు 27: ఆరు నెలల్లోగా అసోంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ అనంతరం 10.56 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. మరణించడం, వేరే చోటుకు మారడం లేదా బహుళ ఎంట్రీలు ఇందుకు కారణం. శనివారం ఎన్నికల సంఘం సమీకృత ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో 93,021 మంది అనుమానాస్పద ఓటర్లు (డీ-ఓటర్లు) కాకుండా మొత్తం 2,51,09,754 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా నవంబరు 22 నుంచి డిసెంబరు 20 వరకు ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్‌ను పూర్తి చేసిన తర్వాత ముసాయిదా జాబితాను ప్రచురించారు. జనవరి 22 వరకు ఓటర్లు తమ ఫిర్యాదులు, అభ్యంతరాలను సమర్పించే అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 10న తుది ఎన్నికల జాబితాను ప్రచురిస్తారు.

విదేశాంగ విధానం ఏదో పార్టీ పాలసీ కాదు

- ఈ విషయంలో ప్రధాని ఓటమిపై సంబరం సరికాదు
- రాహుల్‌పై శశి థరూర్ పరోక్ష వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, డిసెంబరు 27 : కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మరోసారి తన పార్టీని ఇబ్బందిపెట్టే వ్యాఖ్యలు చేశారు. "విదేశాంగ విధానం అనేది బీజేపీ లేక కాంగ్రెస్ విధానం కాదు. అది దేశానికి సంబంధించింది. ఈ విషయంలో దేశ ప్రధాని ఓటమిని వేడుక చేసుకోవడం సరికాదు. అది దేశం ఓటమి పట్ల సంబరపడటంతో సమానం. రాజకీయాల్లో ఉన్న వారు చేయకూడని పని అది." అని ఆయన స్పష్టం చేశారు. 'ఓట్ చోరీ' వంటి అంశాలపై ప్రధాని మోదీని నేరుగా వ్యతిరేకిస్తూ తన విదేశీ పర్యటనల్లో రాహుల్ పలు వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో రాహుల్‌గాంధీని పరోక్షంగా ఉద్దేశిస్తూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నాయి. శుక్రవారం 'ఇండియా టుడే' నిర్వహించిన సదస్సులో శశి థరూర్ పాల్గొన్నారు. పాకిస్థాన్ హెచ్చరికలను తేలిగ్గా తీసుకోరాదని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. మారిన దాయాది సైనిక వ్యూహాలను భారత్ విస్మరించరాదని అన్నారు. పాక్- బంగ్లా రక్షణ ఒప్పంద సంప్రదింపులపై స్పందిస్తూ.. తనకు భారత్ శత్రువు అని చెప్పే ప్రయత్నం బంగ్లాదేశ్ చేస్తోందన్నారు. ఈశాన్య రాష్ట్రాలను దేశం నుంచి విడగొడతామంటూ వస్తున్న హెచ్చరికల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

సామాన్య కార్యకర్త నుంచి ప్రధానిగా..!

- మోదీ, బీజేపీ-ఆరెస్సెస్‌పై దిగ్విజయ్ ప్రశంసలు

న్యూఢిల్లీ, డిసెంబరు 27: కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కేంద్ర ప్రభుత్వ విధానాలు, ప్రధాని మోదీని ప్రశంసిస్తూ వార్తల్లో నిలుస్తుండగా.. తాజా ఆ జాబితాలో కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ కూడా చేరారు. ఆయన ప్రధాని మోదీకి చెందిన 1990 నాటి ఓ పాత ఫొటోను షేర్ చేస్తూ.. బీజేపీ-ఆరెస్సెస్‌పై ప్రశంసలు కురిపించారు. కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సమావేశాన్ని నిర్వహించిన తరుణంలో దిగ్విజయ్ వ్యాఖ్యలను ఆ పార్టీ అధినాయకత్వానికి పంపిన ఒక పరోక్ష సందేశంగా భావిస్తున్నారు. దిగ్విజయ్ గుజరాత్‌లో జరిగిన ఓ కార్యక్రమ ఫొటోను తన 'ఎక్స్' ఖాతాలో పంచుకుంటూ.. నేలపై కూర్చొన్న వ్యక్తి దేశానికి ప్రధాని అయ్యారంటూ మోదీని ఉద్దేశిస్తూ కొనియాడారు. ఆ ఫొటోలో బీజేపీ అగ్రనేత అడ్వాణీ కుర్చీలో కూర్చొని ఉండగా.. మోదీ ఆయనకు సమీపంలో నేలపై ఒక సామాన్య కార్యకర్తగా కూర్చున్నట్లుగా ఉంది. 'జై సియా రామ్' అని చివర్లో దిగ్విజయ్ పోస్టులో నినదించారు. తన పోస్టులో కాంగ్రెస్, మల్లికార్జున ఖర్గే, రాహుల్, ప్రియాంక గాంధీలను ట్యాగ్ చేశారు. తన వ్యాఖ్యలు వివాదంగా మారడంతో దిగ్విజయ్ స్పందించారు. తాను సంస్థాగత నిర్మాణాన్ని మాత్రమే ప్రశంసించానని, బీజేపీని వ్యతిరేకిస్తూనే ఉంటానని అన్నారు.

కర్ణాటకలోనూ యూపీ తరహా బుల్డోజర్ రాజ్

- కోగిలు లే ఔట్‌లో ఇళ్ల కూల్చివేతపై కేరళ సీఎం ఆగ్రహం
- బాధితులకు ఆ రాష్ట్ర ఎంపీ ఏఏ రహీం పరామర్శ

బెంగళూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ తరహాలో కర్ణాటకలోనూ 'బుల్డోజర్ రాజ్' (బుల్డోజర్ ప్రభుత్వం) నడుస్తోందని కేరళ సీఎం పినరయి విజయన్ విమర్శించారు. బెంగళూరు ఉత్తర పరిధిలోని కోగిలు లే ఔట్‌లో గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) అధికారులు ఇటీవల ఇళ్లను కూల్చివేయడంపై ఆయన శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. ఇళ్లను కూల్చివేయడంతో ముస్లింలు రోడ్డున పడ్డారని, ప్రత్యామ్నాయంగా వారికి ఎటువంటి ఏర్పాట్లు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోగిలు క్రాస్‌లోని పకీర్ కాలనీ, వసీం లే ఔట్‌లో అక్రమంగా నిర్మించిన షెడ్లను జీబీఏ అధికారులు కూల్చివేశారు. ఇక్కడ 14.36 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 200 మంది తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసుకుని నివసించేవారు. ఈ భూమిని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగానికి కేటాయించారు. ఆ ప్రాంతంలో అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు తాత్కాలిక ఇళ్లను మూడ్రోజుల క్రితం కూల్చివేశారు. ఈ చర్య కేరళ, కర్ణాటక ప్రభుత్వాల మధ్య వివాదం రగిల్చింది. కేరళ రాజ్యసభ సభ్యుడు ఏఏ రహీం నేతృత్వంలోని ఓ బృందం శనివారం పకీర్ లే ఔట్‌కు వచ్చి ఇళ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించింది. ఈ విషయమై ఢిల్లీలో సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ, అనధికారికంగా నిర్మించుకున్న తాత్కాలిక షెడ్లను తొలగించామని తెలిపారు. ఇల్లు కోల్పోయినవారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గ్రేటర్ బెంగళూరు కమిషనర్, సెక్రటరీని ఆదేశించామని వెల్లడించారు. కాగా.. కేరళ సీఎం వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బెంగళూరులో స్పందించారు. అక్రమంగా నివసించేవారి ఇళ్లను మాత్రమే తొలగించామని, ఇందులో ముస్లింలనే ప్రశ్న రాదని అన్నారు. ఇళ్లను కోల్పోయినవారికి హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.

2 సెకండ్లలో 700 కి.మీ. వేగం

- ప్రపంచ రికార్డు సృష్టించిన చైనా మ్యాగ్లెవ్ రైలు


చైనా పరీక్షించిన ట్రయల్ వాహనం

న్యూఢిల్లీ, డిసెంబరు 27: ప్రపంచ రైల్వే చరిత్రలో చైనా సంచలనం సృష్టించింది. అత్యాధునిక సూపర్ కండక్టింగ్ మాగ్నెటిక్ లెవిటేషన్(మ్యాగ్లెవ్) రైలు ప్రయోగంలో 2 సెకండల్లో 700 కిమీల వేగాన్ని అందుకొని ప్రపంచ రికార్డు సృష్టించింది. అయస్కాంతాల సాయంతో ఏ వస్తువునైనా గాలిలో తేలియాడేలా చేయడాన్ని మ్యాగ్నెటిక్ లెవిటేషన్ అంటారు. ఈ మ్యాగ్లెవ్ సాంకేతికతతో ప్రయాణించే రైళ్లకు చక్రాలు ఉండవు. పట్టాలకు కొన్ని సెంటీమీటర్ల ఎత్తులో గాల్లో తేలుతూ ఉండే రైలు.. విద్యుత్ అయస్కాంత శక్తి సాయంతో మెరుపు వేగంతో ముందుకు దూసుకెళుతోంది. ఈ మ్యాగ్లెవ్ టెక్నాలజీపై చైనా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ నేషనల్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్తలు పదేళ్లుగా పరిశోధనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల నిర్వహించిన పరీక్షలో వారు అద్భుత ఫలితాన్ని సాధించారు. 400 మీటర్ల (1310 అడుగులు) మ్యాగ్లెవ్ ట్రాక్‌పై టన్ను(1000 కిలోలు) బరువు ఉన్న టెస్ట్ వెహికల్‌ను పరీక్షించగా అది 2 సెకండల్లో 700 కిమీల వేగాన్ని అందుకుంది. రెప్పపాటులో కంటి ముందు నుంచి మాయమైంది. అంతేకాక నిర్దేశిత గమ్యస్థానానికి సురక్షితంగా చేరింది. ఈ ప్రయోగానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. ఇదే శాస్త్రవేత్తల బృందం జనవరిలో నిర్వహించిన పరీక్షలో మ్యాగ్లెవ్ రైలు 648 కిమీల గరిష్ఠ వేగాన్ని అందుకుంది. తాజా ప్రయోగం విజయవంతం కావడంతో భవిష్యత్తులో చైనా చేసే అల్ట్రా హైస్పీడ్ మ్యాగ్లెవ్ పరిశోధనలు మరింత వేగవంతం అయ్యే అవకాశముంది.

రాష్ట్రాలపై ప్రత్యక్ష దాడి



సీడబ్ల్యూసీ సమావేశంలో సోనియా, ఖర్గే, రాహుల్ తదితరులు

- నరేగా రద్దు.. రాష్ట్రాల నిర్ణయాధికారాన్ని లాక్కోవడమే
- జీ రామ్ జీతో పేదలకు నష్టం, కార్పొరేట్లకు లాభం: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజీ నరేగా) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం రాష్ట్రాలపై ప్రత్యక్ష దాడేనని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. ప్రధాని మోదీ చర్య రాష్ట్రాల నిర్ణయాధికారాన్ని లాక్కునే కుట్రలో భాగమేనని ఆరోపించారు. శనివారం న్యూఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జు ఖర్గే అధ్యక్షతన సీడబ్ల్యూసీ సమావేశం జరిగింది. అనంతరం సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఖర్గే, రాహుల్‌గాంధీ మీడియాకు వివరించారు. రాహుల్ మాట్లాడుతూ.. నోట్ల రద్దు లాగే నరేగా పథకం రద్దు నిర్ణయం కూడా ఎటువంటి అధ్యయనం లేకుండా, కనీసం.. మంత్రివర్గాన్ని కూడా సంప్రదించకుండా మోదీ ఏకపక్షంగా తీసుకున్నదేనని ఆరోపించారు. "నరేగా కోట్లాది మందికి కనీస వేతనానికి హామీ ఇచ్చిన పథకం. దీని ద్వారా దేశంలోని కార్మికులకు కనీస స్థాయి వేతనం దక్కింది. ఇంతకంటే, దయనీయంగా, తక్కువ స్థాయిలో పనిచేయాల్సిన పరిస్థితి లేకుండా రక్షణ కల్పించింది. కానీ, ఇప్పుడు ఆ రక్షణ వ్యవస్థను కూల్చేసే కుట్ర జరుగుతోంది. తద్వారా కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమే. రాష్ట్రాలకు చెందాల్సిన నిధులను కేంద్రం తన చేతుల్లోకి తీసుకుంటుంది. నిర్ణయాధికారాన్ని లాక్కుంటుంది. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. విఘాతం. దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసిన బలమైన సాధనంగా నరేగా నిలిచింది. గ్రామస్థాయిలో రాజకీయ భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంచింది. నిధులను అందించడం నిర్ణయాధికారాన్ని పంచాయతీలకే ఇచ్చింది. ఇప్పుడు ఈ పథకంపై దాడి చేయడం అంటే ముమ్మాటికీ గ్రామ పంచాయతీలను బలహీనపరచడమే" అని రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు.

పేదల ప్రయోజనాలను గుంజుకుని..

మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేదలు, ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన తరగతులు (ఓబీసీ), పేద, సాధారణ వర్గాలు, మైనారిటీలకు తీవ్ర నష్టం జరుగుతుందని రాహుల్‌గాంధీ అన్నారు. పేదలకు అందే ప్రయోజనాలను గుంజుకుని అదానీ, అంబానీ వంటి కొద్దిమంది కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చడమే మోదీ ప్రభుత్వం అసలు ఉద్దేశమన్నారు. నరేగా కూలిపోతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని, ఇది మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. "నరేగా అనేది హక్కుల ఆధారిత పథకమే కాదు. ఇది ప్రజాస్వామ్య నిర్మాణానికి ఆధారంగా నిలిచిన ఒక మూలస్తంభం. ఇటువంటి పథకాన్ని నిర్వీర్యం చేయడమంటే దేశ ప్రాథమిక నిర్మాణంపై, ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేయడమే. మోదీ ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. నరేగా పరిరక్షణ కోసం న్యాయ పోరాటం, ప్రజా ఉద్యమం కొనసాగుతుంది. ఈ ఉద్యమంలో ప్రతిపక్ష పార్టీలన్నీ కాంగ్రెస్ పోరాటంతో కలిసి వస్తాయని ఆకాంక్షిస్తున్నాను" అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఖర్గే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీకి వ్యతిరేకంగా జనవరి 5 నుంచి 'నరేగా బచావో అభియాన్' పేరుతో దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని ప్రకటించారు. వీబీ జీ రామ్ జీ బిల్లును వెనక్కి తీసుకునే వరకు దేశవ్యాప్తంగా 'సడక్ నుంచి సంసద్' (రోడ్డు నుంచి పార్లమెంటు) వరకు పోరాటం చేస్తామని అన్నారు..

కూలీలకు డబ్బులు లేవా?

కార్పొరేట్లకు వేలకోట్లు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వానికి కూలీల దగ్గరికి వచ్చేసరికి డబ్బులు లేవా? అని ఖర్గే ప్రశ్నించారు. గతంలో కేంద్రం 90 శాతం, రాష్ట్రాలు 10 శాతం వేతన భారం భరించేవని, కానీ.. దాన్ని 60:40 మార్చడం రాష్ట్రాలపై ఆర్థికభారం మోపేందుకేనని మండిపడ్డారు. సీడబ్ల్యూసీ సమావేశానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సీడబ్ల్యూసీ సభ్యులు అభిషేక్ మను సింఘ్వీ, వంశీచంద్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు సహా కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌ముఖ్యమంత్రులు సిద్ధ రామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేగా పథకాన్ని కాపాడి తీరుతామని సీడబ్ల్యూసీ సభ్యులంతా ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు మాజీ ప్రధాని మన్‌మోహన్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన పార్టీ సీనియర్ నేతలు శివరాజ్ పాటిల్, ప్రకాశ్ జైస్వాల్‌లకు సంతాపం తెలిపారు.

లోకం తీరు

ఆర్ఎస్ఎస్ పై దిగ్విజయ్ సింగ్ ప్రశంస≡



పాక్‌ను కలవరపెడుతున్న నిపుణుల వలసలు

- రెండేళ్లలో పాక్‌ను వీడిన 5వేల మంది వైద్యులు, 11వేలమంది ఇంజనీర్లు, 13వేల మంది అకౌంటెంట్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 27: తీవ్ర రాజకీయ, ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌లో ఉండేందుకు అక్కడ వివిధ రంగాలకు చెందిన నిపుణులు ఇష్టపడటం లేదా? దేశాన్ని వీడేందుకే సిద్ధమైపోతున్నారా? పాక్ ప్రభుత్వ లెక్కలు పరిశీలిస్తే ఔననే అనిపిస్తోంది. ఇప్పటికే పెద్దసంఖ్యలో కూలీలు, కార్మికులు ఉపాధి కోసం దేశాన్ని వీడుతుంటే తాజాగా నిపుణుల వలసలు ఆ దేశాన్ని తీవ్ర స్థాయిలో కలవరపెడుతున్నాయి. గత రెండేళ్లలో పాక్‌కు చెందిన 5వేల మంది డాక్టర్లు, 11వేల మంది ఇంజనీర్లు, 13వేల మంది అకౌంటెంట్లు తమ స్వదేశాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఈమేరకు పాకిస్థాన్‌కు చెందిన బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ అండ్ ఓవర్‌సీస్ ఎంప్లాయిమెంట్ గణాంకాలను వెల్లడించింది. ఈ క్రమంలో పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలు ఆ దేశ బుద్ధి జీవులకు మరింత ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి. పాక్‌కు షాక్‌కు గురిచేస్తున్న ఈ 'బ్రెయిన్ డ్రెయిన్'ను మునీర్ అంతర్జాతీయ సమాజానికి పాక్ ఇస్తున్న బహుమతి అన్న అర్థం వచ్చేలా 'బ్రెయిన్ గెయిన్'గా అభివర్ణించారు. ఆయన ఈ వ్యాఖ్యలపై దేశ నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. పాక్ సర్కారు వెల్లడించిన లెక్కల ప్రకారం.. 2024లో 7,27,381 మంది, ఈ ఏడాది నవంబరు వరకు 6,87,246 మంది విదేశాల్లో ఉపాధి పొందేందుకు దరఖాస్తు పెట్టుకున్నారు. ఆ దేశ హెల్త్‌కేర్ సెక్టార్‌కు అయితే మరింత దెబ్బపడుతోంది. 2011-24 మధ్య ఆ దేశం నుంచి నర్సుల వలసలు 2,144 శాతం పెరిగాయి. ఈ ధోరణి ఈ ఏడాది కూడా కొనసాగుతోంది. పాక్ నుంచి వేల సంఖ్యలో ప్రజలు బిక్షాటన చేసుకొని బతికేందుకు గల్ఫ్ దేశాలకు వెళ్లిపోయారు.

హెచ్1బీ వీసా కోసం మోసగాళ్ల వలలో పడకండి

- దరఖాస్తుదారులను హెచ్చరించిన యూఎస్ ఎంబసీ

న్యూఢిల్లీ, డిసెంబరు 27: అమెరికా హెచ్1బీ వీసా అపాయింట్మెంట్లు, జారీలో ఏర్పడిన అసాధారణ జాప్యాన్ని మోసగాళ్లు తమకు అనువుగా మార్చుకుంటున్నారు. హెచ్1బీ వీసా చార్జీలకు అదనంగా కమిషన్ చెల్లిస్తే అపాయింట్మెంట్లు త్వరగా ఇప్పిస్తామని, వీసా గ్యారంటీ అంటూ దరఖాస్తుదారులకు వల వేస్తున్నారు. దీనిపై ఇండియాలోని యూఎస్ ఎంబసీ ఎక్స్ వేదికగా ఒక వీడియో సందేశం పోస్టు చేసింది. 'మాయ మాటలు నమ్మి మోసగాళ్ల వలలో చిక్కుకోకండి. నమ్మి ఆర్థికంగా నష్టపోకండి. వీసా ప్రక్రియను ఎవరూ ప్రభావితం చేయలేరు. అధికారిక వెబ్‌సైట్ www.ustraveldocs.com లో మాత్రమే మీ వీసా కోసం దరఖాస్తు చేసుకోండి. సమాచారం కోసం కూడా ఇతర అధికారిక వెబ్ సైట్లు travel.state.gov, in.usembassy.gov/visas లను మాత్రమే అనుసరించండి. వీసా దరఖాస్తుదారులు సహనంతో వ్యవహరించాలి' అని యూఎస్ ఎంబసీ సూచించింది.

భారతీయులను తిప్పి పంపిన దేశాల్లో సౌదీదే అగ్రస్థానం

- అక్కడి నుంచి ఈ ఏడాది 11వేల మంది స్వదేశానికి
- అమెరికా నుంచి 3,800 మందే



హైదరాబాద్, డిసెంబరు 27: ట్రంప్ ప్రభుత్వం అమెరికా నుంచి భారీ సంఖ్యలో భారతీయులను తిప్పి పంపిస్తోందన్న అభిప్రాయాలు నెలకొన్నప్పటికీ వాస్తవానికయితే ఈ విషయంలో సౌదీ అరేబియా అగ్రస్థానంలో ఉంది. ఈ ఏడాది 11వేల మందికిపైగా భారతీయులను స్వదేశానికి పంపించింది. అదే అమెరికా కేవలం 3,800 మందిని పంపించి వేసింది. విదేశీ వ్యవహారాల శాఖ గణాంకాల ప్రకారం 2025లో 81 దేశాలు 24,600 మంది భారతీయులను తిప్పి పంపించగా అందులో దాదాపుగా సగం మంది గల్ఫ్ దేశాలకు వెళ్లినవారే ఉన్నారు. యూఏఈ నుంచి 1,469 మంది, బహ్రెయిన్ నుంచి 764 మంది తిరిగి వచ్చారు. వీసా గడువు ముగిసినా ఆయా దేశాల్లో నివసిస్తుండడం, తగిన వర్క్ పర్మిట్లు లేకపోవడం, విధులకు గైర్హాజరు కావడం, నేరాలకు పాల్పడడం వంటివి ఇందుకు కారణాలుగా ఉన్నాయి. గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారంతా నైపుణ్యం లేని కూలీలే. స్థానిక చట్టాలు, అధికారిక పత్రాలపై తగిన అవగాహన లేనందున అక్కడి అధికారులకు చిక్కి బహిష్కరణకు గురవుతున్నారు. సైబర్ నేరాల స్థావరాలుగా మారిన మయన్మార్, కంబోడియాలను 'సైబర్ బానిసలు'గా వెళ్లిన భారతీయులను కూడా ఆయా దేశాలు తిప్పి పంపించాయి. అధిక వేతనాలు చెల్లిస్తామన్న ఆశచూపడంతో అక్కడికి వెళ్లి పలువురు యువకులు మోసగాళ్ల వలలో చిక్కుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనక తప్పని పరిస్థితి ఏర్పడింది. చివరకు అక్కడి పోలీసులకు చిక్కడంతో వారు బాధితులను స్వదేశాలకు పంపిస్తున్నారు. ఈ విధంగా మయన్మార్ నుంచి 1,591 మంది, కంబోడియా నుంచి 305 మంది తిరిగి వచ్చారు. ఉద్యోగులనే కాకుండా విద్యార్థులను కూడా పలు దేశాలు వివిధ కారణాలతో తిప్పి పంపాయి. అత్యధికంగా బ్రిటన్ 170 మందిని, ఆస్ట్రేలియా 114 మందిని, రష్యా 82 మందిని, అమెరికా 45 మందిని ఈ ఏడాది తిప్పి పంపించాయి.

బెంగళూరులో బంగ్లా ఆటో డ్రైవర్లు

- కలకలం రేపుతున్న యువకుల వీడియో

బెంగళూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'బెంగళూరులో ఆటో తోలితే ఆదాయం బాగుంటుంది. బంగ్లాదేశీయులు ఇక్కడికి రండి' అని ఆహ్వానిస్తూ బంగ్లాదేశ్‌కు చెందిన ముగ్గురు యువకులు సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేశారు. తమకు ఎటువంటి రికార్డులు, గుర్తింపు కార్డులు లేవని, అయినా అద్దెకు ఆటోలు తోలుతున్నామని వారు పేర్కొనడం కలకలం రేపుతోంది. తమను తాము బంగ్లాదేశ్ వాసులని చెప్పుకొన్న ఆ ముగ్గురు ఆటో డ్రైవర్లు ఎవరు? దేశంలోకి ఎలా వచ్చారు? రికార్డులు లేకపోయినా స్వేచ్ఛగా ఆటోలను ఎలా నడపగలుగుతున్నారు? అనే చర్చ మొదలైంది. ఈ వ్యవహారం పోలీసులకు సవాలుగా మారింది. వారు చెప్పింది నిజమే అయితే.. దేశ భద్రత పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తున్నాయి. 'సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తే నెలకు రూ.8-10 వేలు మాత్రమే వస్తోంది. ఆటో ద్వారా ఆదాయం అధికం' అంటూనే బంగ్లాదేశ్ వాసులకు బెంగళూరుకు రావాలని ఆహ్వానించినట్టు ఆ వీడియో సందేశం ఉంది. విదేశీయులు నగరంలో ఏకంగా అద్దె వాహనాలు నడిపే స్థాయికి చేరారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మికవేత్తకు ప్రభుత్వ విమాన సేవలు!

- ఎయిర్‌పోర్టులో పోలీసు అధికారి పాదాభివందనం
- ఛత్తీస్‌గఢ్‌లో ధీరేంద్రశాస్త్రి పర్యటనపై రాజకీయ కలకలం

డిసెంబరు 27: బగేశ్వర్ ధామ్ అధిపతి ధీరేంద్ర శాస్త్రిని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌నకు ప్రభుత్వ విమానంలో తీసుకురావటం, ఎయిర్‌పోర్టులో ఓ పోలీసు అధికారి ఆయనకు పాదాభివందనం చేయటం ఆ రాష్ట్రంలో కలకలం రేపింది. గురువారం జరిగిన ఈ ఘటన చర్చనీయాంశం అయ్యింది. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో ఓ ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో పాల్గొనేందుకు ధీరేంద్రశాస్త్రి గురువారం రాయ్‌పూర్ చేరుకున్నారు. ఆయనతోపాటు రాష్ట్ర మంత్రి గురుకుశ్వంత్ సాహెబ్ కూడా ఉన్నారు. విమానం నుంచి వీరిద్దరూ దిగిన తర్వాత.. అక్కడ డ్యూటీలో ఉన్న ఓ పోలీసు అధికారి.. మంత్రికి ప్రోటోకాల్ ప్రకారం సెల్యూట్ చేశారు. అనంతరం బూట్లు విప్పి, తల మీదున్న టోపీ తొలగించి ధీరేంద్రశాస్త్రి పాదాలకు నమస్కరించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. అనుకూల, ప్రతికూల వాదనలు జరుగుతున్నాయి. ఈ ఘటనపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు స్పందిస్తూ.. మతాల మధ్య చిచ్చు పెట్టి, సమాజంలో సోదరభావాన్ని ధ్వంసం చేస్తున్న ధీరేంద్రశాస్త్రి వంటి వ్యక్తి కోసం ప్రభుత్వ విమానాన్ని ఉపయోగించటం.. ప్రభుత్వ ధనాన్ని వృథా చేయటమేనని విమర్శించారు. దీనిపై రాష్ట్ర బీజేపీ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సనాతన ధర్మానికి వ్యతిరేకమని, అందువల్లే విమర్శలు చేస్తోందని పేర్కొన్నారు.

శబరిమల ఆదాయం 332 కోట్లు

శబరిమల, డిసెంబరు 27: కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో 41 రోజుపాటు కొనసాగిన మండల పూజ శనివారంతో వైభవంగా ముగిసింది. ఈ పూజ సమయంలో 30.56 లక్షల మంది భక్తులు అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారని, దీని ద్వారా ఆలయానికి రూ.332.77 కోట్ల ఆదాయం సమకూరిందని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు కె.జయకుమార్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఆదాయం సుమారు రూ.35.70 కోట్ల మేర పెరిగిందని ఆయన పేర్కొన్నారు. మొత్తం ఆదాయంలో ఒక్క కానుకల రూపంలోనే రూ.83.17 కోట్లు వచ్చాయని, మిగిలిన మొత్తం ప్రసాదాల విక్రయం, ఇతర వనరుల ద్వారా లభించినట్లు వెల్లడించారు.

ఢిల్లీలో ఆపరేషన్ ఆఘాత్

- పెద్ద ఎత్తున ఆయుధాలు, డ్రగ్స్ స్వాధీనం

న్యూఢిల్లీ, డిసెంబరు 27: కొత్త సంవత్సర వేడుకల వేళ రాజధాని ఢిల్లీలో పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. దక్షిణ ఢిల్లీ, ఆగ్నేయ ఢిల్లీ జిల్లాల్లో అర్ధరాత్రి సమయంలో ఆపరేషన్ ఆఘాత్ 3.0 నిర్వహించి 660 మందిని అరెస్ట్ చేశారు. పెద్ద ఎత్తున ఆయుధాలను, అక్రమ మద్యాన్ని, మాదక ద్రవ్యాలను, స్వాధీనం చేసుకున్నారు. కొత్త సంవత్సర వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. 24 దేశీయ పిస్తోళ్లు, 44 కత్తులు, 22,500 క్వార్టర్ల అక్రమ మద్యం, 231 వాహనాలను,350 దొంగిలించిన మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇచ్ఛాపురం టు తిరుపతి దివ్యాంగుడి సైకిల్ యాత్ర

చంద్రబాబు సీఎం అయితే వస్తానంటూ మొక్కు...


సైకిల్ యాత్ర చేస్తున్న దివ్యాంగుడు ప్రసాదరావు

కోటబొమ్మాళి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన నెయ్యిల ప్రసాదరావు దివ్యాంగుడు. తెలుగుదేశం అభిమాని. గడచిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా... చంద్రబాబు గెలిచి ముఖ్యమంత్రి అయితే సైకిల్‌పై తిరుపతి వస్తానని మొక్కుకున్నాడు. అనుకున్నట్లు చంద్రబాబు సీఎం అయ్యారు. ఈ నేపథ్యంలో ప్రసాదరావు ఈనెల 20న ఇచ్ఛాపురం నుంచి సైకిల్ యాత్ర మొదలు పెట్టారు. శనివారం కోటబొమ్మాళిలోని కొత్తపేట కూడలికి చేరుకున్నారు. అక్కడ ప్రసాదరావు మీడియాతో మాట్లాడారు. 'ఇచ్ఛాపురం నుంచి 900 కిలోమీటర్ల మేర ఈ యాత్ర చేస్తున్నా. ఇది పూర్తి కావడానికి రెండు నెలలు పడుతుంది. తిరుపతి చేరుకుని శ్రీవారి దర్శనం చేసుకొని మొక్కు తీర్చుకుంటా' అని తెలిపారు.

తిరుమలలో పెరిగిన రద్దీ

సర్వ దర్శనానికి 14 గంటల సమయం


ఆలయం ముందు భక్తుల రద్దీ

తిరుమల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ పెరుగుతోంది. వరుస సెలవులు, ఈ ఏడాదికి వారాంతం కావడంతో శనివారం తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. శ్రీవారి ఆలయ పరిసరాలు, అఖిలాండం, లడ్డూ కౌంటర్, బస్టాండ్, ప్రధాన కూడళ్లు, గదులు కేటాయించే రిసెప్షన్ కేంద్రాలు, తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు భక్తులతో కిక్కిరిసి కనిపించాయి. సర్వదర్శనం కోసం భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగు రోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 14 గంటల తర్వాత దర్శనం లభిస్తోంది. ఇక, టైంస్లాట్ టోకెన్లు, టికెట్లు ఉన్నవారికి దాదాపు 3 గంటల సమయం పడుతోంది. వరాహస్వామి ఆలయం ముందు భక్తులు ఎండలోనే నిలబడాల్సి వస్తోంది. ఉన్న షెడ్లు సరిపోక బయటకు క్యూలైన్ వ్యాపించింది.

ప్రదక్షిణకూ గేట్లు అడ్డు

ఇక సాధారణంగా తిరుమలకు వచ్చే భక్తుల్లో చాలా మందికి స్వామి దర్శనంతో పాటు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం క్యూకాంప్లెక్స్‌ల అనుసంధానంగా ఉండే ఎలిఫెంట్ గేట్ల వైపు నుంచి కాకుండా తిరుమల నంబి ఆలయం ముందు నుంచి అదనపు లైన్ ఏర్పాటు చేసి భక్తులను అనుమతిస్తున్నారు. ఈ క్రమంలో మాడవీధుల్లో భక్తులెవ్వరూ ముందుకు వెళ్లకుండా గేట్లు వేస్తున్నారు. దీంతో భక్తులు మూసివేసిన గేట్లు చూసి నిరాశతో తిరిగి వెళ్లిపోతున్నారు.

రేపు అర్ధరాత్రి తెరుచుకోనున్న వైకుంఠ ద్వారాలు

1.30 గంటల నుంచి దర్శనాలు ప్రారంభం

తిరుమల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి నుంచి వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. 30వ తేదీ వైకుంఠ ఏకాదశి నుంచి జనవరి 8 అర్ధరాత్రి వరకు వైకుంఠ ద్వారాలు తెరచి ఉంచుతారు. సోమవారం అర్ధరాత్రి సరిగ్గా 12.05 గంటలకు అర్చక, జీయర్ బృందం వైకుంఠ ద్వారాలు తెరువనున్నారు. అనంతరం నిత్య, ధనుర్మాస కైంకర్యాలు, నైవేద్యం, హారతి తదితర కార్యక్రమాలను పూర్తిచేసి 1.30 గంటల నుంచి దర్శనాలకు అనుమతిస్తారు. వేకువజాము 5.30 గంటలలోపు వీఐపీ బ్రేక్ దర్శనాలను పూర్తి చేసి, ఆ తర్వాత ఆన్‌లైన్‌లో టోకెన్లు పొందిన భక్తులను అనుమతిస్తారు. జనవరి 2 నుంచి 8వ వరకు నేరుగా తిరుమలకు వచ్చినవారిని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 క్యూలైన్ ద్వారా దర్శనాలకు అనుమతిస్తారు.

విస్తృత ఏర్పాట్లు:

అదనపు ఈవో వెంకయ్య చౌదరి

వైకుంఠ ద్వార దర్శనాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. శనివారం ఆయన శిలాతోరణం నుంచి కృష్ణతేజ సర్కిల్ వరకు క్యూలైన్లను తనిఖీ చేశారు. క్యూలైన్లలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, భక్తులతో మాట్లాడారు. అనంతరం అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు క్యూలైన్లలో కూర్చుకునేందుకు ఏర్పాట్లు చేశామని, తాగునీటి సౌకర్యం, క్యూలైన్లకు అనుసంధానంగా అదనపు మరుగుదొడ్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. చలి కాలం కావడంతో క్యూలైన్‌లో పంపిణీ చేసే అన్నప్రసాదాలు చల్లబడకుండా హాట్ కేసుల్లో ఉంచి వేడిగానే పంపిణీ చేసేలా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- బాపట్ల జిల్లాలో జాతీయ యోగాసనాల పోటీలు ప్రారంభం


యోగాసనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థిని

బాపట్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా బాపట్ల మండలం జిల్లెళ్లమూడి గ్రామంలోని అమ్మవారి దేవస్థానంలో శనివారం 44వ జాతీయ యోగాసనాల చాంపియన్‌షిప్ పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందిన యోగా భారతీయుల సొత్తు కావడం గర్వకారణమన్నారు. గడిచిన 16 సంవత్సరాలుగా యోగాసనాలు వేయడమే తన ఆరోగ్య రహస్యమని కలెక్టర్ చెప్పారు. ఈ జాతీయ స్థాయి పోటీలకు 16 రాష్ట్రాల నుంచి 617 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఇండియన్ యోగా ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజిభూషణ్ పురోహిత్, ప్రధాన కార్యదర్శి మృణాల్ చక్రవర్తి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కూన కృష్ణదేవరాయులు, చైర్మన్ కళ్లం హరినాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్లాడి రవికుమార్, శ్రీ విశ్వజననీ పరిషత్ గౌరవాధ్యక్షుడు ఎం.దినకర్, బి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కుల, మత భేదాలు లేని నవలోకాన్ని పిలుద్దాం

- పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల స్వర్ణోత్సవంలో జస్టిస్ లావు


జ్యోతి వెలిగిస్తున్న జస్టిస్ లావు నాగేశ్వరరావు, సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు మలినేని రాజయ్య తదితరులు

విజయవాడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మన దేశానికి రాబోయే 20 ఏళ్లు ఎంతో కీలకమని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు తెలిపారు. కుల, మత భేదాలు లేని నవలోకానికి యువత ప్రాతినిధ్యం వహించాలని పిలుపునిచ్చారు. విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం జరిగిన స్వర్ణోత్సవ కార్యక్రమంలో జస్టిస్ నాగేశ్వరరావు ప్రసంగించారు. యువతలో కలిసి ఎదగాలన్న భావన, సేవాభావం పెరగాలని అభిప్రాయపడ్డారు. ఐదు పదుల ప్రస్థానం ఏ విద్యాసంస్థకైనా మైలురాయి అని, పాలకవర్గం అంకితభావం, ఐక్యత అభినందనీయమని కొనియాడారు. అనంతరం పూర్వ విద్యార్థులైన న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందరావు, సుప్రీం కోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ కనకమేడల రవీంద్రకుమార్, సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య, డీఆర్డీవో శాస్త్రవేత్త పద్మజ, రామోజీ ఫిలిం సిటీ ఎండీ చెరుకూరి విజయేశ్వరిదేవి, శాంసంగ్ ఆర్ అండ్ డీ మేనేజింగ్ డైరెక్టర్ గోలి మోహనరావు, విజయ బ్యాంకు మాజీ జీఎం వై.నాగేశ్వరరావు, గీతం వర్సిటీ ప్రొఫెసర్ కొల్లూరు శ్రీకృష్ణ, ముంబై ఐఐటీ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు మలినేని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఎం లంకకు నిర్మలా సీతారామన్

నరసాపురం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం పీఎం లంక గ్రామంలో పర్యటించనున్నారు. సుమారు మూడు గంటల పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న ఆమె అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు.

ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా ప్రభుత్వం: బొప్పరాజు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే నమ్మకం ఉందని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఫిబ్రవరి 5న జరిగే రాష్ట్ర మహాసభకు సంబంధించిన సన్నాహక సభ గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించామన్నారు. ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా ఉండాలని.. లేకపోతే ఏ ప్రభుత్వం గుర్తించదని స్పష్టం చేశారు.

కొడుకు చనిపోయాడని తండ్రి ఆత్మహత్య

- మధ్యాహ్నం విద్యుదాఘాతంతో కుమారుడు మృతి
- సాయంత్రం రైలు కింద పడి తండ్రి బలవన్మరణం
- బాపట్ల జిల్లా బేతాళపురంలో విషాదం


అట్లూరి సునీల్, వెంకయ్య

వేమూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో అండగా ఉంటాడని ఎన్నో ఆశలు పెట్టుకున్న కొడుకు ఆకస్మికంగా మృతి చెందడంతో మనస్తాపానికి గురైన తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన బాపట్ల జిల్లా వేమూరు గ్రామ పంచాయతీ శివారులోని బేతాళపురంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన అట్లూరి సునీల్(23) ట్రాక్టర్ నడుపుతుంటాడు. శనివారం ఓ రైతుకు చెందిన ట్రాక్టర్‌లో ఎరువులు తీసుకుని పొలానికి వెళ్లాడు. ఎరువుల బస్తాలు జారిపోతుండటంతో పొలంలో ట్రాక్టర్ ఆపి ట్రక్కులోకి వెళ్లే సమయంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. రైతులు చికిత్స నిమిత్తం వేమూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతి విషయం తెలిసిన సునీల్ తండ్రి వెంకయ్య(48) ఆ బాధను తట్టుకోలేక సాయంత్రం రేపల్లె నుంచి గుంటూరుకు వెళ్లే ప్యాసింజర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సునీల్ భార్య పియాంక తొమ్మిది నెలల నిండు గర్భిణి. భర్త, మామ మృతితో దిక్కుతోచక కన్నీటి పర్యంతమవుతోంది.

కల్తీ నెయ్యి గురించి విన్నా...

తిరుమలలో అది కొత్త విషయం కాదు



- ఎన్టీఆర్ కాలం నుంచీ నెయ్యి ట్యాంకర్లు వెనక్కి..
- టీటీడీ మాజీ చైర్మన్ భూమన వ్యాఖ్యలు
- నెయ్యి నాణ్యత, లడ్డూ రుచి గురించి రెండుసార్లు చైర్మన్‌గా తెలుసుకోలేదా?
- కొనుగోలు కమిటీ సభ్యునిగా తీసుకున్న చర్యలేంటి?
- సూటిగా ప్రశ్నించిన సిట్ అధికారులు

తిరుపతి/ తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో సిట్ అధికారుల ఎదుట విచారణకు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి హాజరయ్యారు. తిరుపతిలోని సిట్ కార్యాలయానికి శనివారం ఉదయం 11 గంటలకు ఆయన చేరుకున్నారు. 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల దాకా ఆయన్ను సిట్ అధికారులు విచారించారు. ఈ సందర్భంగా ఏది అడిగినా, తనకేమీ తెలియదని భూమన సమాధానమిచ్చినట్టు తెలిసింది. రెండు పర్యాయాలు టీటీడీ చైర్మన్‌గానూ, ఒక పర్యాయం ఎక్స్ అఫిషియో మెంబరుగా, కొనుగోలు కమిటీ సభ్యునిగా పనిచేసినందున టీటీడీ వ్యవహారాలపై లోతైన అవగాహన, పాలనా వ్యవహారాలపై పట్టు కలిగిన వ్యక్తిగా కల్తీ నెయ్యి గురించి ఎందుకు పట్టించుకోలేదని సిట్ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. రెండోసారి చైర్మన్ అయ్యాక, నెయ్యి నాణ్యత ఎలా ఉందో తెలుసుకోలేదా? పోటు ఎప్పుడైనా సందర్శించారా? కొనుగోలు కమిటీ సభ్యునిగా శ్రీవారి లడ్డూ రుచి ఎలా ఉందో తెలుసుకోలేదా? అని ప్రశ్నించినట్టు తెలిసింది. నెయ్యి సరఫరా గురించి అధికారులు చూసుకుంటారని, నాణ్యత పరీక్షలు చేయడానికి ప్రత్యేకంగా టీమ్ ఉంటుందని, వాటి గురించి తామెందుకు పట్టించుకుంటామని వ్యాఖ్యానించినట్టు సమాచారం. నాణ్యత లేని నెయ్యిని తిరస్కరించడమనేది ఎప్పటి నుంచో జరుగుతోందని, ఎన్టీఆర్ సీఎంగా పనిచేసిన కాలంలో 12సార్లు, చంద్రబాబు తొలిసారి సీఎం అయిన కాలంలో 14సార్లు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 16 సార్లు, చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక 14 సార్లు, జగన్ ప్రభుత్వంలో 16సార్లు నాణ్యత లేని నెయ్యిని తిప్పి పంపించారని సమాధానమిచ్చినట్టు తెలిసింది. గతేడాది ప్రభుత్వం మారాక తొమ్మిది ట్యాంకర్లు రాగా, అందులో నాలుగు ట్యాంకర్లను తిప్పి పంపారని, వాటిలో నెయ్యి కల్తీ అయిందని విన్నానని చెప్పినట్టు తెలిసింది. నెయ్యి సరఫరా టెండరు నిబంధనలను సడలిస్తూ టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకున్నప్పుడు ఎందుకు అభ్యంతరం చెప్పలేదని సిట్ అధికారులు ప్రశ్నించగా, పాలకమండలిలో ప్రతిపక్షం ఉండదని, అంతా ఒకేపక్షం కాబట్టి చాలావరకూ బోర్డు నిర్ణయాలపై అభ్యంతరాలు, వ్యతిరేకత వ్యక్తం కావని చెప్పినట్టు తెలిసింది. అజెండాను చదువుతారని, సభ్యులంతా ఆమోదించడం జరుగుతుందని, నెయ్యి కల్తీ గురించి తమకు ఎలా తెలుస్తుందని ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. భూమనను సీబీఐ డీఐజీ మురళీ రాంబా, తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావు విచారించారు. కాగా సిట్ అధికారుల విచారణకు హాజరైన భూమన కరుణాకర్‌రెడ్డి వెంట ఆయన న్యాయవాది ఉన్నట్టు తెలిసింది. మరోవైపు భూమనను ప్రశ్నించడంతో కల్తీ నెయ్యి కేసులో గత ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్లుగా వ్యవహరించిన ఇద్దరిని సిట్ విచారించినట్టయింది. కాగా కరుణాకరరెడ్డిని విచారించినట్టు సిట్ వర్గాలు ధ్రువీకరించగా, భూమన సన్నిహిత వర్గాలు మాత్రం ఆయన శనివారం హైదరాబాద్‌లో ఉన్నట్టు ప్రచారం చేశారు. అయితే, ఆయన శనివారం ఉదయమే హైదరాబాద్ నుంచి తిరుపతికి చేరుకుని.. సిట్ కార్యాలయానికి వెళ్లినట్టు తెలిసింది.

అమరేశ్వరుని సేవలో జస్టిస్ సుజాత


జస్టిస్ సుజాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ప్రధాన అర్చకులు

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత పల్నాడు జిల్లా అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామిని శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుధీర్‌శర్మ జస్టిస్ సుజాతకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

ఒక్క రోజే రూ.1.46 కోట్లు!

మల్లన్నకు రికార్డు స్థాయి ఆదాయం

శ్రీశైలం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానానికి ఈ నెల 26వ తేదీ ఒక్కరోజే రూ.1.46 కోట్ల ఆదాయం వచ్చింది. రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చినట్టు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు, ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. స్వామి, అమ్మవార్ల శీఘ్ర, అతి శీఘ్ర, ఆర్జిత సేవా టికెట్లతో పాటు ఇతర విభాగాల్లో సుమారు 12 వేలకు పైగా లావాదేవీలు జరిగినట్టు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా రూ.73,19,314, ఆఫ్‌లైన్ ద్వారా రూ.73,75,511 మొత్తం రూ.1,46,94,825 ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

వీఆర్వోలపై వేధింపులు మానకుంటే ఆందోళన

- ఏపీ వీఆర్వో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

విజయవాడ(గాంధీనగర్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలపై జీఎస్‌డబ్ల్యూఎస్ (వార్డు, గ్రామ సచివాలయాల) అధికారులు ఒత్తిడి తీవ్రతరం చేయడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రెవెన్యూ శాఖలో అనేక విధులతో పని ఒత్తిడికి గురవుతున్న వీఆర్వోలను గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు సర్వేలు, బయోమెట్రిక్ తదితర పనులు చేయాలని ఆదేశాలిస్తున్నారని వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీటిపై రెవెన్యూ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. వీఆర్వోలపై జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారుల వేధింపులు మానుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

జైళ్లలో తీర్పులేని జీవితాలు!

ప్రతి ముగ్గురిలో ఇద్దరు విచారణ ఖైదీలే

- రాష్ట్రంలోని కారాగారాల్లో 7,693 మంది వారిలో శిక్ష పడింది 2,511 మందికే
- మగ్గిపోతున్న రిమాండ్ ఖైదీలు 5,065 మంది
- విచారణల్లో వేగం పెంచితేనే త్వరగా విముక్తి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కోర్టుల్లో నేరం రుజువై శిక్ష పడ్డ వ్యక్తులు.. శిక్ష పూర్తయ్యేదాకా జైళ్లలో ఖైదీలుగా ఉండి తీరాల్సిందే. నేరారోపణపై పోలీసులు అరెస్టు చేసిన వ్యక్తులు కూడా ఏళ్ల తరబడి జైళ్లలోనే మగ్గితే? విచారణలో జాప్యం కారణంగా ఎదురు చూపుల్లోనే ఏళ్లు గడిచిపోతే? మానసికంగా ఆ వ్యక్తితో పాటు కుటుంబం కూడా కుంగిపోతుంది. రాష్ట్రంలోని జైళ్లలో మగ్గిపోతున్న ఖైదీల్లో ఇలాంటివారే ఎక్కువగా ఉన్నారు. కడప, నెల్లూరు, రాజమహేంద్రవరం, విశాఖపట్నం కేంద్ర కారాగాలతో పాటు జిల్లా జైళ్లు, సబ్ జైళ్లలో మొత్తం 7,693 మంది ఉన్నారు. వారిలో శిక్ష పడిన వారు 2,511 మంది మాత్రమే ఉండగా, రిమాండ్ ఖైదీల సంఖ్య అంతకు రెండు రెట్లు(5,065) ఉంది. పోలీసుల దర్యాప్తులో జాప్యం, కోర్టుల్లో వాయిదాలతో తమ జీవితాలు ఎదురు చూపులతో జైలు గోడల మధ్యే గడిచిపోతున్నాయని రిమాండ్ ఖైదీలు కన్నీటి పర్యంతమవుతున్నారు. రాష్ట్రంలో ఏటా లక్షకుపైగా కేసులు నమోదవుతున్నాయి. వాటిలో చార్జిషీట్ల వరకూ వెళ్లేవి సగం కూడా లేవు. అందులో శిక్షలు పడేవి 40శాతం కూడా ఉండవు. దీంతో నిర్దోషులుగా విడుదలయ్యే వారే ఎక్కువ. ఇలాంటి పరిస్థితుల్లో రిమాండ్‌లోనే సుదీర్ఘ కాలం జైలులో బంధించడం తమ కుటుంబాలకు అన్యాయం చేసినట్లేనని వారు వాపోతున్నారు. రాష్ట్రంలోని జైళ్లలో ఉన్న ఖైదీల్లో ఎక్కువగా హత్య కేసులు, గంజాయి స్మగ్లింగ్ ఆరోపణల్లో అరెస్టైన వారే ఉన్నారు. తీవ్ర నేరాల కిందికి వచ్చే హత్య కేసుల్లో 1,910(25శాతం) మంది ఉన్నారు. గంజాయి, డ్రగ్స్ స్మగ్లింగ్‌లో పట్టుబడ్డ వారిని ఎన్‌డీపీఎస్(మాదక ద్రవ్యాల నిరోధక చట్టం) కింద అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఈ రెండు సెక్షన్ల కింద అరెస్టయిన వారిలో శిక్ష పడిన వారి కన్నా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారే అధికం. ఎన్‌డీపీఎస్ చట్టం కింద జైళ్లలో 1,739 మంది ఉండగా వారిలో 1600 మంది రిమాండ్ ఖైదీలే కావడం గమనార్హం. ఎక్కువగా ఉత్తరాంధ్రకు చెందిన గిరిజన యువత ఈ కేసుల్లో చిక్కుకుని బెయిల్ తెచ్చుకునే స్థోమత లేక మగ్గిపోతున్నట్టు తెలుస్తోంది. తప్పు చెయ్యనివారు జైలు నుంచి బయట పడాలంటే విచారణ తొందరగా పూర్తి చేయడమే ఏకైక మార్గం. ఖైదీల్లో మూడో స్థానంలో దొంగలు, ఆస్తితగాదాలకు సంబంధించి 1,150 మంది, మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడి 658 మంది, హత్యాయత్నం కేసుల్లో 450మంది ఖైదీలు జైళ్లలో ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ.. గృహహింస వంటి కేసుల్లోని ఖైదీల సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. రాష్ట్రంలోని జైళ్లలో సిబ్బంది తక్కువ.. ఖైదీల రద్దీ పెరగడంతో పారిపోతున్న ఘటనలు కూడా తరచూ సంభవిస్తున్నాయి. నేర నిరోధం ఎంత అవసరమో వేగవంతమైన విచారణ, సత్వర తీర్పులు కూడా అంతే అవసరమని ఖైదీల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- రూ.70 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం



అనంతపురం క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఏపీలోని పలు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.70 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ శనివారం ఈ కేసు వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా గుడార్ నగర్‌కు చెందిన యాదపల్లి మంజు, సిద్దరగడ్డకు చెందిన పిచ్చుగుంట్ల రామదాసు స్నేహితులు. వీరు మద్యం, క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డారు. వాటి కోసం అప్పులు చేశారు. అప్పులను తీర్చడానికి, జల్సాల కోసం మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్, బ్యాగుల దొంగతనాలకు పాల్పడుతుంటారు. గడిచిన నాలుగేళ్లలో బళ్లారి, గుంటూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. బళ్లారి, గుంటూరు జిల్లాల్లో వీరిపై ఆరు కేసులు నమోదయ్యాయి. అనంతపురం జిల్లాలో జరుగుతున్న చైన్ స్నాచింగ్‌లపై దృష్టి పెట్టిన త్రీటౌన్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు ప్రత్యేకంగా బృందాలుగా ఏర్పడి నిఘా ఉంచారు. అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్డు సర్కిల్‌లో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. 40 తులాల బంగారు ఆభరణాలు, 7 కిలోల వెండి ఆభరణాలు, రూ.లక్ష, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

'కోటి' కూత..

- జగ్గంపేటలో జోరుగా కోడి పందేలు
- ఫ్లడ్‌లైట్ల కింద రూ.5- 10 లక్షల వరకు పందేలు
- వీక్షించేందుకు 100 కార్లలో రాక
- ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు


కాకినాడ జిల్లా జగ్గంపేటలో నిర్వహిస్తున్న కోడిపందేలు

కాకినాడ/జగ్గంపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలో శుక్రవారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో కోడిపందేలు జరిగాయి. ఒక రైతు పొలంలో రాత్రి 9 నుంచి తెల్లవారుజామున 2గంటల వరకు పెద్దఎత్తున పందాలు నిర్వహించారు. సుమారు 20 నుంచి 30 పెద్ద కోడిపుంజులు తీసుకొచ్చి కత్తులు కట్టి బరిలో పందేలు వేశారు. రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు పందేలు కాశారు. దీంతో సుమారు కోటి రూపాయిల పైనే చేతులు మారాయి. పందేల కోసం 100 కార్లలో కృష్ణ, పశ్చిమ, తూర్పు, విశాఖ జిల్లాల నుంచి అనేకమంది వచ్చారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఒక మద్యం సిండికేట్ వ్యాపారితో పాటు కొందరు పెద్దల అండదండలతో ఈ పందేలు నిర్వహించినట్టు తెలిసింది. కోడిపందేలు పోలీస్‌స్టేషన్‌కు అతి దగ్గరలోనే జరగ్గా, పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. స్థానికుల నుంచి పెద్దఎత్తున ఒత్తిడి రావడంతో, శనివారం ఉదయం ఆరుగురిని అరెస్ట్‌చేసి.. 3 కోడిపుంజులు, రూ.40,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.


కోడిపందేలకు వచ్చిన వారి కార్లు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ ఆర్కే RK

వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రినని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు ప్రకటించుకోవడం అసాధారణం. రేవంత్‌రెడ్డి ఈ మధ్య అటువంటి ప్రకటన చేయడం ఆయనలోని ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. అధికార యంత్రాంగం కూడా ఇప్పుడిప్పుడే దారిలోకి వస్తోంది. కేసీఆర్ అండ్ కో మాత్రం రేవంత్‌ను ఇప్పటికీ తక్కువ అంచనా వేస్తోంది. తెలుగుదేశం పార్టీ నుంచి వెళ్లి కాంగ్రెస్‌లో చేరి అనతి కాలంలోనే ముఖ్యమంత్రి కాగలగడం మామూలు విషయం కాదు. అయితే రేవంత్‌రెడ్డి షార్ట్ కట్‌లో ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ప్రభృతులు విమర్శిస్తున్నారు. కోటా ఏదైనా రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి. ఆ పదవిలో ఆయన ఇప్పటికే రెండేళ్లు పూర్తిచేసుకున్నారు. మిగతా మూడేళ్లు కూడా ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారనడంలో సందేహం లేదు. అయినా ఆయనను ముఖ్యమంత్రిగా గుర్తించం అని కేసీఆర్ అండ్ కో భావిస్తే అది వారిష్టం. భాష విషయంలో కూడా కేసీఆర్, రేవంత్, కేటీఆర్ సంయమనం పాటించాలి.

బాబుపై అంత పగెందుకు?

తెలుగు రాష్ట్రాల రాజకీయాలలో హద్దులు చెరిగిపోతున్నాయి. ముతక భాషే వాడుక భాషగా మారింది. ఆయా పార్టీల ముఖ్య నాయకులకు ఒకరి పొడ మరొకరికి గిట్టడం లేదు. పరస్పరం గౌరవించుకునే సంస్కృతి స్థానంలో కక్షలు, కార్పణ్యాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారం కోల్పోవడానికి స్వయంకృతాపరాధమే కారణమన్న వాస్తవాన్ని విస్మరించి రాజకీయ ప్రత్యర్థులపై కక్షలు పెంచుకుంటున్నారు. రాష్ట్రాలు విడిపోయి పుష్కర కాలం అవుతున్నా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని రాజకీయ సమీకరణాలు అక్కడా ఇక్కడా ప్రభావం చూపుతున్నాయి. అయితే ఈ రాజకీయ రొచ్చులో రెండు రాష్ట్రాల ప్రజల సఖ్యత మాత్రం పదిలంగా ఉండటం గమనార్హం! గత ఎన్నికల్లో తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ అధికారాన్ని కోల్పోయారు. వారు ఇరువురూ అధికారంలో ఉన్నప్పుడు సఖ్యతతో మెలిగారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, తెలంగాణలో రేవంత్‌రెడ్డి అధికారంలో ఉన్నారు. ఈ ఇరువురు నాయకుల మధ్య కూడా సఖ్యత ఉంది. అయితే అధికారం కోల్పోయిన పార్టీలు అసహనంతో రగిలిపోతున్నాయి. ఇటు కేసీఆర్ అండ్ కోకు, అటు జగన్ అండ్ కోకు ఈ ఇద్దరు ముఖ్యమంత్రుల పొడ గిట్టడం లేదు. రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బందులపాల్జేయడానికి కేసీఆర్ అండ్ కో–జగన్ అండ్ కో ఒకరికొకరు ఆదర్శంగా మెలుగుతుండటం విశేషం. నిన్నటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యమేలిన ముతక భాష ఇప్పుడు తెలంగాణలోకి కూడా దిగుమతి అయింది. తాజాగా రప్పా రప్పా నరుకుతామని జగన్‌రెడ్డి మొదలెట్టిన రణన్నినాదాన్ని ఇప్పుడు భారత రాష్ట్ర సమితి నాయకులు కూడా అందిపుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో రెండేళ్లుగా ఫాంహౌజ్‌కే పరిమితమైన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తాజాగా విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దునుమాడారు. రేవంత్‌రెడ్డి సైతం నేను తక్కువ తిన్నానా అంటూ దుమ్మెత్తిపోశారు. ఆ వెంటనే మాజీ మంత్రి కేటీఆర్ రంగప్రవేశం చేశారు. ఈ క్రమంలో ఈ ముగ్గురూ భాష విషయంలో హద్దులు మీరారు. రెండేళ్లుగా చప్పుడు లేకుండా ఫాంహౌజ్‌కే పరిమితమైన కేసీఆర్ ఇకపై తోలు తీయడానికి తానే స్వయంగా రంగంలోకి దిగబోతున్నట్టు ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఉన్నట్టుండి కేసీఆర్ క్రియాశీలం ఎందుకయ్యారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరా తీయడం మొదలుపెట్టారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మళ్లీ ముడి సరుకుగా మార్చుకొని తెలంగాణ రాజకీయాలలో తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి కేసీఆర్ ప్రయత్నించడం కూడా చర్చనీయాంశం అవుతోంది. తెలంగాణ ఏర్పడి పన్నెండేళ్లవుతోంది. ఇప్పుడు కూడా తెలంగాణ వాదం పని చేస్తుందా? తెలంగాణపై బీఆర్‌ఎస్‌కు మాత్రమే హక్కులు ఉన్నాయా? కాంగ్రెస్, బీజేపీలకు హక్కులు లేవా? ఆ పార్టీల నాయకులు తెలంగాణ వారు కాదా? కాంగ్రెస్ కానీ, బీజేపీ కానీ తెలంగాణ హక్కులను పణంగా పెడతాయా? వంటి ప్రశ్నలు సహజంగానే ఉత్పన్నం అవుతాయి. ఉన్నట్టుండి తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ వేడి పుట్టించడానికి వెనుక ఉన్న కారణాల విషయానికి వద్దాం. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరిగే వరకు ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము అధికారంలోకి వచ్చినట్టేనని భారత రాష్ట్ర సమితి నాయకులు కలలుకంటూ వచ్చారు. అయితే బీఆర్‌ఎస్ తన సిట్టింగ్ స్థానాన్ని ఈ ఉప ఎన్నికలో కోల్పోయింది. దీంతో బీఆర్‌ఎస్ శ్రేణులు కొంత డీలా పడ్డాయి. గత ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. అధికార మార్పిడి జరిగిన తర్వాత వచ్చిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. సర్పంచ్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించింది. దీంతో తాను మౌనంగా ఫాంహౌజ్‌కే పరిమితమైతే పార్టీ శ్రేణులు నీరసపడతాయని కేసీఆర్ భావించి ఉండవచ్చు. తాను బయటకు రావాలంటే ఏదో ఒక రాజకీయ అంశం కావాలి కనుక, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను రేవంత్‌రెడ్డి వదులుకోవడానికి సిద్ధపడడం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని సరికొత్త వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. తన గురువైన చంద్రబాబు మెప్పు పొందడానికి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు ద్రోహం చేస్తున్నారని కేసీఆర్ అండ్ కో ఆరోపించడం ప్రారంభించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు రాజకీయంగా కష్టం వచ్చినప్పుడల్లా చంద్రబాబును తెర మీదకు తెచ్చి రాజకీయంగా లాభపడటానికి అలవాటు పడిన ఆ పార్టీ పుష్కర కాలం తర్వాత కూడా అదే పంథాను ఎంచుకుంది. 2018లో చంద్రబాబును బూచిగా చూపించి కేసీఆర్ రెండవ పర్యాయం అధికారంలోకి వచ్చారు. 2023 ఎన్నికల్లో ఆ పప్పులు ఉడకకపోగా తెలుగుదేశం పార్టీ ఓటు బ్యాంకు గంపగుత్తగా కాంగ్రెస్‌కు మళ్లింది. తెలంగాణ రాజకీయాల్లో నేరుగా కాలు పెట్టకూడదని చంద్రబాబు నిర్ణయించుకోవడంతో కేసీఆర్‌కు దెబ్బపడింది. దీంతో ఇప్పుడు నీళ్ల విషయంలో చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు, ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని కొత్త పాట అందుకున్నారు. భౌగోళికంగా తెలంగాణ రాష్ట్రం కర్ణాటక రాష్ట్రానికి దిగువన, ఆంధ్రప్రదేశ్‌కు ఎగువన ఉంది. నీళ్ల విషయంలో అన్యాయం చేస్తే గీస్తే కర్ణాటక చేయగలుగుతుంది. ఆల్మట్టి ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోతే జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం తగ్గిపోతుంది. అంతే గానీ, దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్ ఏమి నష్టం చేయగలుగుతుంది? ప్రభుత్వాలు కుమ్మక్కయినా తమను కాదని దిగువకు నీటిని తరలించడాన్ని రైతులు సహిస్తారా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ వాసి. ఆయన తన సొంత జిల్లాకు ఎందుకు అన్యాయం చేసుకుంటారు? ఏ రాజకీయ నాయకుడైనా సొంత ప్రాంత ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలు చేయరు కదా? చంద్రబాబుతో స్నేహం ఉండడం వల్ల తెలంగాణలో రేవంత్‌రెడ్డికి రాజకీయంగా కొంత ప్రయోజనం చేకూరుతోంది. తెలుగుదేశం పార్టీ ఓటర్లు, అభిమానులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తమ వాడుగా చూసుకుంటున్నారు. పార్టీలతో నిమిత్తం లేకుండా ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. చంద్రబాబుతో శత్రుత్వం పెట్టుకోవడం వల్ల తెలంగాణలో తనకు రాజకీయ లబ్ధి చేకూరుతుందని కేసీఆర్ తలపోస్తున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు–రేవంత్ కుమ్మక్కయి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని కేసీఆర్ కొత్త పల్లవి అందుకున్నారు. ఈ ఆరోపణల్లో హేతుబద్ధత లేకపోయినా ప్రస్తుతానికి ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని కేసీఆర్ అండ్ కో భావిస్తూ ఉండవచ్చు. ప్రజల్లో సెంటిమెంటును రగిలించడానికి ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు పెట్టాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టుగా ఉంది. రాజకీయంగా ఆయన ఎత్తుగడలను తప్పుబట్టాల్సిన అవసరం లేదు. అయితే సందర్భం ఉన్నా లేకపోయినా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కేసీఆర్ అవమానించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనివల్ల ఆయనకు కలిగే రాజకీయ ప్రయోజనం ఏమిటో తెలియదు! తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఫ్యూచర్ సిటీలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైజింగ్ సమ్మిట్ నిర్వహించడాన్ని ఎగతాళి చేస్తూనే, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు కూడా ఇలాగే చేసి వంటవాళ్లతో ఒప్పందాలు చేసుకున్నారని అవమానకరంగా కేసీఆర్ మాట్లాడారు.

ఆ ద్వేషం ఎందుకంటే..

కేసీఆర్ తన గురించి తాను అధికంగా ఊహించుకుంటారు. ఆ క్రమంలోనే తెలంగాణలోనే కాకుండా జాతీయ రాజకీయాల్లో కూడా చక్రం తిప్పాలనుకొని తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చి గత ఎన్నికల్లో సొంత రాష్ట్రంలోనే బోల్తా పడ్డారు. ఊహించని పరాభవంతో కుంగిపోయిన కేసీఆర్, మరోవైపు తాను ద్వేషించే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఈ కారణంగానే తెలంగాణ రాజకీయాల్లో కూడా ఆంధ్రప్రదేశ్‌లో వలె విద్వేష రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ద్వేషించడానికి కారణం ఉంది. అవినీతి కేసులలో తాను జైలు జీవితం గడపాల్సి రావడానికి చంద్రబాబు కారణమని జగన్‌రెడ్డి బలంగా నమ్ముతున్నారు. అందుకే ఆయనకు చంద్రబాబు పొడ గిట్టదు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో చేతులు కలిపి తనను ఓడించడానికి ప్రయత్నించారన్న కోపం చంద్రబాబుపై కేసీఆర్‌కు ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1999 ఎన్నికల తర్వాత తనను మంత్రివర్గంలోకి తీసుకోనందుకు చంద్రబాబుపై కేసీఆర్‌కు కోపం ఉండేది. అప్పటి నుంచే వారిద్దరికీ చెడింది. ఆ తర్వాత కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని తెరపైకి తేవడం, అంతిమంగా అది రాష్ట్ర విభజనకు దారితీయడం తెలిసిందే. చంద్రబాబుపై అటు జగన్‌కు, ఇటు కేసీఆర్‌కు కోపం ఉండటానికి కారణాలు ఉన్నాయి. తెలంగాణ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేసీఆర్‌కు అంత కోపం ఎందుకో తెలియదు. కోపం అంటూ ఉంటే అది రేవంత్‌రెడ్డికి ఉండాలి. ఓటుకు నోటు కేసులో తనను జైలుకు పంపిన కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డికి కోపం ఉండటం సహజం. కేసీఆర్ కోపానికి మాత్రం కారణం తెలియదు. తన దృష్టిలో అల్పుడైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవడం ఏమిటి? అది కూడా తనను ఓడించి గద్దెనెక్కడం ఏమిటి? అని కేసీఆర్ భావిస్తున్నారేమో తెలియదు. రాజకీయాలలో ఎవరికైనా గెలుపోటములు సహజం. తెలుగుదేశం పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత చంద్రబాబు మూడు ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. అంతమాత్రాన ఆయన కుంగిపోలేదు. రాజకీయ ప్రత్యర్థులపై కక్ష పెంచుకోలేదు. ముఖ్యమంత్రిగా జగన్ తనను ఉక్కిరి బిక్కిరి చేసినా, చివరకు జైలుకు పంపినా చంద్రబాబు సంయమనం కోల్పోలేదు. తనదైన శైలిలో రాజకీయం చేసి అపూర్వ విజయాన్ని అందుకున్నారు. తనను అవమానించిన వారి పట్ల ఆయన కక్షపూరితంగా వ్యవహరించే పనులు చేయరు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆ తర్వాత కూడా కేసీఆర్ తనను అవమానించినా చంద్రబాబు పన్నెత్తి మాట అనలేదు. రాజకీయాలలో అవన్నీ మామూలే అన్నట్టుగా పరిగణించారు. చంద్రబాబు రాజకీయాలను కేసీఆర్ అనేక సందర్భాలలో తక్కువ చేసి మాట్లాడారు. అయినా చంద్రబాబు స్పందించలేదు. 1999, 2014, 2024 ఎన్నికల్లో విజయాలను చూసిన చంద్రబాబు 2004, 2009, 2019లో పరాజయాలను చవిచూశారు. మూడు ఎన్నికల్లో గెలిచి, మూడు ఎన్నికల్లో ఓడిపోయినా కూడా రాజకీయాల్లో నిలదొక్కుకున్న ఏకైక నేతగా చంద్రబాబు ఒక్కరే ఈ దేశంలో కనిపిస్తారు. రాజకీయాలలో తాను చంద్రబాబు కంటే గొప్పవాడినని కేసీఆర్ భావించడం వల్లే తంటా అంతా. రాజకీయంగా తాను చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి చంద్రబాబు వెనుకంజ వేయరు. పొరపాట్లను గుర్తించి సరిదిద్దుకుంటారు. 2019లో ప్రధాని మోదీతో ఘర్షణ పడి దెబ్బతిన్న వాస్తవాన్ని గుర్తించి 2024 ఎన్నికల్లో మళ్లీ మోదీతో చేతులు కలిపారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తన మద్దతుపై ఆధారపడి ఉన్నప్పటికీ విర్రవీగకుండా అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారు. రాజకీయాలలో ఆయనతో తలపడాలనుకుంటున్న కేసీఆర్ ఓడిపోయింది ఒక్క 2023 ఎన్నికల్లోనే. అయినా ఆగమాగం అయిపోతున్నారు. ఎన్నికల్లో తాను ఎందుకు ఓడిపోయానో గుర్తించడానికి కేసీఆర్ ఇప్పటికీ నిరాకరిస్తున్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారని చెబుతున్నారే గానీ, అధికారంలో ఉన్నప్పుడు తాము అహంకారంతో వ్యవహరించినందునే ప్రజలు ఓడించారని గుర్తించడానికి ఇష్టపడటం లేదు. కాంగ్రెస్ పార్టీ కొత్తగా హామీలు ఇవ్వకపోయినా కేసీఆర్‌ను ప్రజలు ఓడించి తీరేవారన్నది వాస్తవం. ఉద్యమ సమయంలో ప్రజల్లో ఉండే భావోద్వేగాలు ఎల్లకాలం ఉండవని కేసీఆర్ ఎందుకో గుర్తించడానికి కూడా ఇష్టపడటం లేదు. రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం అవుతున్నా ఇప్పటికీ పాత వ్యూహాలతోనే సెంటిమెంటునే ఆసరాగా చేసుకోవాలని కేసీఆర్ భావించడం ఆశ్చర్యంగా ఉంది. గత ఎన్నికల్లో తనను ఓడించిన ప్రజల మీద అలిగి రెండేళ్లుగా కేసీఆర్ ఫాంహౌజ్‌కే పరిమితమయ్యారు. చంద్రబాబు ఎన్నికల్లో ఓడినప్పుడు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకుండా ముఖం చాటేయలేదు. 2024కు ముందు జగన్ అండ్ కో నుంచి శాసనసభలో ఎన్ని అవమానాలు ఎదురైనా జంకకుండా హాజరయ్యారు. పార్టీని నిలబెట్టుకున్నారు. చివరికి తన సతీమణిని ఘోరంగా అవమానించడంతో తట్టుకోలేక కౌరవ సభగా మారిన గౌరవ సభలోకి మళ్లీ ముఖ్యమంత్రిగానే వస్తానని చెప్పి బహిష్కరించారు. చంద్రబాబును హేళన చేసే కేసీఆర్ మాత్రం శాసనసభకు వెళ్లడానికి ఇష్టపడటం లేదు. తన గురించి తాను అతిగా ఊహించుకోవడం వల్లనే ఆయన శాసనసభకు హాజరవడానికి ఇష్టపడటం లేదు. చంద్రబాబును ఏవగించుకోవడం వల్ల కేసీఆర్‌కు కలిగే ప్రయోజనం ఏమిటో తెలియదు. రాజకీయాలలో తాను చంద్రబాబు కంటే అధికుడనని భావించి లాభం లేదు. రుజువు చేసుకోవాలి. వరుస ఎన్నికల్లో ఓడిపోతున్న పార్టీని తిరిగి విజయతీరాలకు చేర్చినప్పుడే కేసీఆర్ కూడా మొనగాడు అవుతారు. అంతేగానీ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబును తిట్టిపోయడం వల్ల ప్రయోజనం ఉండదు.

రాజకీయాలలో తాను చంద్రబాబు కంటే అధికుడనని భావించి లాభం లేదు. రుజువు చేసుకోవాలి. వరుస ఎన్నికల్లో ఓడిపోతున్నా పార్టీని తిరిగి విజయ తీరాలకు చేర్చినప్పుడే కేసీఆర్ కూడా మొనగాడు అవుతారు. అంతేగానీ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబును తిట్టిపోయడం వల్ల ప్రయోజనం ఉండదు.



ఏ రాజకీయ నాయకుడైనా సొంత ప్రాంత ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలు చేయరు కదా? చంద్రబాబుతో స్నేహం ఉండడం వల్ల తెలంగాణలో రేవంత్‌రెడ్డికి రాజకీయంగా కొంత ప్రయోజనం చేకూరుతోంది. తెలుగుదేశం పార్టీ ఓటర్లు, అభిమానులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తమ వాడుగా చూసుకుంటున్నారు. పార్టీలతో నిమిత్తం లేకుండా ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. చంద్రబాబుతో శత్రుత్వం పెట్టుకోవడం వల్ల తెలంగాణలో తనకు రాజకీయ లబ్ధి చేకూరుతుందని కేసీఆర్ తలపోస్తున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు–రేవంత్ కుమ్మక్కయి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని కేసీఆర్ కొత్త పల్లవి అందుకున్నారు. ఈ ఆరోపణల్లో హేతుబద్ధత లేకపోయినా ప్రస్తుతానికి ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని కేసీఆర్ అండ్ కో భావిస్తూ ఉండవచ్చు. ప్రజల్లో సెంటిమెంటును రగిలించడానికి ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు పెట్టాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టుగా ఉంది. రాజకీయంగా ఆయన ఎత్తుగడలను తప్పుబట్టాల్సిన అవసరం లేదు. అయితే సందర్భం ఉన్నా లేకపోయినా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కేసీఆర్ అవమానించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనివల్ల ఆయనకు కలిగే రాజకీయ ప్రయోజనం ఏమిటో తెలియదు!

ఆ ఇద్దరికీ అదే తేడా..!


జాతీయ రాజకీయాలలో కాంగ్రెస్–బీజేపీలకు అసలు పొసగదు. అయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు నెరపడానికే ప్రయత్నిస్తున్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ ఈ పని చేయకపోగా కేంద్రంపై కాలు దువ్వేవారు. ఆ కారణంగా తెలంగాణ రాష్ట్రం నష్టపోయింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు కేంద్రం నుంచి గరిష్ఠంగా ప్రయోజనం పొందుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారన్న అభిప్రాయం తెలంగాణ ప్రజల్లో కూడా ఏర్పడింది. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా తెలంగాణపై తనకే పవర్ ఆఫ్ అటార్నీ ఉన్నట్టుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా రేవంత్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్ వాడుతున్న భాషను తెలంగాణ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రజలు అభివృద్ధిని మాత్రమే కోరుకుంటున్నారు. తెలంగాణ సెంటిమెంటుకు ఇప్పుడు తావు లేదు. చంద్రబాబు–రేవంత్ మధ్య సఖ్యత ఉన్నందున ఇరు రాష్ట్రాల మధ్య సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు. ఇలాంటి వ్యవహారాల్లో కేసీఆర్ పెద్దరికం చూపితే ప్రజలు హర్షిస్తారు గానీ, తంపులు పెట్టడాన్ని హర్షించరు. కేసీఆర్–రేవంత్‌రెడ్డి ఒకరినొకరు రాజకీయంగా దెబ్బతీసుకోవాలని అనుకోవడం తప్పు కాదు. ఆ క్రమంలో కక్షపూరితంగా వ్యవహరిస్తే మాత్రం తెలంగాణ సమాజం ఆమోదించదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దెబ్బతీయడానికి చంద్రబాబును తెరమీదకు తేవడం ద్వారా తెలంగాణ సెంటిమెంటును రగిలించే ప్రయత్నాలను కేసీఆర్ మళ్లీ మొదలుపెట్టడంతో దీనికి విరుగుడుగా తెలంగాణలో వెలమ సామాజిక వర్గాన్ని ఒంటరి చేయడానికి రేవంత్‌రెడ్డి వ్యూహరచన చేశారు. రావులంతా ఏకమై వచ్చినా తనను ఏమీ చేయలేరని రేవంత్ రెడ్డి సవాలు చేయడం వెనుక ఆంతర్యం ఇదే. రెడ్డి సామాజిక వర్గాన్ని తన వెనుక సంఘటితం చేసుకోవాలన్న లక్ష్యంతోనే రావులు అన్న పదాన్ని రేవంత్‌రెడ్డి ప్రయోగించి ఉంటారు. తాను రాజకీయం చేసినంత కాలం రావులను అధికారంలోకి రానివ్వబోనని ఆయన శపథం కూడా చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచాలనుకోవడం వల్ల రెడ్డి సామాజిక వర్గం కినుక వహించిందన్న ప్రచారం కొంత కాలంగా జరుగుతోంది. దీంతో రెడ్డి సామాజిక వర్గాన్ని తనకు అనుకూలంగా సంఘటితం చేసుకోవడానికే రావులు అంటూ వెలమ సామాజిక వర్గాన్ని ముఖ్యమంత్రి తెరమీదకు తెచ్చారు. కల్వకుంట్ల చంద్రశేఖరరావు, తారక రామారావు, హరీశ్‌రావులను మళ్లీ అధికారంలోకి రానివ్వనని చెప్పడం అసంతృప్తితో ఉన్న రెడ్లను ఉత్తేజపరచడానికే అన్న అభిప్రాయం ఉంది. తెలంగాణలో కుల గణన చేసిన రేవంత్‌రెడ్డి బీసీల సంఖ్య ఇంత అని ప్రకటించారే గానీ బీసీలలో ఏ కులం వాళ్లు ఎంత మందో ఎక్కడా ప్రకటించలేదు. ఇది చాలా తెలివైన నిర్ణయం. కులాలవారీగా జనాభా లెక్కలు ప్రకటించి ఉంటే బీసీ కులాల మధ్య గొడవలు జరిగేవి. కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ తప్పు చేశారు. ఫలితంగా అక్కడ బీసీల మధ్య గొడవలు మొదలయ్యాయి. బీసీలు అంటే ఎన్నో కులాల సమూహం. ఎవరికి వారు తమ కులం జనాభా ఎక్కువ అని భావిస్తుంటారు. ఈ కారణంగా కులాలవారీగా బీసీల జనాభా వివరాలు ప్రకటించకూడదని రేవంత్‌రెడ్డి నిర్ణయించుకున్నారు. ఇలాంటి విషయాలలో రేవంత్‌రెడ్డి తెలివిగా అడుగులు వేస్తూ ఇటు ప్రజల్లోనూ అటు పార్టీలోనూ తన పట్టు పెంచుకుంటున్నారు. ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రాఫ్ పెరిగింది. పార్టీలో ధిక్కార స్వరాలు కూడా సర్దుకున్నాయి. మంత్రివర్గంపై ఆయనకు పట్టు లభించింది. వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రినని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు ప్రకటించుకోవడం అసాధారణం. రేవంత్‌రెడ్డి ఈ మధ్య అటువంటి ప్రకటన చేయడం ఆయనలోని ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. అధికార యంత్రాంగం కూడా ఇప్పుడిప్పుడే దారిలోకి వస్తోంది. కేసీఆర్ అండ్ కో మాత్రం రేవంత్‌ను ఇప్పటికీ తక్కువ అంచనా వేస్తోంది. తెలుగుదేశం పార్టీ నుంచి వెళ్లి కాంగ్రెస్‌లో చేరి అనతి కాలంలోనే ముఖ్యమంత్రి కాగలగడం మామూలు విషయం కాదు. అయితే రేవంత్‌రెడ్డి షార్ట్ కట్‌లో ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ప్రభృతులు విమర్శిస్తున్నారు. కోటా ఏదైనా రేవంత్ రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి. ఆ పదవిలో ఆయన ఇప్పటికే రెండేళ్లు పూర్తిచేసుకున్నారు. మిగతా మూడేళ్లు కూడా ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారనడంలో సందేహం లేదు. అయినా ఆయనను ముఖ్యమంత్రిగా గుర్తించం అని కేసీఆర్ అండ్ కో భావిస్తే అది వారిష్టం. భాష విషయంలో కూడా కేసీఆర్, రేవంత్, కేటీఆర్ సంయమనం పాటించాలి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి 'నీ అవ్వ' అని బహిరంగ సభలో మాట్లాడటం తప్పు. ఒక ముఖ్యమంత్రి నోటి నుంచి అలాంటి మాటలు రావడాన్ని ప్రజలు హర్షించరు. అయితే ఇందుకు ప్రతిగా కేటీఆర్ మాట్లాడిన మాటలు మరీ నేలబారుగా ఉన్నాయి. తన తండ్రిని దూషించిన రేవంత్‌రెడ్డిపై తనకు చాలా కోపంగా ఉందని, దొరికితే ఎడమ కాలు చెప్పుతో కొట్టాలని ఉందని అన్నారు. ముఖ్యమంత్రిని పట్టుకొని చెప్పుతో కొడతానని అనడం అభ్యంతరమే కాదు.. నేరం కూడా. ముఖ్యమంత్రిగాడు అని కూడా పరుషంగా మాట్లాడారు. వ్యక్తిగా రేవంత్‌రెడ్డి వేరు. ఆయన ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి. మనకు ఇష్టం లేకపోయినా ముఖ్యమంత్రిగా ఆయనను గౌరవించాలే గానీ వాడు–వీడు అనడం ఏమిటి? ఇలాంటి మాటలు, ఇలాంటి ప్రవర్తన వల్లే 'వాళ్లకు ఇంకా దిగలేదని' తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు. 2024 ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నవారు బూతు భాషను అధికార భాషగా మార్చుకొని పదకొండు సీట్లకే పరిమితమైన విషయం తెలంగాణలోని రాజకీయ నాయకులు గుర్తించకపోవడం విషాదం. అభివృద్ధిలో పోటీ పడడంలో తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలబడాలి కానీ ముతక భాష ప్రయోగంలో కాదు. ఇకనైనా మన నాయకులు తెలుగు జాతికి తలవంపులు తెచ్చే మాటలు కట్టిపెడతారని ఆశిద్దాం!

ఇది క్వాంటమ్ నామ సంవత్సరం

ఒకప్పుడు కంప్యూటర్, హైటెక్... వంటి పదాలు రాజకీయాలను హడావిడి చేసినట్టు; ఇప్పుడు 'క్వాంటమ్' అనే మాట బహుళ ప్రచారంలో ఉంది. క్వాంటమ్ కంప్యూటర్, క్వాంటమ్ వ్యాలీ, క్వాంటమ్ కంప్యూటేషన్... వంటి పలు మాటలు తరచూ వినపడుతున్నాయి. నిజానికి ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2024 జూన్ 7న తీసుకున్న నిర్ణయం ప్రకారం 2025 సంవత్సరం 'అంతర్జాతీయ క్వాంటమ్ శాస్త్ర సాంకేతిక సంవత్సరం' (ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీ). సాధారణ ప్రజానీకానికి క్వాంటమ్ సైన్సు ఉపయోగాలను తెలియజెప్పడం; రాబోయే క్వాంటమ్ విప్లవం గురించి ప్రస్తావించడం... మొదలైన ఉద్దేశ్యాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే 1925 మధ్యలో వెర్నర్ హైసెన్‌బర్గ్ (Werner Heisenberg) తన మేట్రిక్స్ మెకానిక్స్ గురించి ప్రతిపాదించాడు. దీనిని క్వాంటమ్ శాస్త్రానికి తొలి అడుగు అనుకుంటే, దీనికి పరాకాష్ఠ అనదగ్గ వేవ్ మెకానిక్స్‌కు సంబంధించిన పరిశోధనా పత్రాలను ఎర్విన్ ష్రూడింజర్ 1926 జనవరి–జూలై మధ్య ప్రకటించాడు. 2025 క్వాంటమ్ మెకానిక్స్‌కు శతవార్షిక సంవత్సరం.

వందేళ్లుగా భౌతిక శాస్త్రానికి సంబంధించిన అన్ని విభాగాలనూ క్వాంటమ్ మెకానిక్స్ విశేషంగా ప్రభావితం చేసింది. 1895 ప్రాంతంలో భౌతిక శాస్త్రానికి సంబంధించి అంతా స్పష్టంగా తెలిసిపోయిందనే అభిప్రాయానికి వస్తున్నవేళ, క్లాసికల్ ఫిజిక్స్ వివరించలేని రీతిలో బ్లాక్ బాడీ రేడియేషన్, ఫొటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్, పరమాణువుల స్థిరత్వం వంటివి ఎదురయ్యాయి. మరోవైపు కణమా తరంగమా అనే ద్వైదీ భావం, అనిశ్చితత్వ సూత్రం, పౌలి వర్జన నియమం వంటివి ముందుకు వచ్చాయి. పూర్తిగా సాఫీగా నడుస్తున్నదనుకుంటున్న సమయంలో ఈ కొరకరాని కొయ్యలు వంటివి తారసపడటంతో ఈ ఆవిష్కరణల సముదాయాన్ని ఎలా పిలవాలో తెలియక, తాత్కాలికంగా 'న్యూ ఫిజిక్స్' అని పిలిచారు. చివరకు అదే పేరు స్థిరపడింది. దీనికి శిఖరమాన స్థాయిగా క్వాంటమ్ మెకానిక్స్ పూర్తిస్థాయిలో 1926–27 కాలానికి నిలదొక్కుకోవడం చరిత్ర.

1900లో మాక్స్ ప్లాంక్ (Max Plank) అనే శాస్త్రవేత్త బ్లాక్ బాడీ రేడియేషన్‌ను వివరించడానికి 'క్వాంటమ్' (అంటే ఎనర్జీ ప్యాకెట్ లేదా శక్తి పొట్లం అనే అర్థంతో చేసిన) భావన క్వాంటమ్ మెకానిక్స్ విభాగానికి శ్రీకారం చుట్టింది. అంతవరకు బోధపడని ఫొటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్‌ను వివరించడానికి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ తన ప్రత్యేక సాపేక్షతా సిద్ధాంతాన్ని 1905లో, తర్వాత సాధారణ సాపేక్షతా సిద్ధాంతాన్ని 1915లో ప్రకటించాడు. 1913లో నీల్స్‌బోర్ తన అణు సిద్ధాంత ప్రతిపాదనను చేశాడు. తర్వాత కోపెన్ హెగెన్ 1917లో కాంప్లిమెంటారిటీ సూత్రాన్ని ప్రతిపాదించాడు. తర్వాత లూయిస్ డిబ్రోగ్లీ తరంగ– కణ భావన (1924), వెర్నర్ హైసన్‌బెర్గ్ మాట్రిక్స్ మెకానిక్స్ (1925), ఎర్విన్ ష్రూడింజర్ వేవ్ మెకానిక్స్ (1926) ముందుకొచ్చాయి. పిమ్మట మాక్స్ బోర్న్, పాల్ డిరాక్, ఎన్రికో ఫెర్మి, సత్యేంద్రనాథ్ బోస్, రిచర్డ్ ఫెనీమన్ వంటి శాస్త్రవేత్తలు 1940 దాకా అద్భుతమైన రీతిలో వివిధ భావనలను ప్రతిపాదించి 'క్వాంటమ్ ఎలక్ట్రో డైనమిక్స్' అనే పూర్తి సాపేక్షతాపరమైన 'క్వాంటమ్ ఫీల్డ్ థియరీ'ని ప్రకటించారు. (ఈ సిద్ధాంతానికే 1965లో నోబెల్ బహుమతి లభించింది.) అయితే ఆయువుపట్టు వంటి సూత్రీకరణలు 1925–26లలో వచ్చాయి కనుక, క్వాంటమ్ మెకానిక్స్ శతవార్షికం 2025లో జరపాలని నిర్ణయించారు.




ఈ క్వాంటమ్ మెకానిక్స్ విభాగం రావడంతో అంత వరకు అధికారం చెలాయించిన క్లాసికల్ మెకానిక్స్ ప్రాభవం పడిపోయింది. అలాగే పరమాణు నిర్మాణం, అణువుల మధ్య రసాయన బంధనం వంటివి సులువుగా బోధపడటం మొదలైంది. దాంతో మొత్తం రసాయనశాస్త్ర పునాదులు మారిపోయాయి. ఇక ఆప్టిక్స్ విభాగమైతే పూర్తిగా పునర్జన్మ పొందింది. ఇక 'సాలిడ్ స్టేట్ ఫిజిక్స్'గా ఇంతకాలం పిలుచుకున్న 'కండెన్స్‌డ్ మ్యాటర్ ఫిజిక్స్' కొత్తగా వచ్చి చేరింది. అంటే సెమీ కండక్టర్స్‌కు సంబంధించిన టెక్నాలజీ. ఇప్పుడు నానో టెక్నాలజీ హవా నడుస్తోంది.

భౌతికశాస్త్ర విభాగాలను రూపు మార్చడం కాకుండా, పూర్తిగా కొత్త పునాదుల మీద నిలబెట్టింది, మరో విధంగా చెప్పాలంటే ఫిజిక్స్‌ను ఫిలాసఫీ దరిదాపులకు కూడా తీసుకెళ్లింది క్వాంటమ్ మెకానిక్స్ చట్రమే. దీని గురించి చర్చ మొదలు పెడితే అది ఇంకో పార్శ్వం అవుతుంది.

ఇక మనకు సహజంగా తోచే సందేహం ఏమిటంటే 'క్వాంటమ్ కంప్యూటర్స్' అనేవి ఇప్పుడున్న కంప్యూటర్స్ కన్నా ఏ రకంగా విభిన్నమని? మౌలికమైన తేడా ఏమిటంటే కంప్యూటర్‌లో 'బిట్' అనేది ఆధార భూతమైతే, క్వాంటమ్ కంప్యూటర్‌లో 'క్యూబిట్' అవుతుంది. సులువుగా బోధపడే పోలికగా చెప్పాలంటే ఇప్పుడు వాడే కంప్యూటర్ ఎలాంటిదంటే పెద్ద లైబ్రరీలో ఒక్కో పుస్తకాన్ని తీసి చూడటం లాంటిది. అలా కాకుండా ఆ లైబ్రరీలోని అన్ని పుస్తకాలను ఏకకాలంలో సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలిస్తూ, తప్పులను ఎక్కడికక్కడ తీసివేస్తూ, మన అవగాహనను సవరించుకుంటూ, సరైన విషయాన్ని త్వరగా తేల్చి వివరించడం వంటిది క్వాంటమ్ కంప్యూటర్ చేసే పని. దీని కారణంగా కంప్యూటింగ్, సెన్సింగ్, కమ్యూనికేషన్, క్రిప్టోగ్రఫీ వంటి విభాగాలు సమూలంగా మారే అవకాశం ఉంది. అలాగే రోగాల లోతుపాతులు మరింత బోధపడటం, మెరుగైన ఔషధాలు రావడం, ఆరోగ్య సేవలు మెరుగుపడడం, వాతావరణాన్ని ఇంకా బాగా అంచనా వేయగలగడం, గ్లోబల్ నెట్‌వర్క్‌లలో మరింత భద్రత సాధించడం వంటివి సులభ సాధ్యమవుతాయి.

సులువుగా అర్థమయ్యేట్టు చెప్పాలంటే పదార్థం, శక్తి... ఈ రెండింటి మధ్య జరిగే చర్యలను వివరించేది భౌతికశాస్త్రం. పదార్థం, శక్తి ఈ రెండింటి ప్రవర్తనలను సూక్ష్మాతిసూక్ష్మంగా వివరించగలిగేది 'క్వాంటమ్ మెకానిక్స్'. దీని కారణంగా 2040 నాటికి గ్లోబల్ ఎకానమీ చాలా పెద్ద ఎత్తున పెరిగే అవకాశం ఉందని ఒక అంచనా. దీని కోసం గూగుల్, ఐబీఎం, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ఒక్క 2024లోనే సుమారు 6 బిలియన్ డాలర్లు వెచ్చించాయంటున్నారు. కనుక ఇక నుంచి మరిన్ని అద్భుతమైన ఆవిష్కరణలు, అనువర్తనాలు పురుడు పోసుకుంటాయని చెప్పుకున్నా అతిశయోక్తి కాదు.

• డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు





గ్రేటర్ గుంటూరుకు.. ఆమోదం

- మిలీనియం సిటీగా నగర పరిధి పెంపు
- 18 గ్రామాలు విలీనానికి కౌన్సిల్ అంగీకారం
- శంకర్ విలాస్ ఆర్వోబీపై కార్పొరేటర్ల మధ్య వార్
- అధికారులు తన మాట వినడంలేదన్న మేయర్ రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మండలంలోని లాల్‌పురం, చల్లావారిపాలెం, వెంగళాయ పాలెం, మల్లవరం, చిన్న పలకలూరు, తోక వారిపాలెం, తురకపాలెం, గొర్లవారిపాలెం, ఓబుల్ నాయుడుపాలెం, జొన్నలగడ్డ, పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు, వెనిగండ్ల, పెదకాకాని, తక్కెళ్ళపాడు, చంద్రపాలెం, వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు, పుల్లడిగుంట, తాడికొండ మండలం లాం గ్రామాల విలీనంతో గుంటూరు మహానగరంగా విస్తరించనున్నది. ఈ మేరకు శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో నగర పాలక సంస్థ ఆమోదం తెలిపింది. గుంటూరును మహా నగరపాలక సంస్థగా మార్చేందుకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసినట్లు మేయర్ కోవెలమూడి రవీంద్ర ప్రకటించారు. నగరాన్ని మిలీనియం సిటీ కాన్సెప్ట్‌లో భాగంగా మహా నగరపాలక సంస్థగా విస్తరించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, ఇందులో భాగంగా 18 గ్రామాలను విలీనం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మిలీనియం సిటీ కాన్సెప్ట్‌లో భాగంగా రాజమండ్రి, కాకినాడ తిరుపతి, విశాఖపట్నం నగరాలకు దీటుగా గుంటూరును అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బుర్లా రామాంజనేయులు తెలిపారు. శంకర్ విలాస్ ఆర్వోబీపై టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించారని వైసీపీ కార్పొరేటర్లు చేసిన వ్యాఖ్యలపై టీడీపీ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్ తీవ్రంగా స్పందిస్తూ అసత్య ఆరోపణలు తగవన్నారు. ఆర్వోబీ భూసేకరణ 80 శాతం పూర్తయిందని, అవగాహన లేక కోర్టుకు వెళ్లిన వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇందుకోసం నగరపాలక సంస్థ రూ.30 కోట్లు కేటాయించిందన్నారు. సాంబశివ, ఉత్తమ యాడ్స్ నిర్వాహకులు అడ్డగోలుగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తుండగా వారికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని కొంతమంది కార్పొరేటర్లు ఆరోపించారు.

వచ్చే ఏడాది మార్చిలోగా అక్రమ హోర్డింగ్‌లను తొలగిస్తామని కమిషనర్ తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు తన మాట కూడా వినడం లేదని, విధుల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని మేయర్ వారిపై మండిపడ్డారు. 31 డివిజన్ ఏఈ ఫోన్ కూడా ఎత్తడం లేదన్నారు. గతంలో రూ.22 కోట్ల పనులకు అడ్డగోలుగా ఆమోదం తెలిపారని వాటి డేటా కూడా లేదని బిల్లులు ఎలా చెల్లించాలని కమిషనర్ ప్రశ్నించారు. మొత్తం 167 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు మేయర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్లు షేక్ సజల, డైమండ్‌బాబు తది తరులు పాల్గొన్నారు.



మేయర్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కార్పొరేటర్లు

రేషన్‌లో.. గోధుమ పిండి



కార్డు దారులకు కేజీ రూ.20కే

- 1వ తేదీ నుంచి పంపిణీకి ఏర్పాట్లు
- మూడు జిల్లాలకు 447104 ప్యాకెట్లు కేటాయింపు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం ప్రారంభ నెల, సంక్రాంతి పర్వదినం సందర్భంగా జనవరి నుంచి రేషన్‌కార్డుదారులకు బియ్యం, పంచదార, జొన్నలతో పాటు గోధు మ పిండి(హోల్ వీట్ ఆటా) పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోన్నది. బహిరంగ మార్కెట్‌లో హోల్ వీట్ ఆటా కేజీ రూ. 40 నుంచి ప్రారంభమౌతున్నది. దీనిని సగం ధర రూ.20 కే కేజీ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి స్టాకు కేటాయింపులు జరి గాయి. గుంటూరు జిల్లాలో గోధుమపిండి వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం 2,68,709 కేజీ ప్యాకెట్లను సివిల్ సప్లయిస్ గోడౌన్లలో స్టాకు పెడుతున్నది. అలానే బాపట్ల జిల్లాకు 58,718 కేజీ ప్యాకెట్లు, పల్నాడు జిల్లాకు 1,19,677 ప్యాకెట్లను కేటాయించింది. గోధుమ పిండికి డీలర్ల నుంచి ముందుగానే నగదు చెల్లించుకుని సరఫరా చేసేందుకు సిద్ధమైంది. ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి గోధుమపిండి ప్యాకెట్లను నెలాఖరు లోపే రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఒకటో తేదీ నుంచి డీలర్లు రేషన్ సరుకుల్లో గోధుమ పిండి పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. డీలర్లకు ఇచ్చే రూ.1 కమీషన్‌ని కూడా రూ.20 ధరలోనే చేర్చారు. దీని వలన అదనంగా ఎలాంటి చార్జీలు వసూలు చేయరాదని రేషన్ డీలర్లకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కార్డుదారులు జనవరి నెల రేషన్ సరుకుల కోసం డిపోలకు (మిగతా 8వ పేజీలో)

గత నెలలో జొన్నలు..

గత నెలలో రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం బియ్యంతో పాటు జొన్నల పంపిణీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందుకోసం గుంటూరు జిల్లాకు 17 లక్షల 70 వేల 982 కేజీలు, పల్నాడుకు 18,99,399 కేజీలను కేటాయిస్తోన్నది. జొన్నలను కార్డుదారులు 3 కేజీల వరకు తీసుకునే వెసులుబాటు ఉంది. అంతకు సమానంగా బియ్యం కోటాని తగ్గిస్తారు.



ఆకలితో నకనక

- సాయంత్రాలు ఖాళీ కడుపుతో పది విద్యార్థుల అవస్థలు
- అల్పాహార పంపిణీ ఎప్పుడని తల్లిదండ్రుల ప్రశ్న
- త్వరగా అమలు చేయాలని ఉపాధ్యాయుల వినతి

యూనిఫైడ్ సర్వేకు ఎస్‌వోపీ జారీ



8

- వెనువెంటనే నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు
- సచివాలయాల సెక్రెటరీలకు యాప్ లింక్‌ల జారీ
- అప్‌డేటెడ్ డేటా నిక్షిప్తానికి ఆదేశాలు

విద్యతోనే అభివృద్ధి

- జూలకల్లు అభివృద్ధికి నిధులందిస్తా ఎమ్మెల్యే యరపతినేని

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్
- జిల్లెళ్ళమూడిలో యోగాసనాల పోటీలు ప్రారంభం

మిస్ 'ఆంధ్ర'గా పరిటాల దివ్య

నారాకోడూరులో దారుణ హత్య

6

జరీబుపై సర్వే సంపూర్ణం

- కమిటీ నివేదిక రాగానే తుది నిర్ణయం
- 1వ తేదీ నుంచి రాజధాని గ్రామాల్లో అభివృద్ధి పనులు
- త్రీమన్ కమిటీ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని

తుళ్లూరు, గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో జరీబు భూముల వివాదంపై సర్వే పూర్తైనట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రాజధాని రైతు సమస్యలు, అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై త్రీమన్ కమిటీ శనివారం రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో సమావేశమైంది. రైతులతో వివిధ అంశాలపై పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు రాష్ట్ర మంత్రి పి. నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌ల సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. జరీబు భూముల వాస్తవికతని నిర్ధారించేందుకు ఏర్పాటైన కమిటీ త్వరలోనే నివేదికని అందించనుందన్నారు. ఆ నివేదిక ఆధారంగా జరీబు భూముల విషయంలో తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. పది సెంట్లు కంటే తక్కువ ప్లాట్లు ఉన్న 415 మంది సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామన్నారు. 2013 కంటే ముందు వివిధ పనుల కోసం ప్రభుత్వానికి భూములు ఇచ్చిన రైతులు కూడా తమను భూసమీకరణ కింద పరిగణించమని కోరుతున్నారని, అయితే అవి చట్టపరంగా సాధ్యం కావడం లేదన్నారు. లంక భూముల విషయంలో 356 మందికి 79 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. గన్నవరం విమానాశ్రయానికి భూములు ఇచ్చిన రైతులకు సీఆర్‌డీఏలో ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్ల సమస్యలపై కూడా చర్చించినట్లు తెలిపారు. హెల్త్ కార్డ్స్, పెన్షన్లు తదితర అంశాలపై కూడా చర్చించామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పనులను జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాళ్లు, రోడ్ల నిర్మాణాలు, శ్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో తొలగించిన నాలుగు వేలకు పైగా పింఛన్లను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నామన్నారు. కొత్తగా పెళ్లయిన వారికి కూడా పెన్షన్లు అందజేయాలని చూస్తున్నామన్నారు. శుక్రవారం జరిగిన గ్రామసభలో గుండెపోటుతో మరణించిన రామారావు అనే రైతు తమకు అందించే భూమి ఎక్కడ వస్తుందో స్పష్టంగా చెప్పాలని కోరారని.. ఆయన మామూలుగా మాట్లాడుతూ ఉండగా అనుకోకుండా జరిగిన ఘటనను కొన్ని పత్రికలు, వైసీపీ నాయకులు శవాల మీద రాజకీయాలు చేస్తున్నాయన్నారు. ఏమీ లేని చోట ఇలాంటి దుష్ప్రచారాన్ని చేయడం మానుకోవాలని కోరారు.



సమావేశంలో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

వర్గీకరణకు రాష్ట్ర స్థాయి కమిటీ

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో జరీబు/మెట్ట భూముల వర్గీకరణని పునర్‌పరిశీలించి తుది నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్ర స్థాయి కమిటీని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఏర్పాటు చేసింది. రాజధాని గ్రామాల్లోని 202.205 ఎకరాల భూమిపై వివాదం నెలకొనగా చాలామంది తమ భూమి జరీబు అని క్లెయిమ్ చేస్తున్నారు. అయితే అధికారులు మెట్టగా నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. వీటిపై పరిశీలనకు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, భూగర్భ జల శాఖ జేడీ ఎన్ శ్రీనివాస్, ఏపీఎంఐపీ పఈవో ఎం వెంకటేశ్వర్లు, సర్వే శాఖ జేడీ కెజియా, వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ శ్రీధర్‌ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ చేసి భూములను వర్గీకరిస్తుంది. జీవో ఎంఎస్ నంబరు. 165 ప్రకారం డాక్టర్ కేఎల్ రావు సాగర్ పులిచింతల స్పెషల్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటై జిల్లా స్థాయి కమిటీ ఏ మార్గదర్శకాలను అయితే పాటించి భూములను వర్గీకరించిందో ఆ ప్రకారం కమిటీ విచారణ చేపడుతుంది. 2014 డిసెంబరు 8వ తేదీకి ముందు భూములు ఏ కేటిగిరీలో అయితే ఉన్నాయో వాటిని పరిగణిస్తారు. శాటిలైట్ చిత్రాలను కూడా తీసుకుంటారు. ప్రస్తుతం ఉన్న బోర్‌వెల్స్ ఎప్పుడు వేశారనేది నిర్ధారించడానికి ఉపగ్రహ చిత్రాలను వినియోగిస్తారు. 45 రోజుల వ్యవధిలో కమిటీ తన నివేదికని కలెక్టర్‌కు అందజేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది.



గ్రీవెన్స్‌కు వచ్చిన దివ్యాంగులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

దివ్యాంగుల గ్రీవెన్స్‌కు స్పందన

64 ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ అన్సారియా

గుంటూరు(తూర్పు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం తర్వాత కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన దివ్యాంగుల గ్రీవెన్స్‌డేకు విశేష స్పందన లభించింది. శంకరన్ సమావేశ మందిరం వద్ద కలెక్టర్ తమీమ్ అన్సారియా విభిన్న ప్రతిభావంతుల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులకు అందించారు. పలు సమస్యలపై మొత్తం 64 అర్జీలను అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అనేక సవాళ్లతో జీవిస్తుంటారని, వారికి సమస్యలు మరింత భారం కాకూడదన్నారు. సానుకూల దృక్పథంతో సాధ్యమైనంత మేరకు పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉన్న విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ పోస్టుల ఖాళీల వివరాలను బుధవారం నాటికి అందించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అమలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల్లో దుకాణాల కేటాయింపుల్లో, ఇతర పథకాల అమల్లో విభిన్న ప్రతిభావంతులకు 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల్లోను విభిన్న ప్రతిభావంతులు నిర్వర్తించే ఉద్యోగాల నియామకాలకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ర్యాంపులు, లిఫ్టులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ నెల నాలుగో శనివారం విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కే ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, డీఆర్డీఏ, హౌసింగ్ పీడీలు విజయలక్ష్మి, ప్రసాదు పాల్గొన్నారు.

31నే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరం 2026 జనవరి ఒకటో తేదీని పురస్కరించుకుని జిల్లాలో ఈ నెల 31నే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 2,55,240 మంది పింఛన్‌దారులకు సంబంధించి రూ.111.24 కోట్లను ప్రభుత్వం ముందస్తుగా సంబంధిత బ్యాంకుల్లో జమ చేసిందన్నారు. సిబ్బంది 30న బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకుని 31న పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆ రోజున అందుబాటులో లేని వారికి 2న పంపిణీ చేయాలన్నారు.

కను..మురుగు

- మురుగు నీరు శుద్ధికి చర్యలు
- 8 మున్సిపాల్టీల్లో ఎస్టీపీల నిర్మాణం
- ఏజెన్సీని ఎంపిక చేయనున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్
- పట్టణాల్లో మురుగునీటి సమస్య పరిష్కారం దిశగా అడుగులు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పట్టణాల్లో ప్రధాన సమస్యగా మారిన మురుగుకు చెక్ పడనున్నది. అధ్వానంగా మారిన డ్రెయిన్లు.. మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో వాతావరణంతో పాటు భూగర్భ జలాలు, తాగునీరు కలుషితమవుతున్నాయి. మురుగుపై పర్యావరణవేత్తలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ప్రజలు కూడా అంటు వ్యాధులన బారిన పడుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎనిమిది పురపాలక సంఘాల్లో మురుగునీటి శుద్ధి కర్మాగారాలు(సీవేజ్ ట్రీట్‌మెంట్ (మిగతా 8వ పేజీలో)



సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నమూన

పల్నాడు జిల్లా : మాచర్లలో లింగాపురం కాలనీ వద్ద 9.900 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్‌టీపీని 1.98 ఎకరాల్లో, సత్తెనపల్లిలో రైల్వే గేటు వద్ద 9.470 ఎంఎల్‌డీ ప్లాంట్‌ని 1.89 ఎకరాల్లో, రేపల్లె లోని ఇసుకపల్లి, బేతపూడి వద్ద 5.600 ఎంఎల్‌డీ ప్లాంట్‌ని 1.12 ఎకరాల్లో, బేతపూడి రోడ్డులో 2.400 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లని 0.48 ఎకరాల్లో నిర్మించనున్నారు.

బాపట్ల జిల్లా: మరుప్రోలు వారిపాలెంలో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో రెండు ప్లాంట్లను ఎకరం భూమిలో, మూలపాలెంలో 2.180 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మూడు ప్లాంట్లని 0.44 ఎకరాల్లో, చీరాలలోని దేవంగపురిలో 7.120 ఎంఎల్‌డీ ప్లాంట్‌ని 1.42 ఎకరాల్లో నిర్మించనున్నారు.

గుంటూరు జిల్లా: పొన్నూరులోని చేనేత కాలనీలో 7.800 ఎంఎల్‌డీ ప్లాంట్‌ని 1.56 ఎకరాల్లో నిర్మించ నున్నారు.

ముక్కోటికి ఏర్పాట్లు ముమ్మరం

- మంగళాద్రిలో 30న నృసింహుని ఉత్తర ద్వార దర్శనం

మంగళగిరి సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ముక్కోటి ఉత్సవాలకు అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 16న ఆండాళ్ ఉత్సవంతో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 29, 30 తేదీల్లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరగనున్నాయి. 29న రాత్రి 8 గంటలకు స్వామివారిని జగన్మోహినిగా అలంకరిస్తారు. 30న తెల్లవారుజాము ఒంటి గంట నుంచి 3 గంటల వరకు స్వామి వారికి తిరువంజనోత్సవం జరుగుతుంది. అనంతరం వేకువజాము 4 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బంగారు గరుడ వాహనంపై శ్రీవారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారు. అదే సమయంలో ఆలయ ముఖమండపంలో బంగారు దక్షిణావృత శంకుచే రెండు రోజులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించనున్నారు. ఈ ఏడాది ముక్కోటి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువ, దిగువ సన్నిధుల్లో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. తూర్పు, ఉత్తర గాలిగోపురాలతోపాటు క్షేత్రాన్ని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఈవో కే.సునీల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



దేవస్థానం వెలుపల ఏర్పాటు చేసిన క్యూలైన్లు



కాంతులీనుతున్న దిగువ సన్నిధి

పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ అవసరం

● మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



చైర్‌పర్సన్ శైలజకు సిఫారసు పత్రాన్ని అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

మంగళగిరి సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ, భద్రత అవసరమని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, వృత్తి పరమైన సంస్థల్లో పోష్ చట్టం అమలు అనే అంశంపై మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో శనివారం న్యాయవాదులతో అభిప్రాయ వ్యక్తీకరణ సమావేశం నిర్వహించారు. అనంతరం డాక్టర్ శైలజ మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు పని ప్రదేశాల్లో మహిళల రక్షణ, భద్రతపై అనేక తీర్పులు వెలువరించిందన్నారు. చట్టం అమలులో మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పని ప్రదేశంలో రక్షణ లేదనే భావన ఇప్పటికీ ఉందన్నారు. రాజకీయ పార్టీలు, బార్ అసోసియేషన్లు, విద్యా సంస్థల వంటి అన్ని ప్రదేశాల్లో చట్టం అమలుపై చర్చించడం జరిగిందన్నారు. లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని, అయినా కేసులు మాత్రం తక్కువగా నమోదవుతున్నాయని చెప్పారు. రాజకీయ పార్టీల్లో పోష్ చట్టం అమలుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చైర్‌పర్సన్ వెల్లడించారు. సీనియర్ న్యాయవాది రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. లైంగిక వేధింపుల నివారణకు సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలను ఇచ్చిందన్నారు. మహిళా చట్టాలు దుర్వినియోగం అవుతున్నాయనే నెపంతో ఆ చట్టాలను నిర్వీర్యం చేయరాదని, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా చట్టాలను మార్పు చేసి అమలు చేయాలన్నారు. అనంతరం ఆయన సిఫారసు చేసిన అంశాలతో కూడిన పత్రాన్ని శైలజకు అందజేశారు. న్యాయవాదులు సోము కృష్ణమూర్తి, చంద్రగిరి రాధాకుమారి, జీవీ లక్ష్మీ రూన్సీ, గంగా భవానీ, జన్ను శ్రీధర్, వసుంధర పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం

విజయపురిసౌత్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 565.00 అడుగులు ఉంది. ఇది 244.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500, ఎడమ కాలువ ద్వారా 8629 , ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,771.. మొత్తం ఔట్‌ఫ్లో 51,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 40,531 క్యూసెక్కులు ఉంది.

ఆర్టీసీలో ఆనందం!

● మెడికల్ అన్‌ఫిట్‌లకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు
● హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాలు
● ఏళ్ల తరబడి విన్నపాలకు గ్రీన్ సిగ్నల్
● కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు



ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్

గుంటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మెడికల్ అన్‌ఫిట్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సమ్మతించింది. అనారోగ్యం బారినపడి ఇబ్బందులు పడుతున్న సిబ్బంది ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంపై ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆరేళ్లకు పైగా చేస్తున్న విన్నపాలను ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో.. ఉద్యోగులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కాక ముందు కార్పొరేషన్‌గా పాలక మండలిలో చర్చించి నిర్ణయాలు తీసుకునేది. సర్వీసులో ఉండి చనిపోయిన సిబ్బంది కుటుంబంలో అర్హులైన వారికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం లేదా పరిహారాన్ని ఆర్టీసీ చెల్లించేది. మరో వైపు అనారోగ్యం(21 రోగాలు) బారిన పడిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయం కల్పించేది. ఇదిలా ఉండగా వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను మాత్రమే ప్రభుత్వంలో విలీనం చేయడంతో కారుణ్య నియామకాలతో పాటు మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. ఉద్యోగ సంఘాల ఆందోళనకు దిగుతామని హెచ్చరించటంతో కారుణ్య నియామకాల వరకు సమ్మతించింది. అది కూడా ఆర్టీసీలో ఖాళీల్లేవంటూ జిల్లాల్లోనే ఏదో ఒక ఉద్యోగం ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. అయినా నేటికీ పెద్ద ఎత్తున ఇప్పటికీ కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తూనే ఉంటున్న పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం రావడంతో పలుమార్లు ఉద్యోగ సంఘాల నాయకులు విజ్ఞప్తులు చేస్తూ వచ్చారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలన్న ఉద్యోగ సంఘాల కోరిక మేరకు.. అంతకన్నా మెరుగ్గా డ్రైవర్, కండక్టర్, ఇతర ఉద్యోగులకు ప్రత్యామ్నాయం లభించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు



ఆర్టీసీలో అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సమ్మతించటంపై ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. ఆరేళ్లకు పైగా సంస్థ ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నాం. సీఎం చంద్రబాబు ప్రభుత్వం కరుణించటం శుభపరిణామం. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ వాహనాలతో మరింత అభివృద్ధి చేయాలని కోరుతున్నాం.

- ఆర్.శ్రీనివాసరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్

ఉమ్మడి జిల్లాలో ఎంతో మందికి మేలు



కూటమి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎంతో మంది ఉద్యోగులకు మేలు కలగనున్నది. అనారోగ్యాల బారిన పడి విధులు చేయలేని పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగులకు ఇది నిజంగా వరం లాంటిదని చెప్పవచ్చు. ఎంతో మంది ఈ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు.

- మండవ రాజేష్, కార్మిక పరిషత్ రీజినల్ సెక్రటరీ

పోలీసుల అదుపులో.. జంట హత్యల కేసు నిందితులు?

దుర్గి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా దుర్గి మండలం అడిగొప్పుల జంట హత్య కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అడిగొప్పుల గ్రామానికి చెందిన కొత్త శ్రీరామమూర్తి, అతని సోదరుడు హనుమంతులను ఈ నెల 22న ప్రత్యర్థులు మారణాయుధాలతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను నాగార్జున సాగర్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులను గోప్యంగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. జంట హత్యల్లో ఎవరెవరి ప్రమేయం ఉందనే దానిపై ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై పోలీసు అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

రేషన్‌లో.. గోధుమ పిండి

(5వ పేజీ తరువాయి)

వెళ్లినప్పుడు డీలర్లను అడిగి బియ్యం, చక్కెర, జొన్నలు, గోధుమపిండి ప్యాకెట్ తీసుకోవచ్చని అధికారవర్గాలు తెలిపాయి.

కార్డుదారులు వినియోగించుకోవాలి

ప్రభుత్వం సబ్సిడీలను భరించి కార్డుదారుల కోసం ప్రత్యేకంగా జొన్నలు, గోధుమ పిండి కొనుగోలు చేసింది. వీటిని కార్డుదారులు సొంతానికి వినియోగించుకోవాలి. ఆయా సరుకులను ఇతరులకు అమ్మడం నేరం. కార్డు దారులు ఎవరైనా అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసు కుంటాం.

- కోమలి పద్మ, గుంటూరు డీఎస్వో

హోరాహోరీగా.. ఎడ్ల పోటీలు

● ప్రారంభించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు షేక్ జాన్ సైదా



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే చదలవాడ తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో శనివారం అఖిల భారత ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన హోరాహోరీగా సాగింది. ఎడ్ల పందేలను మూడవ రోజు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు షేక్ జాన్ సైదా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో పోటీలు పకడ్బందీగా నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. నాలుగు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా జె.పంగులూరికి చెందిన గొట్టిపాటి రవికుమార్ యూత్ చిలుకూరి నాగేశ్వరరావు, జవ్వాజీ మేఘనాథ నాయుడు విజేతగా నిలిచారు. కడప జిల్లా చెన్నూరుకు చెందిన గుమ్మల సాయికుమార్‌రెడ్డి ద్వితీయ, ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఎడ్లు మూడవ స్థానంలో నిలిచాయి. ఆరు పళ్ళ విభాగంలో కృష్ణా జిల్లా పెనమలూరు యనమల కుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య శ్రీమధుకి చెందిన ఎడ్లు ప్రథమ, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లు ద్వితీయ, ప్రకాశం జిల్లా యద్దనపూడి మండలం మరంపల్లికి చెందిన మేస్త్రీ ఖాదర్ మస్తాన్, గాదె సుమన్యారెడ్డి ఎడ్ల జత మూవడ స్థానంలో నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు షేక్ జాన్ సైదా బహుమతులు ప్రదానం చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవీంద్ర, షేక్ మన్నాన్ షరీప్, వనమా సాంబశివరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అత్యుత్తమ జీవితానికి సమయపాలనే మార్గదర్శక సూత్రం

● నేషనల్ అకాడమి ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు వినోద్ కె.సింగ్
● ఘనంగా కేఎల్‌యూ 15వ స్నాతకోత్సవం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వినోద్ కె.సింగ్



వేదికపై ప్రొఫెసర్ వినోద్ కె.సింగ్, శ్రీపాద్ బనవలి, కోనేరు సత్యనారాయణ తదితరులు



వినోద్ కె.సింగ్ నుంచి పీహెచ్‌డి అందుకుంటున్న సునీత

తాడేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ జీవితానికి సమయపాలనే మార్గదర్శక సూత్రమని నేషనల్ అకాడమి ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ వినోద్ కె.సింగ్ అన్నారు. శనివారం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా వినోద్ కె.సింగ్ సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేఎల్‌ఈఎఫ్ అధ్యక్షుడు, చాన్సలర్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ.. కేఎల్‌యూ క్యాంపస్‌ను భౌతికంగా విడిచిపెట్టినప్పటికీ.. వర్సిటీ నిర్మించిన పర్యావరణ వ్యవస్థను విద్యార్థులు వదిలిపెట్టలేరన్నారు. వీసీ సారథివర్మ మాట్లాడుతూ 2025లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 5 వేల మందికి డిగ్రీలు ప్రదానం చేసినట్లు చెప్పారు. 184 పీహెచ్‌డీ, 700 పీజీ, 4,500లకు పైగా యూజీ విద్యార్థులు డిగ్రీలు అందుకుంటున్నట్లు వెల్లడించారు. 44 మంది విద్యార్థులకు బంగారు, 40 మందికి రజతపతకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి కేఎల్‌ఈఎఫ్ కార్యదర్శి కోనేరు కాంచనలత, ఉపాధ్యక్షుడు కోనేరు రాజాహరీన్, బోర్డు సభ్యురాలు కోనేరు నిఖిల, రిజిస్ట్రార్ కె సుబ్బారావు, ప్రోచాన్సలర్లు, ప్రోవీసీలు, డీన్‌లు, డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ, ఇండియన్ నావల్ అకాడమీ ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, కేరళలోని కన్నూర్ జిల్లాలో ఉన్న ఇండియన్ నావల్ అకాడమీ (ఐఎన్ఏ) మధ్య అకడమిక్, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసేలా అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరిందని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డీన్ ప్రమోషన్స్ అండ్ కొలాబరేషన్స్ కార్యాలయం ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇండియన్ నావల్ అకాడమీ ప్రిన్సిపల్ రియర్ అడ్మిరల్ జి.రాంబాబుకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. ఎంవోయూ ద్వారా ఇరు సంస్థల మధ్య ఫ్యాకల్టీ, విద్యార్థుల మార్పిడి, సంయుక్త పరిశోధనలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, అంతర్జాతీయ కాన్ఫరెన్సులు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అకడమిక్ సమాచార మార్పిడి, పరిశోధన పబ్లికేషన్లు, అధ్యయన సామగ్రి పరస్పర మార్పిడి ద్వారా జ్ఞాన విస్తరణకు ఈ ఒప్పందం దోహదపడుతుందని పేర్కొన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావురత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, చాన్సలర్ డాక్టర్ పావులూరు సుబ్బారావు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

నారాకోడూరులో దారుణ హత్య



మృతుడు మృత్యుంజయరావు

చేబ్రోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాకోడూరు - తెనాలి ప్రధాన రహదారిపై శనివారం దారుణ హత్య జరిగింది. నత్తల మృత్యుంజయరావు (40) అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేసి హతమార్చారు. మృతుడు 20 సంవత్సరాలుగా గజవెల్లి స్పిన్నింగ్ మిల్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. స్పిన్నింగ్ మిల్‌లో విధులు నిర్వహించుకొని నారాకోడూరులోని తన నివాసానికి బైక్‌పై వెళుతుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి.. ఆయనపై దాడిచేసి హత్యచేసినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న చేబ్రోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే.. ఈ హత్యకు పాత కక్షలే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య వెనుక గ్రామానికి చెందిన ఇద్దరు ఉన్నారని హతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. మృత్యుంజయరావు హత్య విషయం తెలిసిన వెంటనే దళితవాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధిక సంఖ్యలో హతుడి బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. మరోవైపు మృత్యుంజయరావు హత్యకు కారణమంటున్న వారు గ్రామం విడిచి పారిపోయారు. దళితవాడలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

కారు ఢీకొని డెలివరి బాయ్ మృతి


నాదెండ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొన్న ఘటనలో కొరియర్ డెలివరీ బాయ్ పావులూరి కిషోర్(48) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సాతులూరు గ్రామ సమీపంలోని గుంటూరు - కర్నూలు రహదారిపై చోటుచేసుకుంది. బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన కిషోర్ ఏడేళ్లుగా భార్య సుధారాణితో కలసి నరసరావుపేటలో నివాసం ఉంటున్నాడు. ఓ కొరియర్ సంస్థలో డెలివరీ బాయ్‌గా చేస్తూ.. శనివారం ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్లాడు. మేరికపూడి వైపు వెళ్లి వస్తుండగా.. తిరిగి నరసరావుపేట వస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. సూర్య సెమ్ కంపెనీకి చెందిన కారు గుంటూరు వైపు వెళ్తూ పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ సమీపంలో కిషోర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు జిల్లా విద్యార్థి ప్రాజెక్ట్



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో సలీమ్‌బాష

గుంటూరు(విద్య), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23, 24న విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా విద్యార్థి జి.చందుసాయి రూపొందించిన ప్రాజెక్టు సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపికైనట్లు డీఈవో డాక్టర్ ఎస్కే సలీమ్ బాష శనివారం తెలిపారు. విద్యార్థి రూపొందించిన స్మార్ట్ డస్ట్ బిన్ ప్రాజెక్టు జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి తాజాగా సదరన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి చందుసాయి గైడ్ టీచర్ శివశంకరరెడ్డిని డీఈవో సలీమ్‌బాష అభినందించారు. జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మీరా పాల్గొన్నారు.

నల్లపాడు రోడ్డులో డ్రెయిన్ నిర్మాణం అస్తవ్యస్తం

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నల్లపాడు రోడ్డులో హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద నిర్మిస్తున్న అవుట్‌ఫాల్ డ్రెయిన్ పనులు అస్తవ్యస్తంగా మారాయి. ఎలాంటి స్లోప్స్ లేకుండా, కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పక్కకు మార్చకుండా డ్రెయిన్ నిర్మిస్తున్నారు. దీని వలన డ్రెయిన్ పలు చోట్ల వంకర టింకరగా మారింది. అలానే డ్రెయిన్ నిర్మాణంలో భాగంగా తొలగించిన మట్టిని అక్కడే రోడ్డు మార్జిన్‌లో కుప్పలుగా పోశారు. ఇది వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ డ్రెయిన్ వలన వలన రేపటి రోజున వర్షాకాలంలో ఎలాంటి ఉపయోగం ఉండదన్న అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తపరుస్తున్నారు.


వంకర టింకరగా నిర్మిస్తోన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్ →


కుర్రా అప్పారావును సత్కరిస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

కుర్రా అప్పారావుకు సత్కారం

గుంటూరు (తూర్పు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్‌గా నూతనంగా నియమితులైన కుర్రా అప్పారావు శనివారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుర్రా అప్పారావును పెమ్మసాని ఘనంగా సత్కరించారు. యార్డు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అధికారులును, కమీటీ సభ్యులను సమన్వయం చేసుకొని యార్డు అభివృద్ధి పథంలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బలరామ్, శ్రీనివాసులు, కేశవ్, శ్రీధర్, చౌదరి, దీపు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ షిర్డీసాయి బృందావనం ఎవెన్యూస్ వార్షికోత్సవం

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రంగంలో నమ్మకంలో అగ్రగామి సంస్థగా ఉన్న శ్రీ షిర్డిసాయి బృందావనం ఎవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 11వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, శ్రీ సాయి డెవలపర్స్ అధినేత, ఛైర్మన్ కాకుమాను కృష్ణ, మేనేజింగ్ డైరెక్టర్ కాకుమాను రాజేష్, జంగా శ్రీధర్‌రెడ్డి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ, నివాసయోగ్యమైన ప్లాట్లను సరసమైన ధరకు శ్రీ సాయి డెవలపర్స్ వారు అందించటం సంతోషదాయకమన్నారు. సంస్థ మరింత పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. నంబూరులో సంస్థ అభివృద్ధి చేస్తున్న ఏపీ సీఆర్‌డీఏ ఎల్‌పీ నెంబర్ 129/ 2025 వెంచర్‌లో 600 మందితో గెట్ టు గెదర్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పలువురు మార్కెటింగ్ మిత్రులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఛైర్మన్ కాకుమాను కృష్ణ తదితరులు

పెమ్మసాని నేతృత్వంలో శర వేగంగా జిల్లా అభివృద్ధి

● టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ లాల్‌వజీర్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు బంగారపు గని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అని, ఆయన నేతృత్వంలో జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతుందని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ లాల్‌వజీర్ అన్నారు. స్థానిక అరండల్‌పేట, టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజల చిరకాల స్వప్నమైన శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణానికి విశేషంగా కృషి చేశారన్నారు. అమృత్ పథకానికి కేంద్రం నుంచి రూ.375 కోట్లు సాధించారని, అంతేగాక రూ.9 కోట్లతో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణం, నీరు నిల్వ చేసేందుకు నగరంలో రూ.4.5 కోట్లలో ట్యాంకర్ల నిర్మాణం జరుగుతుందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక, అంబటి రాంబాబు చేస్తున్న కుటిల రాజకీయాలను టీడీపీ కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ బాజీ మాస్టర్, షేక్ జాన్ సైదా, భాషి, ఖాలీలుద్దీన్, సైద్ యునస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సెలవు రోజైనప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులు చెల్లించాలని కోరారు. అలానే ఫోన్‌పే, గూగుల్ పే వంటి డిజిటల్ పేమెంట్స్‌తోనూ చెల్లించవచ్చని సూచించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు (విద్య), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ప్రభుత్వ ఉపాధ్యాయుల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కల్యాణ మహోత్సవాలు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల, అన్నపూర్ణ నగర్‌లో పద్మావతీ, ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలలో దశావతార కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం కృష్ణావతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమాల్ని ఆలయ కమిటీ ఛైర్మన్ కంచర్ల ఆంజనేయులు, అధ్యక్షుడు ఎర్రంశెట్టి వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

ముగిసిన భజన బృందాల నైపుణ్యాల పరిశీలన

గుంటూరు(తూర్పు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తిరుమల, తిరుపతి దేవస్థానం (టీటీడీ), హిందూ ధర్మప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ)ఆధ్వర్యంలో రాజాగారితోట, టీటీడీ కల్యాణ మండపంలో ఐదు రోజుల నుంచి జరుగుతున్న భజన బృందాల నైపుణ్య పరిశీలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. టీటీడీ జిల్లా సమన్వయ కర్త అమ్మడు మాట్లాడుతూ టీటీడీ నైపుణ్య పరిశీలనకు 120 భజన బృందాలు హాజరైనట్టు తెలిపారు. కీర్తనల ఆలాపనలో జరిగే లోటుపాట్లును బృందాలకు న్యాయనిర్ణేతలు తగు సూచనలిచ్చారన్నారు. కార్యక్రమానికి సంబంధించిన భోజన, ఇతర ఏర్పాట్లను క్లస్టర్ సూపరింటెండెంట్ కాంతి కుమార్ పర్యవేక్షించారు. ధర్మప్రచార మండలి సభ్యులు సుబ్బారావు, ఆదినారాయణరెడ్డి, శ్రీను ఇతర శ్రీవారి సేవకులు సహాయ సహకారాలు అందించారు.

అలరించిన తాళం భజన

గుంటూరు(తూర్పు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం, అన్నమయ్య కళావేదికపై శనివారం శ్రీ విశ్వంబర భక్త భజన సమాజం, పెదనందిపాడు వారిచే తాళంభజన కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. తొలుత సాహితీవేత్త డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి తిరుప్పావైలోని 12వ పాశురంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం కే.చిట్టెమ్మ, ఆర్.రమాదేవి, ఆర్.సుజాత, ఎస్.శ్రీదేవి, ఎం.ఉమ, ఎం.రాజ్యలక్ష్మి, కే.పద్మజ, వి.మల్లేశ్వరిలు తమ గాత్ర ధారణలో పలు అన్నమయ్య, రామదాసు, శ్రీకృష్ణుని కీర్తనలను తాళంభజన రూపంలో చక్కగా ఆలపించారు. వీరికి డోలక్‌పై వై.శివశంకర్ వాయిద్య సహకారం అందించారు.

అలరించిన పౌరాణిక నాటక ప్రదర్శనలు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల కమ్యూనిటీ హాలులో శనివారం గయోపాఖ్యానంలో యుద్ధఘట్టం, సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకాన్ని ప్రదర్శించారు. భాషా, సాంస్కృతిక శాఖ ఏపీ సౌజన్యంతో, స్వాతి కళా నాట్యమండలి నిర్వహణలో ఈ నాటకాలు ప్రదర్శించారు. ఆయా పాత్రలలో కళాకారులు ఒదిగి నాటకాన్ని రక్తికట్టించారు. వీరికి హార్మోనియంపై పి.సురేష్, క్లారినెట్‌పై వెంకట్రావు, డోలక్‌పై శ్రీను వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం గ్రామస్థులు కళాకారులను ఘనంగా సత్కరించారు.

పెమ్మసానికి రాజకుమారి కృతజ్ఞతలు



కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను డాక్టర్ శనక్కాయల రాజకుమారి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ గుంటూరు పార్లమెంట్ నియోజక వర్గ కార్యనిర్వాహక కార్యదర్శిగా తన నియామకానికి అందించిన అపూర్వ మద్దతుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు నాయకత్వంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా నిబద్ధతతో పని చేస్తానని అన్నారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అమానుషకాండను మానవతావాదులందరూ మతాలకతీతంగా ఖండించాలని విశ్వహిందూ పరిషత్ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ చెట్టి నిరంజనరావు కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు, హత్యాకాండకు నిరసనగా శనివారం నాజ్‌సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి హిందు కళాశాల వరకు హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో అరాచక పరిస్థితులు రాజ్యమేలుతున్నాయని అన్నారు. భారత ప్రభుత్వం స్పందించి బంగ్లాదేశ్‌లోని హిందువుల రక్షణ నిమిత్తం చర్యలు చేపట్టాలని కోరారు. ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని బంగ్లాదేశ్‌లో పరిస్థితులను సరిదిద్దాలని కోరారు. ఈ ర్యాలీలో వీహెచ్‌పీ జిల్లా నాయకులు చెక్క హరనాథ్, కేవీ చలపతిరావు, గోపి, మోహేష్, హరీంద్ర, నాగరాజు, కార్తికేయ, మోహన్‌సాయి, వెంకట్ పాల్గొన్నారు.

చౌకధరల దుకాణదారుల సంక్షేమ సంఘాల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చౌకధరల దుకాణదారుల సంక్షేమ సంఘాల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు డీలర్ల సంఘం నగర నాయకుడు తుమ్మల గాంధీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సమాఖ్య నూతన అధ్యక్షుడిగా ఎంఎస్ఎస్ గిరిజారావు, ప్రధాన కార్యదర్శిగా ఎంఎస్ చక్రధర్, ట్రెజరర్‌గా ఎస్.నాగార్జున, అదనపు కార్యదర్శిగా వీ.అంజయ్య, ఉపాధ్యక్షులుగా టీ.మోహన్‌రావు, ఇమ్మంది శంకర రావు, వీరరాఘవులు, ఎస్కే కాలేషావలి, పీ.మాల్యాద్రి, దేసు వెంకట కిషోర్‌కుమార్, మీడియా ప్రచార కార్యదర్శిగా పీ.శ్రీనివాస్‌ని ఎన్నుకొన్నారు. గౌరవ అధ్యక్షుడిగా కేవీఎస్ రామారావుని కొనసాగించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వెళ్లి డీలర్ల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వానికి సమాఖ్య నివేదిస్తుందన్నారు.

ప్రగతినగర్‌లో కార్డెన్‌సెర్చ్

● 28 వాహనాలు సీజ్.. ● ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 28 వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎవరైనా నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో సీఐలు వెంకట ప్రసాద్ (పాతగుంటూరు), శివప్రసాద్ (లాలాపేట), వీరయ్య చౌదరి(కొత్తపేట) సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉర్దూ మహోత్సవం

గుంటూరు(విద్య), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉర్దూ అకాడమీ ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉర్దూ అకాడమీ ఛైర్మన్ మహమ్మద్ ఫారూఖ్ సిబ్లి ఆధ్వర్యంలో చౌత్ర సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉర్దూ లిపి పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.పద్మజ మాట్లాడుతూ ఉర్దూ చదివిన విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఉర్దూ చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో షేక్ అక్బర్, షేక్ రఫీ, నయీమ్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు పద్య, కథాకథన పోటీలు

గుంటూరు(విద్య), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని నారాయణ స్కూల్‌లో విద్యార్థినీ, విద్యార్థులకు పద్య, కథాకథన పోటీలు నిర్వహించినట్లు హెచ్ఎం ఎన్ఎస్ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎన్‌డీ హెడ్ మార్యాపాట్రిక్, ఏజీఎం వినయబాబు, జోనల్ కోఆర్డినేటర్ షమీమ్, ఏవో శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు

దివ్యాంగులకు ప్రత్యేకంగా గ్రీవెన్స్‌సెల్ హర్షణీయం

గుంటూరు(విద్య), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కారం ఏర్పాటు చేయడం అభినందనీయమని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి అధ్యక్షుడు దూపాటి రమణయ్య అన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అభినందనలు తెలిపారు. ఆదరణ దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షులు వెలుగు. శివప్రసాద్, గొట్టిపాటి. లక్ష్మణ్, సొగ. బ్రహ్మం, హాని సాయిని. మహేంద్ర బాబు, పెండూరి. వెంకటలక్ష్మి, పి. జార్జి, రామకృష్ణ, పి. వెంకటేశ్వర్లు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల కన్నీళ్లు తుడవడమే టీడీపీ ధ్యేయం

● ఏపీఐడీసీ ఛైర్మన్ దేగల ప్రభాకర్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఏపీఐడీసీ ఛైర్మన్ దేగల ప్రభాకర్

గుంటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజల కష్టాలు వినడానికి, కన్నీళ్లు తుడవడానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఛైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలకులు ప్రజా సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యపరిచారని విమర్శించారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అరాచకాలపై అత్యధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు.

ఐఏఎస్‌లో జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్‌కు కమిషనర్


పులి శ్రీనివాసులు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన నగర కమిషనర్ పులి శ్రీనివాసులుని ప్రభుత్వం ఐఏఎస్‌లో జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్‌కు నియమించింది. పే మ్యాట్రిక్స్‌లో లెవల్ 12 రూ.78800 - రూ.2,09,200 లుగా 2026 జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించింది. అలానే ఫేజ్-3 తప్పనిసరి మిడ్-కెరీర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఏడాది లోపు పూర్తి చేసుకోవాలని సూచించింది. జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్‌కి నియమించినప్పటికీ నగరపాలకసంస్థ కమిషనర్‌గానే శ్రీనివాసులు కొనసాగుతారని ప్రభుత్వం పేర్కొన్నది. ఈ మేరకు చీఫ్ సెక్రెటరీ కే.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆకలితో నకనక



రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల బాధలు అగమ్యగోచరంగా ఉన్నాయి. వారు ఉదయం ఎనిమిది గంటలకు పాఠశాలకు వస్తే మరలా సాయంత్రం 6 గంటలకే ఇంటికి వెళ్ళేది. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత దాదాపు 7 గంటలపాటు విద్యార్థులు పాఠశాలలో గడపాల్సి వస్తోంది. ఫలితంగా సాయంత్రం నాలుగు తర్వాత నుంచి అనేక పాఠశాలల్లో విద్యార్థులు ఆకలితో అలమటించిపోతున్నారు.

- **సాయంత్రాలు ఖాళీ కడుపుతో పది విద్యార్థుల అవస్థలు**
- **అల్పాహార పంపిణీ ఎప్పుడని తల్లిదండ్రుల ప్రశ్న**
- **త్వరగా అమలు చేయాలని ఉపాధ్యాయుల వినతి**

గుంటూరు (విద్య), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు దాదాపు 68 వేల మందికిపైగా ఉన్నారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశా లల్లో చదివే విద్యార్థులు దాదాపు 35 వేల మందికిపైగా ఉన్నట్లు సమాచారం. ఈ విద్యార్థులంతా పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారే. ఉదయం ఇంట్లో ఏదో అల్పాహారం లేదా సద్దన్నం తిని పాఠశాలకు వస్తారు. మధ్యాహ్నం పాఠశాలల్లో పెట్టే భోజనం తర్వాత సాయంత్రం 7 గంటల వరకు వారు పాఠశాలల్లో ఉండాల్సి వస్తోంది. స్టడీ అవర్స్, స్లిప్‌టెస్టులు, సబ్జెక్టుకు సంబంధించిన వీడియోలు చూడటం, ఇతర హోంవర్కులు, గణితం సబ్జెక్టులో ముఖ్యమైన లెక్కలు సాధన చేయడం వంటి పనులతో సాయంత్రం 7 గంటల వరకు పాఠశాలల్లోనే ఉండాల్సి వస్తోంది. ఈ సమయంలో అనేక మంది విద్యార్థులు ఆకలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి ఆర్థిక స్తోమత ఉన్న విద్యార్థులు సాయంత్రం 4 గంటల తర్వాత బయట అల్పాహారం చేసి వస్తున్నారు. మిగిలిన విద్యార్థులు మాత్రం ఆకలితో అలమటిస్తున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● అల్పాహారం పంపిణీ ఎప్పుడో...

ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఏటా సాయంత్రం పూట అల్పాహారం పంపిణీ చేస్తోంది. జిల్లా పరిషత్, స్థానిక సంస్థల నుంచి నిధులు విడుదల చేస్తారు. ఈ నిధులతో సా యంత్రం పూట ఇడ్లీ, ఉప్మా, పునుగులు, గు గ్గిళ్లు, లేదా అరటికాయలు వంటివి విద్యార్థు లకు పంపిణీ చేసేవారు. అయితే ఏడాది డిసెంబరు చివరకు వచ్చినా అల్పాహార పంపిణీ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల విద్యార్థుల బాధలు చూడలేక ఉపాధ్యాయులే సొంత నిధులతో అల్పాహారం అందిస్తున్నారు.

● కాలే కడుపులతో ఎలా..!

సర్కారు పాఠశాలల్లో నూరుశాతం ఫలితాల కోసం పాఠశాల విద్యాశాఖ పటిష్టమైన ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా వందరోజుల ప్రణాళిక పేరుతో ప్రత్యేకంగా స్టడీ అవర్స్, స్లిప్ టెస్టులు, ఇతర అసైన్‌మెంట్లు నిర్వహిస్తున్నారు. దీంతో ఒక విధంగా విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇదే సమయంలో వారు శారీరకంగా ఇబ్బందులు పడకుండా ఉండాలంటే అల్పాహారం తప్పనిసరిగా అందించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. కాలే కడుపులతో విద్యార్థులు చదువులు సక్రమంగా సాగే అవకాశం ఉండదని వైద్యులు కూడా స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ పాఠశాలలో చదివే పది విద్యార్థులకు అల్పాహారం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

● వెనువెంటనే నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు ● సచివాలయాల సెక్రెటరీలకు యాప్ లింక్‌ల జారీ ● అప్‌డేటెడ్ డేటా నిక్షిప్తానికి ఆదేశాలు

యూనిఫైడ్ సర్వేకు ఎస్‌వోపీ జారీ



గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పేదరికం లేకుండా చేసేందుకు ఇప్పటికే ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్)ను నిర్వహిస్తోంది. దీనిని ప్రధానంగా ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి వ్యక్తి, కుటుంబం డేటాను అప్‌డేట్ చేసి నిక్కచ్చిగా ఉంచేందుకు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యూఎఫ్ఎస్)ను చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ సర్వే ప్రతి కుటుంబ సమాచారం కోసం ఒక సత్య మూలాన్ని సృష్టించడానికి వీలు కల్పిస్తుంది. ప్రభుత్వ సేవలు, ప్రయోజనాలు ప్రజలకు సజావుగా చేరేలా చేస్తుంది. ఆర్‌టీజీఎస్‌లో అందుబాటులో ఉన్న జనాభా డేటా సంతృప్తి, నాణ్యతను మెరుగుపరుస్తుంది. ఈ డేటాను ప్రభుత్వ విభాగాలకు అందించడం వల్ల పథకాల అమలు వేగవంతం అవుతుంది. దీనికి సంబంధించిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను ప్రభుత్వం జిల్లా కేంద్రాలకు పంపించింది.

● యాప్ లింకులు జారీ

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సిబ్బంది నిర్వహిస్తారు. ఇప్పటికే డిజిటల్ సర్వే అప్లికేషన్‌ను సెక్రెటరీలకు లింకు ద్వారా పంపించారు. ప్లానింగ్, ఆర్‌టీజీఎస్, కలెక్టర్, ఇతర ప్రభుత్వ విభాగాలతో జీఎస్‌డబ్ల్యూఎస్ డిపార్టుమెంట్ సమన్వయం చేసుకొని సర్వే డిజైన్, ప్రశ్నావళిని రూపొందించారు. సర్వే నిర్వహించబోయే సిబ్బంది వారికి కేటాయించిన సచివాలయం పరిధిలో ఏ ఒక్క కుటుంబం మిస్ కాకుండా డేటాను సేకరించాల్సి ఉంటుంది. ఇందుకోసం అవసరమైన మౌలిక సదుపాయాలను కలెక్టర్ కల్పిస్తారు. సర్వేను పర్యవేక్షించేందుకు టాస్కుఫోర్సును నియమించి ఆకస్మిక తనిఖీలు చేపడతారు. తరచుగా సర్వేపై సమీక్షలు నిర్వహిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో, మునిసిపల్ స్థాయిలో కమిషనర్ సర్వేను పర్యవేక్షిస్తారు. ప్రభుత్వం సత్వరమే ఈ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను ప్రారంభించాలని ఆదేశించింది.

● నిక్కచ్చిగా సర్వే

సర్వేలో ప్రధానంగా ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబంలోని ప్రతి ఒక్కరిని సర్వే చేస్తారు. తొలుత ఆధార్ నంబరు నమోదు చేసి క్రమం తప్పకుండా కుటుంబంలో మ్యాపింగ్ అవుతున్నారా లేదా అనేది పరిశీలిస్తారు. ఆ తర్వాత పేరు, జెండర్, జనన తేదీ, మొబైల్ నంబరు వంటివి ఆధార్ డేటా ద్వారా రాబడతారు. ఇక ప్రశ్నావళిలో ప్రత్యేకంగా మొబైల్ నంబరు ఉందా, ఎన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో నివసిస్తున్నారు, వివాహం చేసుకున్నారా, లేదా, తండ్రి, భర్త పేరు, సోషల్ ప్రొఫైల్, ఎడ్యుకేషన్ అండ్ స్కిల్లింగ్, ఉద్యోగం, జీవనోపాధి, కుల ధ్రువీకరణ, దీనికి సంబంధించిన ఆధారం, మతం, ఎంత వరకు చదువుకున్నారు, వృత్తి నైపుణ్య శిక్షణకు వెళ్లారా, కుటుంబ ఆదాయానికి ప్రధాన వనరు ఏమిటి, స్వయం ఉపాధి పొందుతున్నారా, సీజనల్‌గా వలస వెళతారా వంటి ప్రశ్నలకు సమాధానాలు తీసుకొని అప్‌లోడింగ్ చేస్తారు. అలానే టీవీ, ఫ్రిజ్, టూవీలర్, ఫోర్‌వీలర్ ఉన్నాయా, విద్యుత్ బిల్లు ఎంత వస్తుంది వంటి అన్ని వివరాలతో డేటా లేక్‌లోకి డంపింగ్ చేస్తారు.

● తొలుత గుంటూరు జిల్లాలో నిర్వహణ

జిల్లాలో 568 గ్రామ, వార్డు సచివాలయాల్లో 7 లక్షల 21 వేల 938 కుటుంబాలున్నాయి. వీటిల్లో 20 లక్షల 88 వేల 190 మంది సభ్యులున్నారు. 4,462 మంది సిబ్బంది 11,062 క్లస్టర్లను పర్యవేక్షిస్తున్నారు. తొలుత ప్రభుత్వం గుంటూరు జిల్లా సర్వేను జనవరి 14వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే ప్రశ్నావళి చాంతాడంత ఉండటం, సంక్రాంతి పండగ సెలవులు వంటివి ఉన్న నేపథ్యంలో గడువును పొడిగించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.



మిస్ ఆంధ్రగా ఎంపికైన పరిటాల దివ్య

మిస్ 'ఆంధ్ర'గా పరిటాల దివ్య

గుంటూరు సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన పరిటాల దివ్య మిస్ ఆంధ్రగా ఎంపికయ్యారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఫర్‌ఎవర్ స్టార్ ఇండియా సీజన్-5 పోటీలు ఈ నెల 21 నుంచి ఆరంభమయ్యాయి. ఈ పోటీలలో దివ్య ఆయా విభాగాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరచి 'మిస్ ఆంధ్ర' టైటిల్ దక్కించుకున్నారు. దివ్య తండ్రి నరేశ్ బాబు చెన్నైలో నిర్మాణ రంగంలో ఉన్నారు. తాత పరిటాల శ్రీకృష్ణ గ్రామంలోనే నివసిస్తున్నారు. దివ్య ప్రస్తుతం తడలోని ఆర్ఎంకే కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నారు. భవిష్యత్తులో దివ్య మిస్ ఇండియాగా ఎంపిక కావాలని జిల్లాకు చెందిన పలువురు ఆకాంక్షించారు.

ఆర్వీఆర్‌జేసీలో ముగిసిన కొలరిడో

- **పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు పంపిణీ**
- **సందడి చేసిన సినీ హాస్యనటుడు షకలక శంకర్**

గుంటూరు (విద్య), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న కొలరిడో జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక, కళా వేడుకలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది యువతీ, యువకులతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. విద్యార్థుల నృత్యాలు, పాటలు, నాటికలు ప్రేక్షకులను అలరించాయి. అలాగే టెక్నికల్ విభాగంలో వినూత్న ఆలోచనలు, సృజనాత్మక ఇన్నోవేషన్‌లతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కోడింగ్ చాలెంజ్‌లు, ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్లలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. క్రీడా పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. మెహందీ, చిత్రలేఖనం, రంగోలి కార్యక్రమాలు రంగుల సంబరాన్ని నింపాయి. ఈ ఫెస్ట్‌లో పాల్గొన్న తెలుగు సినీ తారలతో వేదిక సందడిగా మారింది. ప్రముఖ హాస్యనటుడు షకలక శంకర్ అందించిన స్క్రిప్ట్ ప్రేక్షకుల్లో నవ్వుల జల్లు కురిపించింది. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా మొత్తం రూ.5 లక్షల విలువైన నగదు బహుమతులు, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ, యువతలోని సృజనాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలే దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయని పేర్కొన్నారు. తరగతి గది బయట నేర్చుకునే నైపుణ్యాలు యువతలో నాయకత్వ లక్షణాలు, ఆత్మీయభావాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విభిన్న ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆధునిక సాంకేతిక ఆవిష్కరణలతో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు కొత్త అనుభూతిని కలిగిస్తాయని, తోటి విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ అకడమిక్ ఆర్‌అండ్‌డీ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ నార్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన షకలక శంకర్



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ తదితరులు



విద్యార్థుల నృత్యప్రదర్శన



ప్రసంగిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, చిత్రంలో ఎమ్మెల్యే యరపతినేని తదితరులు

విద్యతోనే అభివృద్ధి

● జూలకల్లు అభివృద్ధికి నిధులందిస్తా: ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో ఒకప్పటి ఫ్యాక్షన్ గ్రామాలలో జూలకల్లు చెప్పుకోదగిన గ్రామం అని, అయితే తామిచ్చిన విద్యతోనే అభివృద్ధి నినాదం తో ఇప్పుడిక్కడ శాంతియుత వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు అన్నారు. జూలకల్లు జడ్పీ పాఠశాల 60 సంవత్సరాల వజ్రోత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, వ్యవసాయ ఆధారిత కుటుం బాలు అత్యధికమున్న జూలకల్లు గ్రామం నుంచి ఇప్పుడు దేశ విదేశాలలో ఐటీ ఉద్యోగులు ఉన్నా రన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పాఠ శాల విద్యకు నారా లోకేశ్ అధిక ప్రాధాన్యమి స్తున్నారని అన్నారు. పాఠశాల అభివృద్ధికి గతంలో నిధులు కేటాయించారని, ఇప్పుడు కూడా తనవంతు కృషి చేస్తానన్నారు.

నడిచొచ్చి చదువుకున్నా: ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

జూలకల్లు సమీపంలోని గుత్తికొండ నుంచి 1977-78 సంవత్సరంలో 6వ తరగతి చది వేందుకు 4 కిలోమీటర్ల దూరం నడిచొచ్చి ఈ పాఠశాలలోనే చదువుకున్నానని ఆ పాఠశాల పూర్వవిద్యార్థి, వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. పాఠశాల వజ్రోత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూట మి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల బలోపే తానికి తగిన నిధులు కేటాయించామన్నారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం ఎమ్మెల్యేలు యరపతినేని, జీవీ ఆంజనేయులు ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. తొలుత గ్రామంలోని ఎంపీపీ స్కూల్ నుంచి జడ్పీ పాఠశాల వరకు ఇరువురు ఎమ్మెల్యేలు ర్యాలీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్థల దాత నంద్యాల ధనుంజయరెడ్డి, భాష్యం నరస య్య, నర్రా సాంబశివరావు, నంద్యాల వెంకటేశ్వ రరెడ్డి, లంజేపల్లి కొండలు, ఎస్‌కే జమాల్, తురకా వీరస్వామి, గండికోట వెంకటేశ్వర్లు, య డ్లపల్లి నారాయణ, దామరచర్ల శ్రీనివాసరావు, నర్రెడ్డి రామకృష్ణారెడ్డి, బండ్ల వెంకటేశ్వర్లు, బీర వల్లి వెంకటేశ్వరరెడ్డి, పలువురు పూర్వవి ద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- **కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్**
- **జిలెళ్లమూడిలో యోగాసనాల పోటీలు ప్రారంభం**

బాపట్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ చెప్పారు. యోగాతోనే మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చుఅన్నారు. బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలోని అమ్మవారి దేవస్థానంలో శనివారం 44వ జాతీయ యోగాసనాల చాంపియన్ షిప్ పోటీలను కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఇండియన్‌యోగా ఫెడరేషన్, ఏపీయోగా అసోసియేషన్ నాయకుడు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి సభలో ప్రసంగించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందిన యోగా భారత దేశానిదే కావటం గర్వకారణమన్నారు. ధ్యానంతో మనస్సు నెమ్మదిగా ఉంటుందని, శరీరం శక్తిని పునరుద్ధరించుకుంటుందన్నారు. గడిచిన 16 సంవత్సరాలుగా యోగాసనాలు చేయడమే తన ఆరోగ్య రహస్యమని కలెక్టర్ చెప్పారు. ఇటీవల సంభవించిన తుఫాన్ సమయంలో నిద్రాహారాలు మాని క్షేత్ర పరిశీలన, ప్రభుత్వ యంత్రాంగంతో సమీక్షలు, సమావేశాల చేయడంతో ఎంతో ఒత్తిడికి గురయ్యానని, అలాంటి సమయంలో యోగాతోనే మానసిక ఒత్తిడి నుంచి సున్నితంగా బయటకొచ్చానని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలు బాపట్లలో జరగడం సంతోషదాయకమని, ఈ పోటీలకు 16 రాష్ట్రాల నుంచి 617 మంది పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ, యోగాభ్యాసనం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం, విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు లభిస్తాయని అన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయటం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను అధికమించి మెరుగైన, ఆరోగ్యవంతమైన సమాజనిర్మాణం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరు రోజువారి జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు కేవలం చదువుక పరిమితం కాకుండా యోగా, కరాటే వంటి రంగాలపట్ల మక్కువ పెంచుకొని అభ్యాసనం చేయాల్సిందిగా సూచించారు. భారతదేశం యోగా విద్యలో ప్రపంచానికి మార్గదర్శికగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ వారికి అండగా ఉంటానని రాబోయే రోజుల్లో ఎలాంటి కార్యక్రమం చేపట్టిన తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని సభాముఖంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు నృత్యప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. ఇండియన్ యోగా ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజిభూషణ్ పురోహిత్, ప్రధాన కార్యదర్శి మృణాల్ చక్రవర్తి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కూన కృష్ణదేవరాయులు, చైర్మన్ కళ్ళం హరినాధరెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్లాడి రవికుమార్, శ్రీ విశ్వజననీ పరిషత్ గౌరవాధ్యక్షుడు ఎం.దినకర్, బి.రవీంద్రబాబు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, నరేగా మాజీ కౌన్సిల్ సభ్యురాలు మువ్వా లక్ష్మీ సుభాషిణి, వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళి కృష్ణ, ఆడిటర్ సుబ్రహ్మణ్యం, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు శీలం శ్రీనివాసరావు, అసోసియేషన్ కోఆర్డినేటర్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ, సభ్యులు యార్లగడ్డ లక్ష్మీ నారాయణరెడ్డి, నాగరాజు, ఇమ్మడిశెట్టి కోటేశ్వరరావు, కె.గౌడ రామకృష్ణరావు, బి.వి.ఎస్.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.





సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ




కను..మురుగు

(5వ పేజీ తరువాయి)

ప్లాంట్ ఎస్‌టీపీ) నిర్మించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిర్ణయించింది. ఇన్వెస్టిగేషన్, సర్వే, డిజైన్, నిర్మాణం పనులను ఒక ప్యాకేజ్ కిందకు చేర్చి టెండర్లు పిలిచింది. ప్లాంట్ నిర్మాణం తర్వాత మూడు నెలల ట్రయల్‌రన్, ఐదేళ్ల పాటు ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్(ఓ అండ్ ఎం) నిబంధనలను కూడా అందులో పొందుపరిచింది. ఏమైనా సమస్యలు తలెత్తిన రెండేళ్ల డిఫెక్ట్ లైబిలిటీ కాలాన్ని నిర్ణయిస్తూ ఈపీసీ విధానంలో ఏజెన్సీని ఖరారు చేసేందుకు నిర్ణయం తీసుకొ న్నది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 60 ఎస్‌టీపీలను ఒక ప్యాకేజ్ కిందకు తీసుకురాగా అందులో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎనిమిది ఉన్నా యి. ఈ ప్లాంట్లను ఏడాది వ్యవధిలో నిర్మించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ షరతు విధించింది. ప్లాంట్‌తో పాటు పైపులైన్ల నిర్మాణాలను కూడా ఏజెన్సీనే చూసుకోవాల్సి ఉంటుంది. ఎస్‌బీఆర్, ఎంబీబీఆర్ వంటి మోడ్రన్ టెక్నాలజీల ఆధారంగా వీటిని నిర్మించాల్సి ఎస్‌టీపీల ఇన్‌లెట్, అవుట్ లెట్‌ల వద్ద కాలుష్య కారకాలను లెక్కించేందుకు రియల్ టైం మానిటరింగ్ సిస్టమ్‌ని కూడా ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంట్ల నిర్మాణం పూర్తి అయి తే ఆయా పట్టణాల్లో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారవర్గాలు తెలిపాయి. మురుగునీటిని శుద్ధి చేయగా వచ్చే నీటిని మొక్కలు పెంపకం, పరిశ్రమలు వంటి అవసరాలకు వినియోగించుకోవచ్చని పేర్కొన్నాయి.













అందంగా ఊగుతూ ఆకర్షణీయంగా మెరుస్తూ కనువిందు చేసే ఫ్రింజ్ జ్యువెలరీ ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. పూసలు, గుండ్లు, నవరత్నాలు, సన్నని గొలుసులతోపాటు నక్షత్రాలు, పూలు లాంటి విభిన్న ఆకృతులు వేలాడేలా రూపొందించిన ఆభరణాలనే ఫ్రింజ్ జ్యువెలరీగా పరిగణిస్తారు. మన సంప్రదాయంలో వీటికి ప్రత్యేక స్థానం ఉంది. కాసులపేరు, బుట్ట జుంకాలు, చెంప స్వరాలు, మువ్వల వడ్డాణం ఈ కోవలోకే వస్తాయి. మారుతున్న ఫ్యాషన్లకు తగ్గట్టుగా మినిమలిస్టిక్ ఫ్రింజ్ డిజైన్లు అందుబాటులోకి వచ్చేశాయి.


'ఫ్రింజ్' మెరుపులు

ఫ్రింజ్ ఆభరణాలు క్రీ.పూ 3000 నాటికే వాడుకలో ఉన్నాయి. పురాతన ఈజిప్షియన్, మినోవాన్, ఎట్రుస్కాన్ కాలాలనాటి ఆభరణాల్లో కూడా ఈ శైలి కనిపిస్తుంది. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభంలో ఇవి బాగా ప్రాచుర్యం పొందాయి. ఫ్లాపర్ దుస్తుల మీద ఈ ఆభరణాలను ఎక్కువగా ధరించేవారు. క్రమంగా అమెరికన్ శైలితో మిళితమై బోహో చిక్ డిజైన్లు రూపుదిద్దికున్నాయి. ప్రస్తుతం వింటేజ్, సమకాలీన హై ఫ్యాషన్‌ల కలయికతో సరికొత్త ఫ్రింజ్ ఆభరణాలను తయారు చేస్తున్నారు డిజైనర్లు.

● రంగురంగుల పూసలు, మెటల్ గొలుసులు, టాసెల్స్, ఫ్యాబ్రిక్ స్ట్రిప్స్‌తో డాంగ్లింగ్‌లను తయారుచేసి వాటిని నెక్లెస్ లేదా గొలుసుకు అమరుస్తారు. వీటిని సింపుల్‌గా కనిపించే మోడరన్ డ్రెస్‌ల మీద ధరిస్తే బోహేమియన్ గ్లామరస్ లుక్ వస్తుంది. బోహో టాసెల్స్, క్రిస్టల్ ఫ్రింజెస్, సాఫ్ట్ గ్రంజ్‌లతో రూపొందించిన చెయిన్లు... ఫార్మల్ వేర్ మీద బాగా సూటవుతాయి. ముత్యాలు, మువ్వలు, మెరిసే రాళ్లు వేలాడే మల్టీలేయర్డ్ మెటల్ చెయిన్స్... చీరలు, సల్వార్ సూట్స్ లాంటి సంప్రదాయ దుస్తుల మీద ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

● సన్నని చెయిన్‌కి ప్రేషియస్ రాళ్లు, లావుపాటి గుండ్లు, విభిన్న ఆకృతుల మెటల్ ప్లేట్స్ జోడించి సిద్ధం చేసిన ఫ్రింజ్ బ్రేస్‌లెట్లను యువత ఇష్టంగా ధరిస్తున్నారు. సూర్యుడు, చంద్రుడు, తాళం, తాళం చెవి, కారు, లాఫింగ్ బుద్ధ, రాళ్లు పొదిగిన హార్ట్, వివిధ రకాల జంతువుల బొమ్మలను రింగులతో కూర్చిన మల్టీ లేయర్డ్ చెయిన్ ఫ్రింజ్ బ్రేస్‌లెట్లకు అధికంగా డిమాండ్ ఉంటోంది. ఇవి అన్ని రకాల దుస్తుల మీద మోడరన్ లుక్‌నిస్తాయి.

● ఫ్రింజ్ జుంకాలను ఇష్టపడని అమ్మాయిలు ఉండరు. ఇవి వెడల్పుగా పొడవుగా ఉన్నప్పటికీ వేగంగా ఊగుతూ ముఖానికి అదనపు అందాన్నిస్తాయి. వీటిని బంగారం, వెండి, ఆక్సిడైజ్డ్ సిల్వర్, బ్లాక్ మెటల్, ఇతర లోహాలు, పట్టు దారాలతో రూపొందిస్తున్నారు. చాంద్‌బాలీలు, బుట్టలు, పెద్ద రింగులకు నవరత్నాలు, సీజెడ్ రాళ్లు లేదంటే గవ్వలు, రంగు రంగుల పూసలు, చిన్న గంటలు, గుండ్లు, మువ్వలు, సన్నని గొలుసులు వేలాడేలా అమర్చి సరికొత్త ఫ్రింజ్ ఇయర్ రింగ్స్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. ఇవి లెహంగాలు, కుర్తీలు లాంటి సంప్రదాయ దుస్తులమీద బాగుంటాయి. సన్నని పొడవైన సింగిల్ చెయిన్ డిజైన్లు, డ్రాప్ మోడల్స్.. జీన్స్ తరహా మోడరన్ దుస్తుల మీద బాగుంటాయి.



వరుస విజయాలు.. పాన్ ఇండియా ఇమేజ్.. కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్న అవకాశాలతో **మృణాల్ ఠాకూర్** కెరీర్ జెట్ స్పీడ్‌తో దూసుకుపోతోంది. అయితే, ఈ వెలుగుల వెనుక ఒక సాధారణ అమ్మాయి అసాధారణ పోరాటం ఉంది. కేవలం ఒక నటిగా మాత్రమే కాకుండా తనకంటూ కొన్ని విలువలను ఏర్పరచుకున్న ఒక వ్యక్తిత్వం ఉంది. మృణాల్ తాజా ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంపై ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

విలువలకే నా ఓటు

"నేను బాలీవుడ్‌లో ఉన్నానా? సౌత్‌లో ఉన్నానా? అని ఆలోచించను. నా దృష్టిలో అది ఒక భాషా వ్యత్యాసం మాత్రమే. పని పట్ల నిబద్ధత ఉంటే ఎక్కడికైనా వెళ్లొచ్చు" అంటారు మృణాల్. నిజానికి దక్షిణాది సినిమాల్లో నటించాలనేది ఆమె ప్లానింగ్‌లో లేదట. కానీ, ఒక వరంలా వచ్చిన అవకాశాన్ని ఆమె రెండు చేతులా అందిపుచ్చుకున్నారు. షూటింగ్ సెట్స్‌లో ఉండటమే తనకు దక్కే అతిపెద్ద గౌరవమని భావించే ఈ నటికి పనితప్ప మరో లోకం లేదు.

2026 ప్రయోగాల సంవత్సరం

మృణాల్ కెరీర్‌లో 2026 కీలకంగా మారబోతోంది. ఇప్పటి వరకు క్లాసిక్, ఎమోషనల్ రోల్స్‌లో చూసిన మనం త్వరలో ఆమెను యాక్షన్ అవతార్‌లో చూడబోతున్నాం. 'డెకాయిట్' వంటి యాక్షన్ థ్రిల్లర్, 'హై జవానీతో ఇష్క్ హోనా హై' వంటి రొమాంటిక్ కామెడీలతో తనలోని వైవిధ్యాన్ని చాటుకోవడానికి ఆమె సిద్ధమవుతున్నారు. "ప్రస్తుతం నేను ఒక అడుగు తర్వాత మరో అడుగు వేస్తూ ఎదుగుతున్నాను. నా ప్రయాణం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది" అంటారు మృణాల్.

తిరస్కరణల నుంచి సీతమ్మ వరకు

మృణాల్ బుల్లితెరపై నటిస్తున్నప్పుడు 'సినిమాలకు పనికిరావు' అన్న ఎత్తిపొడుపుల నుంచి నేడు 'సీతమ్మ'గా ఇంటింటికీ పరిచయం కావడం వరకు ఆమె ప్రయాణం స్ఫూర్తిదాయకం. ఐదు ఆడిషన్లలో తిరస్కారానికి గురైనా కుంగిపోకుండా 'రిజెక్షన్ అనేది మనల్ని మరో గొప్ప మార్గంవైపు నడిపిస్తుంది" అని నమ్మారు. అందుకే 'సీతారామం' కోసం తెలుగు నేర్చుకుని, ఆ పాత్రలో జీవించారు. తెలుగు ప్రేక్షకులు నేటికీ తనను ఒక పరాయి నటిగా కాకుండా 'సీతగారూ' అని పిలుస్తుంటే ఎంతో ఆనందంగా ఉందంటారు మృణాల్.

నో చెప్పే ధైర్యం

గ్లామర్ ప్రపంచంలో ఉంటూనే తనకంటూ కొన్ని గీతలు గీసుకున్నారు మృణాల్. తల్లిదండ్రులు ఇబ్బంది పడతారని ముద్దు సీన్ల కారణంగా కొన్ని పెద్ద సినిమాలను వదులుకున్నారు. "దీనివల్ల నా కెరీర్ నెమ్మదించినా పర్లేదు. కుటుంబ విలువలే నాకు ముఖ్యం" అని నిక్కచ్చిగా చెప్పే మృణాల్ అంటే పరిశ్రమలో ఎందరికో ఇష్టం.

అదోక జ్ఞాపకాల మ్యూజియం

చాలామంది నటీనటుల్లా సోషల్ మీడియా కోసం మృణాల్‌కు ప్రత్యేకంగా ఒక టీం ఉండదు. తన ఫొటోలు తనే పోస్ట్ చేస్తారు. "ఇతరుల కోసం నేను పోస్ట్ చేయను. నా కోసం నేను చేసుకుంటాను. నా ఇన్‌స్టాగ్రామ్ పేజీ నా జ్ఞాపకాల మ్యూజియం లాంటిది" అని చెప్పడం ఆమె నిజాయితీకి నిదర్శనం. మొటిమలు ఉన్న ముఖాన్ని చూపించడానికి కూడా ఆమె వెనుకాడరు. పర్ఫెక్షన్ అనేది ఒక అబద్ధమని, సహజంగా ఉండటమే నిజమైన అందమని మృణాల్ నమ్మకం. స్టార్‌డమ్ అనేది శాశ్వతం కాదని, ఈ రోజు మనం ఉన్న పొజిషన్ రేపు మరొకరికి దక్కుతుందని మృణాల్‌కు తెలుసు. అందుకే ఆమె ఎప్పుడూ వినయంగా ఉంటారు. సినిమా టెక్నికల్ విషయాలను నేర్చుకుంటూ ఒక నిరంతర విద్యార్థిలా సాగిపోతున్న ఆమె ప్రయాణం ఎందరికో ఆదర్శం.

రికార్డు సృష్టించిన దియా

రాజకీయాలు.. కురువృద్ధులకే సొంతం అనే రోజులకు కాలం చెల్లింది. విద్య, వ్యాపారాల్లో పోటీపడుతూ ముందుండే యువతరం.. రాజకీయ రంగాన్నీ విస్మరించడం లేదు. ముఖ్యంగా అమ్మాయిలు మేమున్నామంటూ దూసుకొస్తున్నారు. కేరళలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో దియా బిను పులిక్కకందమ్ అనే 21 ఏళ్ల యువతి విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. కొట్టాయం జిల్లా పాలా మునిసిపల్ ఛైర్మన్‌గా ఎన్నికవడమే కాదు... జాతీయంగా ఈ పదవి సాధించిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించారు.



దియా వయసు 21 ఏళ్లు మాత్రమే. ఆమె మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో ఎకనామిక్స్ డిగ్రీ పూర్తిచేసి ఎంబీఏ కోసం సిద్ధమవుతున్నారు. ఆమె కుటుంబానికి రాజకీయ అనుభవం ఉంది. పాలా మునిసిపల్ ఎన్నికల్లో దియా, ఆమె తండ్రి బినూ పులిక్కకందమ్, బాబాయి బిజు... ముగ్గురూ స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేసి గెలిచారు. ఈ ముగ్గురితోపాటు మరో కాంగ్రెస్ నేత మాయా రాహుల్ కూడా మద్దతు ప్రకటించడంతో యుడిఎఫ్ అధికారాన్ని కైవసం చేసుకుంది. దీంతో నలభై ఏళ్ల తరువాత పాలాలో కేరళ కాంగ్రెస్ పతిపక్షంలో నిలిచింది. యుడిఎఫ్‌కు పులిక్కకందమ్ కుటుంబానికి మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం దియాకు ఛైర్ పర్సన్ కుర్చీ దక్కింది. మాయా రాహుల్‌కు వైస్ ఛైర్ పర్సన్ పదవి లభించింది.



> దియా ఎన్నికతో కేరళలో యువ నాయకత్వానికి పెరుగుతున్న ఆదరణ మరోసారి బహిర్గతమైంది. గతంలో కూడా తిరువనంతపురం మేయర్‌గా ఆర్య రాజేంద్రన్(21), అరువాప్పులం పంచాయతీ అధ్యక్షురాలిగా రేష్మా మరియం రాయ్(21) పదవి బాధ్యతలు చేపట్టి రికార్డులు సృష్టించడం గమనించదగ్గ అంశం.

> "మా నాన్న ఎన్నికల్లో గెలుపొందడం ఇది అయిదోసారి. ఆయన ప్రజలకు చేస్తున్న సేవను చిన్నప్పటి నుంచి చూస్తున్నాను. నేను కూడా అలాగే దీర్ఘకాలిక ప్రణాళికలతో ప్రజలకు సేవలందిస్తాను. సాధ్యమైనంత త్వరగా మునిసిపాలిటీలో ప్రాథమిక సదుపాయాలు అందేలా చూస్తాను. నాన్నే నాకు స్ఫూర్తి."


ముత్యాల ముగ్గులు





పవని జానకి,
దర్శి, ప్రకాశం

17 చుక్కలు మధ్య చుక్క 9 వరకు





భాగీరథి కొక్రె,
బెంగళూరు



15 చుక్కలు మధ్య చుక్కలు 8 వచ్చే వరకు


మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

లూఫా వాడుతున్నారా...

చాలామందికి స్నానం చేసేటప్పుడు లూఫా (బాడీ స్క్రబ్బర్) వాడే అలవాటు ఉంటుంది. దీనికి సంబంధించి కొన్ని జాగ్రత్తలు పాటించాలనీ లేదంటే చర్మవ్యాధులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● లూఫాతో శరీరాన్ని రుద్దుకున్నప్పుడు దాని రంధ్రాల్లోకి సబ్బు నురుగు, మురికి, చర్మం నుంచి విడివడిన మృతకణాలు చేరి ఇరుక్కుంటాయి. దీన్ని సరిగా శుభ్రం చేయకుండా దీర్ఘకాలం అలాగే వాడుతూ ఉంటే ఫోలిక్యులైటిస్ అనే చర్మ వ్యాధి రావచ్చు. చర్మం మీద ఉండే వెంట్రుకల కుదుళ్లు వాచి కురుపులు, పుండ్లు ఏర్పడతాయి.



● లూఫాను వారానికి ఒకసారి వేడినీళ్లలో నానబెట్టి కొద్దిగా షాంపూ రాసి శుభ్రం చేయాలి. దీన్ని స్నానాల గదిలో, షవర్ కింద వేలాడదీయకూడదు. అలా చేయడం వల్ల లూఫా సరిగా ఆరదు. చెమ్మ వల్ల ఫంగస్‌లు, హానికారక బ్యాక్టీరియాలు చేరతాయి. లూఫాను ఎండ, గాలి తగిలేలా ఉంచడం మంచిది.

● ఇతరుల లూఫాలను వాడకూడదు. కనీసం రెండు నెలలకోసారి లూఫాను మార్చాలి.

● సింథటిక్ లూఫాలు గరుకుగా ఉంటాయి. ఇవి చర్మం పై పొరల్లో ఉండే సహజ నూనెలను తొలగిస్తాయి. దీంతో చర్మం పొడిబారడం, ఎర్రగా కమలడం, గీసుకుపోయి నల్లమచ్చలు ఏర్పడడం లాంటివి ఎదురవుతాయి. కాబట్టి మృదువుగా ఉండే ఆర్గానిక్ లూఫాలు ఉపయోగించడం మంచిది.

● వారానికి రెండుసార్లకు మించి లూఫాను వాడకూడదు. ముఖాన్ని శరీరలోని సున్నితమైన భాగాలను దీనితో రుద్దకూడదు. దీనికి బదులు సిలికాన్ స్క్రబ్బర్ లేదా కొంజాక్ స్పాంజ్‌ను ఉపయోగించుకోవచ్చు.

బందరు మిఠాయిలు

సంక్రాంతికి ప్రత్యేకం

బందరు లడ్డూ అంటే ఇప్పటికీ ఎంతో క్రేజ్. దీనికి జియోగ్రాఫికల్ గుర్తింపు వచ్చిన తరువాత విదేశాల్లో సైతం బందరు పేరు మారుమోగుతోందంటున్నారు మచిలీపట్నం మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వర రావు. లడ్డూలే కాదు సంక్రాంతి పండుగ సమయంలో ఇక్కడి పిండివంటలకు కూడా అత్యధికంగా డిమాండ్ ఉంటుందంటున్నారు ఆయన. అందుకే ఈడేపల్లిలో పెద్ద కార్ఖానాను స్థాపించారు. ఇక్కడ ఆయన స్వయంగా పిండి వంటలు తయారు చేస్తూ కనిపిస్తుంటారు కూడా. వంటకాల తయారీలో చేయి తిరిగిన గ్రామీణ మహిళలు ఎందరో ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. దేశ విదేశాల్లో పేరు పొందిన బందరు మిఠాయిలపై ప్రత్యేక కథనం..



ప్రత్యేకత ఏంటంటే...

పిండి వంటల తయారీకి ఎలాంటి యంత్ర పరికరాలు ఉపయోగించరు. ప్రతి పనినీ ఇక్కడి మహిళలు చేతులతోనే చేస్తారు. వంటకాలన్నీ ఇంట్లో తయారుచేసుకున్నట్లే రుచిగా శుచిగా ఉంటాయి. అరిసెలు, కజ్జికాయలు, సున్నుండలు, పూతరేకులు, బందరు హల్వా, నల్ల హల్వా, జిలేబీ లాంటి స్వీట్లతోపాటు స్పెషల్ బూందీ, చక్రాలు, కారప్పూస, చేకోడీలను కూడా ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. పండుగనాటికి నేతి అరిసెలు, నువ్వుల అరిసెలు, మామూలు అరిసెలను ఒక్కోటి రెండువేల కేజీలు తయారుచేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీటి తయారీ కోసం మహిళలు బియ్యాన్ని నానబెట్టి రోట్లో వేసి రోకలితో దంచి పిండి తయారు చేసి జాగ్రత్తగా ఆరబెడతారు. ముదురు గోధుమ రంగులో ఉండే పుట్ట బెల్లాన్ని, స్వచ్ఛమైన నెయ్యిని ఉపయోగిస్తారు. 'ఏటా సంక్రాంతి పండక్కి అరిసెలను ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లకు పంపుతూ ఉంటాం. ఈసారి కలకత్తా నుంచి కూడా ఆర్డర్లు వచ్చాయి' అని చెబుతున్నారు మహిళలు.



బందరు లడ్డు..

సంక్రాంతికి సంప్రదాయ పిండి వంటకాలతో పాటు బందరు లడ్డూ కూడా ఉండాల్సిందే! దీని పేరు వింటేనే ఎప్పుడు రుచి చూద్దామా అనిపిస్తుంది. బందరు లడ్డూ తయారీ విభిన్నంగా ఉంటుంది. శనగపిండితో బూందీ తయారుచేసి దాన్ని రోకలితో దంచడంతో ఒక విధమైన ముడి పదార్థం తయారు అవుతుంది. దాన్ని తగినంత బెల్లం పాకంతో మేళవించడం గొప్ప ఆర్ట్. అనుభవం ఉన్నవారికి మాత్రమే అది సాధ్యం. అందుకే బందరు లడ్డూకి అంత పేరు వచ్చింది.

స్పెషల్ కజ్జికాయలు

సంక్రాంతి స్పెషల్స్‌లో బందరు కజ్జికాయలకు మంచి పేరుంది. వీటిలో పలు వెరైటీలు ఉన్నాయి. బొంబాయిరవ్వ, పంచదార తో తయారు చేసే కజ్జికాయలకు, వేరుశనగపప్పు, బెల్లంతో తయారు చేసే కజ్జి కాయలకు ఎంతో తేడా ఉంటుంది. దేని రుచి దానిదే. కొబ్బరి, బెల్లం, కోవా కలిపి కూడా కజ్జికాయలు తయారు చేస్తారు. వీటిని కోవా కజ్జికాయలు అంటారు.

నల్ల హల్వా

ముందుగా గోధుమలను నానబెట్టి వాటిని దంచుతూ పాలు తీస్తారు. ఈ గోధుమపాలకు సమతూకంగా బెల్లం, నేతిలో వేయించిన జీడిపప్పు వేసి దగ్గరకు ఉడికిస్తారు. ఈ హల్వా మృదుమధురంగా మెత్తగా ఉంటుంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ దీన్ని ఇష్టంగా తింటుంటారు.

● ముదిగొండ శాస్త్రి, మచిలీపట్నం

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఈకో	మలయాళ చిత్రం	డిసెంబర్ 31
స్ట్రేంజర్ థింగ్స్ 5	తెలుగు (డబ్బింగ్)	జనవరి 01
లుపిన్ 4	వెబ్‌సిరీస్	జనవరి 01
హక్	హిందీ చిత్రం	జనవరి 02
అమెజాన్ ప్రైమ్		
సీగే మీ వోస్	ఒరిజినల్ మూవీ	జనవరి 02
జియో హాట్‌స్టార్		
ది కోపెన్‌హెగెన్ టెస్ట్	వెబ్‌సిరీస్	డిసెంబర్ 28
సన్‌నెక్స్ట్		
ఇతిరి నేరమ్	మలయాళచిత్రం తెలుగులో	డిసెంబర్ 31



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,41,220 ▲	1,29,450 ▲	2,53,000 ▲
విజయవాడ	1,44,000 ▲	1,30,000 ▼	2,54,000 ▲
విశాఖపట్నం	1,41,380 ▼	1,29,600 ▲	2,74,000 ▲
రాజమండ్రి	1,41,220 ▲	1,29,450 ▲	2,43,000 ▲
ప్రొద్దుటూరు	1,44,000 ▲	1,32,480 ▲	2,53,000 ▲
ముంబై	1,37,956 ▲	1,26,368 ▲	2,28,107 ▲

మ్యూచువల్ ఫండ్స్ లాభాలపై పన్ను పోటు ఎంత?



దేశీయంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులతో పాటు మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల్లోనూ పెట్టుబడులు గణనీయంగా పెరుగుతున్నాయి. గత నెలాఖరు నాటికి ఈ పథకాల నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) విలువ ఏకంగా రూ.81 లక్షల కోట్లకు చేరాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు సెన్సెక్స్, నిఫ్టీ సగటున 8 నుంచి 10 శాతం లాభాలు ఇస్తే.. మ్యూచువల్ ఫండ్స్ పథకాలు 12 నుంచి 15 శాతం రాబడులు ఇచ్చాయి. దీంతో చాలా మంది ఇన్వెస్టర్లు ముఖ్యంగా స్టాక్ మార్కెట్ మెలుకువలు పెద్దగా తెలియని రిటైల్ మదుపరులు ఎంఎఫ్ పథకాల్లో మదుపు చేస్తున్నారు. స్థిర ఆదాయాన్ని కోరుకునే మదుపరులు డెట్ పథకాల్లో మదుపు చేస్తుంటే, కొద్దిగా నష్ట భయానికి సిద్ధమయ్యే మదుపరులు ఈక్విటీ, బ్యాలెన్స్‌డ్ లేదా మల్టీ అసెట్స్ ఫండ్స్‌ను ఎంచుకుంటున్నారు. అయితే చాలా మంది ఎంఎఫ్ మదుపరులకు ఈ పథకాల పెట్టుబడులపై వచ్చే లాభాలపై పన్నుల ప్రభావం గురించి పెద్దగా అవగాహన లేదు. ఆ ప్రభావం ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

ఈక్విటీ పథకాలు

- ఈ పథకాల ద్వారా సమీకరించిన నిధుల్లో కనీసం 65 శాతం నిధులను ఎంఎఫ్‌లు దేశీయ ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడి పెట్టి ఉండాలి.
- ఈ పథకాల్లో పెట్టిన పెట్టుబడులను ఏడాది తర్వాత వెనక్కి తీసుకుంటే వచ్చే లాభాలను దీర్ఘకాలిక మూలధన లాభాలుగా పరిగణించి 12.5 శాతం పన్ను విధిస్తారు.
- మళ్లీ ఈ దీర్ఘకాలిక మూలధన లాభాల్లో ఏటా రూ1.25 లక్షల వరకు పూర్తి మినహాయింపు లభిస్తుంది.
- ఈక్విటీ పథకాల యూనిట్లను ఏడాదిలోగా వెనక్కి తీసుకుంటే వచ్చే లాభాలను స్వల్పకాలిక మూలధన లాభాలుగా పరిగణించి 20 శాతం పన్ను విధిస్తారు.

పన్నుల ప్రభావం

- బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీపై ఏటా పన్ను పోటు పడుతుంది.
- ఎంఎఫ్ పథకాల పెట్టుబడిపై వచ్చే లాభాలను మూలధన లాభాలుగా పరిగణించి ఆదాయ పన్ను విధిస్తారు.
- ఎంఎఫ్ పథకాల యూనిట్లను అమ్మినప్పుడు (రిడంప్షన్), ఒక పథకం నుంచి మరో పథకానికి మారినప్పుడు వచ్చే లాభాలపై మాత్రమే పన్నుల పోటు ఉంటుంది.
- ఈ పథకాల్లో పెట్టుబడి పెట్టేటప్పుడు, ఆ పథకాల్లో కొనసాగినంత కాలం ఎలాంటి పన్ను పోటు ఉండదు.
- పథకం క్యాటగిరీ, ఎంత కాలం తర్వాత పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు? అనే అంశాల ఆధారంగా ఈ పెట్టుబడులపై వచ్చే రాబడులపై పన్ను విధిస్తారు.

డెట్ పథకాలు

తమ నిధుల్లో 35 శాతం కంటే తక్కువ మొత్తాన్ని ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడి పెట్టే డెట్ పథకాలపై పన్నుల పోటు వేరే విధంగా ఉంటుంది. ఈ పథకాలపై వచ్చే రాబడులను ఆయా వ్యక్తుల ఆదాయంలో కలిపి.. ఆయా శ్లాబుల వారీగా పన్ను విధిస్తారు. ఇక్కడ మదుపరులు ఎంత కాలం పాటు ఆ పథకంలో ఉన్నారు? అనే విషయం లెక్కలోకి రాదు.

మల్టీ అసెట్ ఫండ్స్

- ఈ ఫండ్స్ తాము సమీకరించిన నిధుల్లో కనీసం పది శాతం చొప్పున ఈక్విటీ, డెట్, గోల్డ్‌లో మదుపు చేయాలి.
- ఈ ఫండ్స్ మొత్తం పెట్టుబడుల్లో 65 శాతం లేదా అంత కంటే ఎక్కువ మొత్తం ఈక్విటీలో ఉంటే.. ఆ ఫండ్ ద్వారా వచ్చే లాభాలకు, ఈక్విటీ ఫండ్స్ రాబడులకు వర్తించే పన్నుల విధానమే వర్తిస్తుంది.
- పథకం మొత్తం పెట్టుబడుల్లో 35 నుంచి 65 శాతం మధ్య ఈక్విటీలో ఉండే పథకాలపై వచ్చే దీర్ఘకాలిక మూలధన లాభాలపై 12.5 శాతం పన్ను పోటు పడుతుంది. కాకపోతే ఇందుకోసం ఈ పథకాల్లో పెట్టుబడులను కనీసం రెండేళ్ల పాటు ఆ పథకంలోనే ఉంచాలి.

డివిడెండ్స్‌పైనా పన్ను

ఎంఎఫ్ మదుపరులు ఐడీసీడబ్ల్యూ (ఇన్‌కమ్ డిస్ట్రిబ్యూషన్ కమ్ క్యాపిటల్ విత్‌డ్రాయల్) ఆప్షన్ కింద అందుకునే ఎంఎఫ్ పథకాల డివిడెండ్ ఆదాయం పూర్తిగా ఆదాయ పన్ను పరిధిలోకి వస్తుంది. ఈ ఆదాయాన్ని ఆయా వ్యక్తుల ఆదాయానికి జోడించి, వారి వారి ఆదాయ శ్లాబుల ప్రకారం పన్ను విధిస్తారు. ఇక్కడ ఆ పథకం ఈక్విటీ, డెట్, హైబ్రిడ్ అనే వ్యత్యాసాలు ఏమీ చూడరు.

హైబ్రిడ్ ఎంఎఫ్‌లు

ఈ పథకాలు తాము సమీకరించిన నిధులను ఈక్విటీ, డెట్, గోల్డ్‌లో మదుపు చేస్తాయి. ఇందులో ఎంత మొత్తాన్ని ఈక్విటీ షేర్లలో మదుపు చేశారు? అనే అంశం ఆధారంగా ఈ పథకాల రాబడులపై పన్ను ఆధారపడి ఉంటుంది.

- 65 నుంచి 75 శాతం పెట్టుబడులు ఈక్విటీలో ఉండే అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్‌పై వచ్చే లాభాలకు ఈక్విటీ ఫండ్స్ లాభాలకు వర్తించే పన్నుల నిబంధనలే వర్తిస్తాయి.
- 65 శాతానికి మించిన పెట్టుబడులు ఈక్విటీలో ఉండే బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్ రాబడులకూ ఇదే పన్నుల సూత్రం వర్తిస్తుంది.

ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ఫండ్స్

ఈ పథకాల ద్వారా సమీకరించే నిధులను ఎంఎఫ్‌లు ఆర్బిట్రేజ్ వ్యూహంతో రుణ పత్రాల్లో మదుపు చేస్తాయి. కనీసం రెండేళ్ల పాటు ఈ పథకాల్లో ఉన్న తర్వాత ఈ పథకాలపై వచ్చే లాభాలకు దీర్ఘకాలిక మూలధన లాభాల కింద 12.5 శాతం పన్ను విధిస్తారు.

ఈక్విటీ ఈటీఎఫ్‌లు

- ఈక్విటీ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్) ద్వారా సమీకరించే నిధుల్లో 90 శాతానికిపైగా నిధులను ఎంఎఫ్‌లు ఈక్విటీ ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్ చేయాలి.
- ఈ పథకాల్లో కనీసం ఏడాదికి పైగా ఉంచుకున్న పెట్టుబడులపై వచ్చే లాభాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల కింద 12.5 శాతం పన్ను విధిస్తారు.
- ఇంటర్నేషనల్ ఫండ్స్‌తో సహా ఇతర ఈటీఎఫ్‌లైతే రెండేళ్లకు పైగా ఉంచుకునే పెట్టుబడులపై వచ్చే లాభాలకూ 12.5 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నే వర్తిస్తుంది.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

- ఈ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు ఏడాదికి పైగా ఉంచుకుంటే వచ్చే లాభాలకి 12.5 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను వర్తిస్తుంది.
- గోల్డ్, సిల్వర్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్) అయితే కనీసం 24 నెలల పాటు పెట్టుబడులు అలాగే ఉంచాలి. అప్పుడే దీర్ఘకాలిక మూలధన లాభాల కింద 12.5 శాతం పన్ను వర్తిస్తుంది.

ఎలా వ్యవహరిస్తే మేలు ?

ఈక్విటీ పథకాల దీర్ఘకాలిక మూలధన లాభాల కింద ఏటా రూ.1.25 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు. ఎంఎఫ్ మదుపరులు ఈ సౌలభ్యాన్ని ఏటా జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. స్థిర ఆదాయ పథకాల ద్వారా సమర్థవంతమైన ప్రత్యామ్నాయ పన్ను ఆదా కోసం చూసే మదుపరులు ఆర్బిట్రేజ్ ఫండ్స్, ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లో పెట్టుబడుల కోసం ఆలోచించవచ్చు. కొద్దిగా నష్టభయాన్ని తట్టుకోగలిగితే హైబ్రిడ్ ఫండ్స్‌పైనే ఒక కన్నేయవచ్చు. ఇక్కడ మదుపరులు తమ పెట్టుబడి లక్ష్యం, కాలవ్యవధిని కూడా గుర్తుంచుకోవాలి.

టెకీల్లో అత్యంత రిచ్ జయశ్రీ ఉల్లాల్

ఆస్తుల నికర విలువ రూ.51,300 కోట్లు
సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్‌లు వెనక్కు



న్యూఢిల్లీ: ఆస్తుల సంపాదనలోనూ భారత సంతతి టెక్ దిగ్గజాలు దూసుకుపోతున్నారు. క్యాండేర్ హురున్ ఇండియా ఉమెన్ లీడర్స్ లిస్ట్ 2025లో అరిస్టా నెట్‌వర్క్స్ సీఈఓ జయశ్రీ ఉల్లాల్ (63) అనే భారత సంతతి మహిళా టెకీ అగ్రస్థానంలో నిలిచారు. ప్రస్తుతం ఆమె సంపద నికర విలువ 570 కోట్ల డాలర్లు. ప్రస్తుత భారత కరెన్సీ మారకం రేటు ప్రకారం ఇది సుమారు రూ.51,300 కోట్లకు సమానం. ఇది మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల (110 కోట్ల డాలర్లు), గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ (150 కోట్ల డాలర్లు)ల ఆస్తుల కంటే ఎంతో ఎక్కువ. ప్రస్తుతం భారత సంతతి టెకీల్లో ఎవరి నికర ఆస్తుల విలువ ఈ స్థాయిలో లేదు.

కంపెనీ నేపథ్యం: బ్రిటన్‌లో పుట్టి పెరిగిన జయశ్రీ ఉల్లాల్ అమెరికాలో ఇంజనీరింగ్‌లో ఉన్నత విద్య పూర్తి చేశారు. 2008 సెప్టెంబరులో అరిస్టా నెట్‌వర్క్స్ కంపెనీలో చేరి అంచెలంచెలుగా ఎదిగి అదే కంపెనీకి సీఈఓ, ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగారు. ఈ కంపెనీ పెద్దపెద్ద డేటా కేంద్రాలు, క్లౌడ్ సర్వీస్ కంపెనీలకు క్లౌడ్ ఆధారిత హై పెర్‌ఫార్మెన్స్ సాఫ్ట్‌వేర్ ఆధారిత స్విచ్‌లు, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు అందజేస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 28వ తేదీ			
హైదరాబాద్	650	విజయవాడ	680
వరంగల్	652	గోదావరి	665
చిత్తూరు	703	విశాఖపట్నం	660
		డజను గుడ్లు రూ. 96	



ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	142	విజయవాడ	135
వరంగల్	142	గుంటూరు	142
కరీంనగర్	142	ఒంగోలు	142
మహబూబ్‌నగర్	142	చిత్తూరు	144
కర్నూలు	142	నెల్లూరు	149
విశాఖపట్నం	131	అనంతపురం	149
గోదావరి	135		



జెప్టో మెగా ఐపీఓ

రూ.11,000 కోట్ల సమీకరణ లక్ష్యం

న్యూఢిల్లీ: దేశీయ క్విక్ కామర్స్ దిగ్గజం జెప్టో పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ మేరకు కంపెనీ.. మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి కాన్ఫిడెన్షియల్ విధానంలో ముసాయిదా పత్రాలను సమర్పించింది. ఈ ఐపీఓ ద్వారా సుమారు రూ. 11,000 కోట్లను సమీకరించాలని జెప్టో లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్కెట్లో లిస్టింగ్ కావాలని జెప్టో భావిస్తోంది. అనుకున్నట్లుగా జరిగితే భారత మార్కెట్లో లిస్టయిన అత్యంత యువ స్టార్టప్‌లలో ఒకటిగా జెప్టో నిలవనుంది. ప్రస్తుతం 63,000 కోట్ల మార్కెట్ విలువ కలిగిన జెప్టో ఈ ఐపీఓ ద్వారా లభించే నిధులను కార్యకలాపాల విస్తరణకు వినియోగించనుంది. కాగా జొమాటో (బ్లింకిట్), స్విగ్గీ (ఇన్‌స్టామార్ట్) వంటి సంస్థలు ఇప్పటికే మార్కెట్లో లిస్ట్ అయ్యాయి.

కోటక్ నిఫ్టీ నెక్స్ 50 ఈటీఎఫ్

కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. కోటక్ నిఫ్టీ నెక్స్ 50 ఈటీఎఫ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్. ఈ ఫండ్ 95-100 శాతం ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లోనూ, 0-5 శాతం వరకు డెట్, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో పెట్టుబడులు పెడుతుంది. దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా లార్జ్ క్యాప్ కంపెనీలను ఎంచుకుని ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ 2026 జనవరి 1. కనీస పెట్టుబడి రూ.5,000.

స్పోర్ట్స్

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

నాలుగో టెస్ట్‌లో కంగారూల చిత్తు | రెండ్రోజుల్లోనే ముగిసిన మ్యాచ్ | యాషెస్ సిరీస్

15 ఏళ్లు.. 18 టెస్ట్‌ల తర్వాత ఆస్ట్రేలియాలో ఇంగ్లండ్‌కు విజయం


జోష్ టంగ్

మెల్‌బోర్న్: ఇప్పటికే యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియాకు కోల్పోయిన ఇంగ్లండ్ నాలుగో టెస్ట్‌లో అద్భుతంగా పుంజుకుంది. తొలిరోజు వెనుకంజలో నిలిచినా, ఆ తర్వాత అమోఘంగా పోరాడింది. ఫలితంగా రెండ్రోజుల్లోనే మ్యాచ్‌ను ముగిస్తూ ఇంగ్లండ్ నాలుగు వికెట్లతో అపురూప విజయం అందుకుంది. దాంతో 18 వరుస టెస్ట్‌ల తర్వాత, దాదాపు 15 సంవత్సరాల అనంతరం ఆస్ట్రేలియా గడ్డపై తొలి గెలుపు రుచి చూసింది. 2010-11లో సిడ్నీ టెస్ట్ నెగ్గిన తర్వాత ఆస్ట్రేలియాలో 16 మ్యాచ్‌లను ఓడిపోయిన ఇంగ్లండ్, రెండింటిని డ్రా చేసుకుంది. ఇక..ఈ నాలుగో టెస్ట్‌లో ఓవర్‌నైట్ స్కోరు 4/0తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కంగారూలు 132 పరుగులకే కుప్పకూలారు. హెడ్ (46), కెప్టెన్ స్మిత్ (24 నాటౌట్), గ్రీన్ (19) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. బ్రైడన్ కార్స్ నాలుగు, స్టోక్స్ మూడు, జోష్ టంగ్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 175 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 178/6 స్కోరు చేసి ఛేదించింది. బెథెల్ (40), క్రాలీ (37), డకెట్ (34) రాణించారు. రిచర్డ్‌సన్, బోలాండ్, స్టార్క్ తలా రెండేసి వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 152, ఇంగ్లండ్ 110 రన్స్ చేశాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 3-1 ఆధిక్యంలో నిలిచింది. ఈ టెస్టులో ఓవరాల్‌గా 7 వికెట్లు తీసిన జోష్ టంగ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

సంక్షిప్తస్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 152, రెండో ఇన్నింగ్స్: 132 (హెడ్ 46, స్మిత్ 24 నాటౌట్, గ్రీన్ 19, కార్స్ 4/34, స్టోక్స్ 3/24, టంగ్ 2/44)

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 110, రెండో ఇన్నింగ్స్: 178/6 (బెథెల్ 40, క్రాలీ 37, డకెట్ 34, బ్రూక్ 18 నాటౌట్, రిచర్డ్‌సన్ 2/22, బోలాండ్ 2/29, స్టార్క్ 2/55).

4 యాషెస్ చరిత్రలో అతి తక్కువ బంతుల్లో (852) ముగిసిన నాలుగో టెస్ట్‌గా ఈ మ్యాచ్ రికార్డుకెక్కింది. ఓల్డ్‌ట్రాఫర్డ్ (1888, 788 బంతులు) లార్డ్స్ (1888, 792), ఈ సిరీస్ పెర్త్ తొలి టెస్ట్ (847 బంతులు) ముందున్నాయి.

ఓ సిరీస్‌లో ఒకటి కంటే ఎక్కువ మ్యాచ్‌లు రెండు రోజుల్లోనే ముగియడం టెస్ట్ చరిత్రలో ఇది ఐదోసారి.

5 ఈ యాషెస్ సిరీస్ తొలి టెస్ట్ (పెర్త్) కూడా రెండో రోజుల్లో ముగిసిన విషయం తెలిసిందే.

ఏ బ్యాటర్ కూడా అర్ధ శతకం చేయకుండా టెస్ట్ ముగియడం సుదీర్ఘ ఫార్మాట్ చరిత్రలో ఇది ఐదోసారి.

ఆసీస్‌దే అగ్రస్థానం

ఈ ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సైకిల్‌లో ఇప్పటి వరకు 100 శాతం పాయింట్లతో ఆస్ట్రేలియా పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. కానీ బాక్సింగ్ డే టెస్ట్ ఓటమితో ఆ జట్టు పాయింట్ల శాతం 85.71కి తగ్గింది. అయినా కంగారూలే టాప్‌లో ఉన్నారు. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసును మరింత పటిష్ఠం చేసుకున్నారు. ఇంగ్లండ్ (35.19 శాతం) ఏడో స్థానంలో ఉండగా.. న్యూజిలాండ్ (77.78), దక్షిణాఫ్రికా (75) వరుసగా రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

టాప్‌లో హంపి

ఫిడే ప్రపంచ చాంపియన్‌షిప్

దోహా: ఫిడే వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి టాప్‌లో కొనసాగుతోంది. మహిళల విభాగంలో మొత్తం ఎనిమిది రౌండ్‌లు ముగిసే సరికి డిఫెండింగ్ చాంపియన్ కోనేరు హంపి (6.5), ఝు జినెర్ (6.5)తో కలిసి అగ్ర స్థానంలో నిలిచింది. శనివారం జరిగిన నాలుగు గేమ్‌లలో..హంపి మూడు నెగ్గి మరొకటి డ్రా చేసుకుంది. మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఆరు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో కొనసాగుతోంది. ఓపెన్ కేటగిరీలో తొమ్మిది రౌండ్‌లు ముగిసే సరికి భారత గ్రాండ్ మాస్టర్లు గుకేష్, అర్జున్ ఇరిగేసి చెరో 6.5 పాయింట్లతో సంయుక్తంగా ఏడో స్థానంలో కొనసాగుతున్నారు. రెండోరోజు..నాలుగు రౌండ్‌లలో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అర్జున్ మరో రెండు గేమ్‌లను డ్రా చేసుకొన్నాడు. మరో గేమ్‌లో పరాజయం చవిచూశాడు. ఇక ప్రపంచ చాంపియన్ గుకేష్ ఒక రౌండ్‌లో నెగ్గి, మరో మ్యాచ్‌లో ఓటమి పాలయ్యాడు. మిగిలిన రెండు గేమ్‌లను డ్రాగా ముగించాడు.



చరిష్మా X తన్వి

సెమీస్‌లో తరుణ్, కిరణ్ అవుట్
జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్

విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి): తెలుగమ్మాయి సూర్య చరిష్మా జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తన దూకుడు కొనసాగిస్తోంది. క్వార్టర్స్‌లో టాప్‌సీడ్ ఉన్నతి హుడాకు షాకిచ్చి సంచలనం సృష్టించిన చరిష్మా.. అదే జోరులో సెమీఫైనల్‌ను కూడా విజయవంతంగా దాటేసింది. శనివారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో చరిష్మా 21-18, 18-21, 21-9తో ప్రపంచ 45వ ర్యాంకర్ రక్షితశ్రీని ఓడించింది. ఆదివారం జరిగే ఫైనల్లో తన్వి పత్రితో చరిష్మా అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీస్‌లో తన్వి 18-21, 21-12, 21-15తో శ్రుతిపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ కిరణ్ జార్జ్, తెలుగు షట్లర్ తరుణ్ మన్నేపల్లిలకు చుక్కెదురైంది. సెమీఫైనల్స్‌లో రిత్విక్ సంజీవి 21-16, 17-21, 22-20తో కిరణ్ జార్జ్‌పై, భరత్ రాఘవ్ 21-17, 11-21, 21-11తో తరుణ్‌పై గెలుపొంది తుదిపోరులో ముఖాముఖికి సిద్ధమయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో టాప్‌సీడ్ జోడీ ఆషిత్ సూర్య/అమృత 8-21, 21-18, 21-18తో మూడో సీడ్ జంట దీప్/సోనాలిపై, రెండోసీడ్ ద్వయం సాత్విక్ రెడ్డి/రాధిక 21-13, 21-15తో నితిన్/కనిక జోడీపై నెగ్గి ఫైనల్ చేరారు. మహిళల డబుల్స్‌లో మాజీ చాంపియన్ శిఖా గౌతమ్/అశ్విని భట్, ప్రియా దేవి/శ్రుతి మిశ్రా ఫైనల్‌కు దూసుకొచ్చారు.

అండర్-19 వరల్డ్‌కప్ కెప్టెన్.. ఆయుష్ మాత్రే

వైభవ్‌కు సౌతాఫ్రికా టూర్ పగ్గాలు



ముంబై: అండర్-19 వరల్డ్‌కప్‌లో భారత జట్టు కెప్టెన్‌గా ఆయుష్ మాత్రేను సెలెక్టర్లు ఎంపిక చేశారు. వచ్చే జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు నమీబియాలో ఈ జూనియర్ వరల్డ్‌కప్ జరగనుంది. అయితే, మెగా టోర్నీకి ముందు జరిగే అండర్-19 దక్షిణాఫ్రికా పర్యటనకు గాయపడిన మాత్రే, విహాన్ మల్హోత్రా దూరమయ్యారు. దీంతో జనవరి 3, 5, 7వ తేదీల్లో జరిగే సఫారీలతో మూడు వన్డేల సిరీస్‌కు యువ కెరటం వైభవ్ సూర్యవంశీ సారథ్యం వహించనున్నాడు.

దక్షిణాఫ్రికా టూర్‌కు భారత అండర్-19 జట్టు: వైభవ్ సూర్యవంశీ (కెప్టెన్), ఆరోన్ జార్జ్ (వైస్ కెప్టెన్), వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్, హర్వంశ్, అంబ్రిష్, కనిష్క్ చౌహాన్, ఖిలన్ పటేల్, ఎనాన్, హనిల్ పటేల్, దీపేష్, కిషన్, ఉధవ్ మోహన్, యువరాజ్ గోలి, రాహుల్.

అండర్-19 వరల్డ్‌కప్ జట్టు: ఆయుష్ మాత్రే (కెప్టెన్), విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, ఆరోన్ జార్జ్, వేదాంత్, అభిజ్ఞాన్, హర్వంశ్ సింగ్, అంబ్రిష్, కనిష్క్ చౌహాన్, ఖిలన్ పటేల్, ఎనాన్, హనిల్ పటేల్, దీపేష్, కిషన్, ఉధవ్ మోహన్.

మరెక్కడైనా అయితే ఎన్ని విమర్శలొచ్చేవో..

మెల్‌బోర్న్ పిచ్‌పై స్టోక్స్



మెల్‌బోర్న్: మెల్‌బోర్న్ పిచ్ పూర్తిగా బౌలర్లకు అనుకూలించడాన్ని ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ తప్పుబట్టాడు. ఆస్ట్రేలియాలో కాకుండా మరెక్కడైనా ఇలాంటి పిచ్‌ను రూపొందించి ఉంటే తీవ్ర విమర్శలు చేసేవారన్నాడు. యాషెస్ సిరీస్ నాలుగో టెస్ట్ తొలి రోజు 20 వికెట్లు నేలకూలిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్, భారత మాజీ కీపర్ దినేశ్ కార్తీక్ కూడా స్టోక్స్ అభిప్రాయంతో ఏకీభవించారు. 'రెండ్రోజుల్లోనే మ్యాచ్ ముగియడం సబబు కాదు. కానీ ఇలాంటి వికెట్‌ను ప్రపంచంలో మరెక్కడైనా తయారు చేస్తే దుమ్మెత్తి పోసేవారు' అని మ్యాచ్ తర్వాత స్టోక్స్ కుండబద్దలు గొట్టాడు. 'భారత్‌లో టెస్ట్ మొదటి రోజు ఇలానే వికెట్ల జాతర సాగితే ఎంత రాద్ధాంతం చేసేవారో? ఇప్పుడు ఆస్ట్రేలియాను అలాగే తప్పుపడతారా' అని కెవిన్ ప్రశ్నించాడు. 'ఈ వికెట్ చాలా సాధారణంగా ఉంది. 4 యాషెస్ టెస్ట్‌లు రెండోరోజుల్లో ముగియడమా' అని దినేశ్ ప్రశ్నించాడు.



జోరు సాగనీ!

ఆత్మవిశ్వాసంతో భారత్ | ● బోణీ కొట్టాలని శ్రీలంక ● మహిళల నాలుగో టీ20 నేడు

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

తిరువనంతపురం: హ్యాట్రిక్ విజయాలతో ఇప్పటికే శ్రీలంకతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకొన్న భారత మహిళల జట్టు తర్వాతి మ్యాచ్‌లోనూ అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగే నాలుగో టీ20లో లంకతో హర్మన్‌ప్రీత్ సేన తలపడనుంది. అయితే, గత మూడు మ్యాచ్‌ల్లో మెరుగ్గా రాణించిన భారత బౌలర్లు 130 లోపే ప్రత్యర్థిని కట్టడి చేశారు. దీంతో మన బ్యాటర్లకు కఠిన పరీక్ష ఎదురుకాలేదు. అయితే, టాస్ కూడా మనోళ్లకు కలిసొచ్చింది. దీంతో మంచు ప్రభావం పెద్దగా పడలేదు. తొలి రెండు మ్యాచ్‌ల్లో అరుంధతి అంతగా రాణించలేక పోవడంతో మూడో టీ20లో రేణుకా సింగ్‌కు అవకాశం కల్పించారు. స్పిన్నర్లు దీప్తీశర్మ, వైష్ణవి శర్మ బ్యాటర్లను కట్టడి చేశారు. ఇక, బ్యాటింగ్‌లో స్మృతి మంధాన తన స్థాయికి తగ్గ ఆట తీరును ఇప్పటివరకు ప్రదర్శించలేదు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో మొత్తం 40 పరుగులే చేసింది. ఆమె నుంచి జట్టు భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. టాపార్డర్‌లో షఫాలీ అదరగొడుతుండడంతో మిగతా వారికి పనిలేకుండా పోయింది. ఈ మ్యాచ్‌లో యువ బ్యాటర్లు కమలిని, హర్లీన్‌ను తుది జట్టులోకి తీసుకొనే చాన్సుంది. మరోవైపు లంక జట్టు కనీస పోటీ కూడా ఇవ్వలేకపోతోంది. కెప్టెన్ చమరి ఆటపట్టు, హర్షిత, హాసిని విఫలమవుతున్నారు. బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ ఆ జట్టు మెరుగుపడాలి.

'హజారే' ఆటలో రోహిత్, విరాట్ ఫీజులు ఎంతంటే..



న్యూఢిల్లీ: టీమిండియా స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడుతుండడంతో దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ కొత్త కళ సంతరించుకుంది. అయితే ఈ టోర్నమెంట్‌లో ఆడుతున్న రోహిత్, కోహ్లీకి బీసీసీఐ ఎంత చెల్లిస్తుందనే ప్రశ్న చాలామందిలో ఉంది. బీసీసీఐ వర్గాల ప్రకారం.. వీళ్లిద్దరు ఒక్కో మ్యాచ్‌కు రూ. 60 వేలు రుసుముగా అందుకుంటున్నారు. ఇదిగాక ప్రయాణ, ఆహార, వసతి భత్యాలు అదనంగా చెల్లిస్తారు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిస్తే అదనంగా రూ. 10 వేలు లభిస్తాయి. కాగా..ఒక్కో అంతర్జాతీయ వన్డేకు రోహిత్, విరాట్‌లకు బోర్డు రూ. 6 లక్షల చొప్పున ఇస్తుంది.

చెప్పు తీసుకుకొట్టేలాగా సమాధానం చెప్పాలి

● శివాజీ వ్యాఖ్యలపై నాగబాబు స్పందన



నటుడు శివాజీ ఇటీవల హీరోయిన్ల వస్త్రధారణ గురించి చేసిన వ్యాఖ్యలపై ఏపీ ఎమ్మెల్సీ నాగబాబు తీవ్రంగా స్పందించారు. శివాజీ తన వ్యక్తిగత టార్గెట్ కాదని చెప్తూనే, ఆడపిల్లల వస్త్రధారణ వల్లే వారిపై దాడులు జరుగుతున్నాయనే అర్థంలో మాట్లాడడం తప్పు అని నాగబాబు ఖండించారు. ఆడపిల్లలు ఏ డ్రెస్ వేసుకోవాలి, ఎలా ఉండాలి అని నిర్ణయించే హక్కు మగవారికి లేదని ఆయన స్పష్టం చేశారు. దీనిని ఆయన మోరల్ పోలీసింగ్‌గా అభివర్ణించారు. ఇలాంటి వ్యాఖ్యలను సపోర్ట్ చేసే మహిళలను చూసి బాధగా ఉందని, మహిళలందరూ బయటకు వచ్చి తమ వాయిస్ వినిపించాలని, ఈ చాదస్తపు మెంటాలిటీ ఉన్నవారికి ఎదురుతిరిగి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో ఆడపిల్లలు ఇలానే ఉండాలి అని ఎవరైతే చెప్పారో వాళ్లని చెప్పు తీసుకుకొట్టేలాగా మీరు సమాధానం చెప్పకపోతే మహిళాలోకం తమను తామే నష్టపరుచుకున్నట్లు అవుతుంది అని హెచ్చరించారు. ఒక తండ్రిగా, సోదరుడిగా, ఆడపిల్లల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించాలని, వారిని అణచివేసే ధోరణిని విడనాడాలని కోరారు.

సలహాలు ఇవ్వకూడదని అర్థమైంది



శివాజీ

నేను అనవసరంగా సలహాలు ఇచ్చాను.. ఎవరి హక్కులకు భంగం కలిగినా రక్షించే వ్యవస్థలు ఉన్నాయి, ఇకపై ఎవరికీ సలహాలు ఇవ్వకూడదని అర్థమైందని సినీ నటుడు శివాజీ అన్నారు. మహిళల దుస్తులపై దండోరా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివాజీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఆయనకు స్వయంగా కమిషన్ ముందు హాజరు కావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో శనివారం శివాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ముందు హాజరై వివరణ ఇచ్చారు. అనంతరం శివాజీ మాట్లాడుతూ.... నా వ్యాఖ్యల వల్ల బాధపడ్డవారి తరపున కమిషన్ ప్రశ్నలు అడిగిందని, వాటికి తాను సమాధానాలు చెప్పానన్నారు. ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదని, ఇటీవల చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో మాట్లాడేటప్పుడు తప్పులు దొర్లాయని అన్నారు. నాకు బాగా కావల్సిన వారు ఇంత కుట్రచేస్తారనుకోలేదని బాధను వ్యక్త పరిచారు. కమిషన్ అడిగిన వాటికి సమాదానాలు చెప్పానని, ఇంకా వివరణ కావాల్సి వస్తే మళ్లీ కమిషన్ ముందుకు వస్తానని, వాళ్లకు నచ్చని ఆ మాటలను వెనక్కి తీసుకుంటున్నా అని ఈ విషయాన్ని ఇంతటితో వదిలేద్దామన్నారు. సినిమాలు రాకపోతే వ్యవసాయం చేసుకుని బతుకుతానని అన్నారు.

రాంగోపాల్‌పేట్ (ఆంధ్రజ్యోతి)



పెన్నుతో రాశారా

గన్నుతో రాశారా అనేలా ఉంటుంది

ప్రభాస్

'నా అభిమానులకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వాలని 'రాజాసాబ్' చిత్రం చేశాం. ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాలు చూసి మారుతి రైటింగ్‌కు అభిమానిగా మారాను. పతాక సన్నివేశాలను ఆయన పెన్నుతో రాశారా, మెషీన్ గన్నుతో రాశారా అనే స్థాయిలో ఉంటాయి' అని ప్రభాస్ ప్రశంసించారు. ఆయన కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జనవరి 9న విడుదలవుతోంది. శనివారం హైదరాబాద్‌లో చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో సీనియర్ నటి జరీనా వాహబ్ నాకు నాయనమ్మ పాత్రలో నటించారు. డబ్బింగ్ చెప్పేటప్పుడు ఆమె నటనను అలా చూస్తుండిపోయాను. ఈ సినిమాకు ఆమె కూడా ఓ హీరోనే. బడ్జెట్ పెరిగినా విశ్వప్రసాద్ గారు ఎంతో ధైర్యంగా ఈ సినిమాను నిర్మించారు. రిద్ది, మాళవిక, నిధి... ముగ్గురూ తమ నటనతో ఆకట్టుకుంటారు. ఇలాంటి క్లైమాక్స్‌తో ఇప్పటివరకూ ఏ చిత్రం రాలేదు. రేపు ట్రైలర్ వస్తుంది. చూడండి. అదిరిపోతుంది. మా 'రాజాసాబ్'తో పాటు సంక్రాంతికి వచ్చే అన్ని సినిమాలు బ్లాక్ బస్టర్ అవ్వాలి' అని ఆకాంక్షించారు.

నా ఇంటి అడ్రస్ ఇస్తా రండి

ఈ సినిమా కోసం మూడేళ్ల పాటు పడిన కష్టం, ప్రభాస్ ఇచ్చిన సపోర్ట్‌ను గుర్తు చేసుకొని వేదికపై మారుతి భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. 'ఈ సినిమాలో ఒక్క సీన్ ప్రేక్షకులను నిరాశపరిచినా, నా ఇంటి అడ్రెస్ ఇస్తా రండి' అంటూ సినిమాపై తనకున్న నమ్మకాన్ని చాటుకున్నారు. ప్రభాస్ రేంజ్‌కు తగ్గట్లు ఏదో సినిమా చేశాం అనిపించుకోకుండా, ఒక పెద్ద స్పాన్ ఉన్న హారర్ ఫాంటసీ మూవీగా 'రాజాసాబ్'ను తీర్చిదిద్దినట్లు చెప్పారు.

నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'మా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలో బిగ్గెస్ట్ స్టార్‌తో చేసిన బిగ్గెస్ట్ ఫిల్మ్ ఇది. చాలామంది చిన్న సినిమా అనుకున్నారు కానీ, మూడేళ్లు కష్టపడి 'రాజాసాబ్'ను నిర్మించాం. ఏ ఒక్కరినీ మా చిత్రం నిరాశపరచదు. హారర్ ఫాంటసీ జానర్‌లో రాజాసాబ్ బిగ్గెస్ట్ ఫిల్మ్ అవుతుంది' అని చెప్పారు. ప్రభాస్ లాంటి స్టార్ నటించిన సినిమాతో టాలీవుడ్‌లో అరంగేట్రం చేయడం గౌరవంగా భావిస్తున్నానని మాళవికా మోహనన్ చెప్పారు. ప్రభాస్‌తో సినిమా చేయడంతో ఓ కల నిజమైనట్లు ఉందని నిధి అగర్వాల్ అన్నారు.



బాక్సాఫీస్ విన్నర్ 'ఈషా'

అఖిల్‌రాజ్, త్రిగుణ్, హెబ్బాపటేల్ ప్రధాన పాత్రధారులుగా మన్నె శ్రీనివాస్ తెరకెక్కించిన చిత్రం 'ఈషా'. కె.ఎల్.దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వర రావు నిర్మించారు. ఈ సినిమాను ఇటీవలె నిర్మాతలు వంశీ నందిపాటి, బన్నీ వాస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో బన్నీ వాస్ మాట్లాడుతూ 'ఒక సినిమా విజయం సాధించిందని చెప్పడానికి దాని వసూళ్లే ప్రామాణికం. మా చిత్రం మొదటి రోజు రూ. 2 కోట్లకు పైబడి గ్రాస్‌ను వసూలు చేసింది. చిన్న చిత్రాల్లో ఇది రికార్డు. బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచిన ఈ సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు' అని చెప్పారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ 'ఈ సినిమాకు ప్రేక్షకులే చీఫ్ గెస్టులు. వారు థియేటర్లో ఉండి సినిమాను విజయవంతం చేశారు. వారికి రుణపడి ఉంటా' అని అన్నారు. నిర్మాతలు దామోదర ప్రసాద్, వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 'కంటెంట్ ఈజ్ కింగ్ అని మరోసారి 'ఈషా' చిత్రం రుజువుచేసింది. ఇది తెలుగు సినిమా ప్రేక్షకుల విజయం' అని అన్నారు.

అల్లు అరవింద్ నిర్మాణంలో హీరోగా



యువ కథానాయకుడు రోషన్ కెరీర్ 'ఛాంపియన్' సినిమా విజయంతో అద్భుతమైన మలుపు తిరిగింది. ఈ స్పోర్ట్స్ డ్రామా బాక్సాఫీసు వద్ద మంచి విజయం సాధించడం, రోషన్ నటనకు వచ్చిన ప్రశంసలు అతనికి అగ్ర నిర్మాణ సంస్థల నుంచి వరుస అవకాశాలను తెచ్చిపెడుతున్నాయి. టాలీవుడ్ దిగ్గజ నిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ 'ఛాంపియన్' చిత్రాన్ని వీక్షించి, రోషన్ నటనను మెచ్చుకున్నారు. రోషన్‌ను అభినందించడమే కాకుండా తన బ్యానర్‌లో ఒక సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ చిత్రంలో రోషన్ కెరీర్‌లో ఒక మైలురాయి కానుంది. వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

తప్పకుండా చూడాల్సిన సినిమా



డి.సురేశ్‌బాబు సమర్పణలో సినిమాటిక్ ఎలిమెంట్స్, రిషన్ సినిమాస్, మాన్‌సూన్ టేల్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించారు. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా చిత్రబృందం సక్సెస్‌మీట్ నిర్వహించింది. నటుడు సందీప్ కిషన్ మాట్లాడుతూ 'ఇలాంటి కొత్త తరహా చిత్రాలకు ఏమైనా చేయాలనిపించింది. నిజాయితీతో చేసిన ఈ ప్రయత్నాన్ని అందరూ అభినందిస్తున్నారు. నేను 500 టికెట్లు కొని ప్రేక్షకులకు ఇవ్వబోతున్నాను' అని చెప్పారు. దర్శకుడు ప్రణీత్ మాట్లాడుతూ 'మా సినిమాకు అన్ని ఏరియాల నుంచి మంచి స్పందన వస్తోంది. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరిస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు.



తెలుగువాళ్లు

మంచి చిత్రాలను ఎప్పుడూ ఆదరిస్తారు

ఉపేంద్ర

శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి ప్రధాన పాత్రలు పోషించిన '45 ది మూవీ' చిత్రం జనవరి ఒకటిన విడుదలవుతోంది. అర్జున్ జన్య దర్శకత్వంలో ఉమా రమేశ్‌రెడ్డి, ఎం.రమేశ్‌రెడ్డి నిర్మించారు. శనివారం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 'అర్జున్ జన్య అద్భుతంగా ఈ చిత్రం కథను నాకు వినిపించడంతో మీరే డైరెక్ట్ చేయమని సలహా ఇచ్చాను. కన్నడంలో ఈ చిత్రం ఇప్పటికే విడుదలై విజయం సాధించింది. తెలుగులో మైత్రీ మూవీస్ సంస్థ ద్వారా విడుదలవుతున్నందుకు ఆనందంగా ఉంది. ఎన్ని రోజులు ఈ భూమి మీద ఉంటామో తెలీదు కానీ ఉన్నన్నీ రోజులూ సంతోషంగా బతకాలని ఈ చిత్రం చెబుతుంది' అన్నారు. అర్జున్ జన్య ఈ సినిమాతో పెద్ద దర్శకుడవుతారని ఉపేంద్ర చెప్పారు. శివన్నని ఇంతవరకూ ఇలా ఏ సినిమాలో చూడలేదనీ, అద్భుతమైన పాత్ర ఇందులో చేశారని ఉపేంద్ర అన్నారు. తెలుగువాళ్లు మంచి చిత్రాలను ఎప్పుడూ ఆదరిస్తారు, ఈ సినిమాకు కూడా సపోర్ట్ చేయాలని ఆయన కోరారు. 'ఓ కొత్త ప్రపంచాన్ని '45 ది మూవీ' లో చూస్తారు. మూడున్నర ఏళ్లు ఈ చిత్రం కోసం కష్టపడ్డాను' అని అర్జున్ జన్య చెప్పారు. గరుడ పురాణం గురించి గొప్పగా చెప్పే సినిమా ఇదని నిర్మాత రమేశ్ రెడ్డి చెప్పారు.

మెప్పించే క్లైమాక్స్‌తో



చేయని తప్పుకు ఊరంతా నింద వేస్తే, ఒక యువకుడు తన నిజాయితీని ఎలా నిరూపించుకున్నాడు అనే ఆసక్తికరమైన ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన చిత్రం 'నీలకంఠ'. మాస్టర్ మహేంద్రన్, నేహా పఠాన్ జంటగా నటించారు. రాకేశ్ మాధవన్ దర్శకత్వంలో మర్లపల్లి శ్రీనివాసులు, వేణుగోపాల్ దీవి నిర్మించారు. ఈ చిత్రం జనవరి 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సినిమా ఆఖరి 20 నిమిషాలు ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. మంచి ఎమోషన్స్, ఫైట్స్, పాటలు ఉన్నాయి' అని చెప్పారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా రూపొందించాం, ప్రేక్షకులను మెప్పిస్తుందని నిర్మాతలు చెప్పారు.

బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపు వద్దు: సీపీఐ

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో విడుదలయ్యే అగ్ర హీరోల సినిమాలకు బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపును నిలిపివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు శనివారం ఆయన లేఖ రాశారు. 'కొన్ని నిర్మాణ సంస్థలు, పలువురు దర్శకులు పోటీ పడి పెద్ద హీరోల సినిమాలను కోట్లాది రూపాయలు వెచ్చించి, ఏళ్ల తరబడి చిత్రీకరిస్తున్నారు. దీంతో చిత్ర నిర్మాణ ఖర్చు వందల కోట్ల నుంచి వేల కోట్లకు చేరింది. దీంతో ప్రేక్షకులకు సినిమా భారంగా మారింది' అని లేఖలో పేర్కొన్నారు. మల్టీప్లెక్స్ మాల్స్‌లో పార్కింగ్, తినుబండారాల దోపిడీని కూడా అరికట్టాలని కోరారు.

పీడీ యాక్ట్ ఉపసంహరించండి: రాఘవులు

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్టును ఉపసంహరించి, వెంటనే ఆయనను విడుదల చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. 'సామాన్య ప్రజలు, రైతుల జీవితాల మెరుగు కోసం నిరంతరం పని చేస్తున్న మా పార్టీ నాయకుడిని ఒక నేరస్థుడిగా చిత్రీకరించి అరెస్టు చేసి జైలుకు పంపడం విస్మయం కలిగిస్తోంది. ఎవరి ప్రయోజనం కోసం ప్రభుత్వం ఈ చర్యకు పూనుకున్నదో ప్రజలు గమనిస్తున్నారు. రైతుల హక్కుల కోసం పని చేయడాన్ని ప్రభుత్వం నేరంగా పరిగణిస్తుందా? అనేక అక్రమాలకు, దుర్మార్గాలకు పాల్పడుతున్న నేరస్థులందరూ కళ్ల ముందు దర్జాగా తిరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వం.. అప్పలరాజును వేకువజామున తీసుకెళ్లడం ప్రజాస్వామ్యమేనా?' అని లేఖలో ప్రశ్నించారు. సీఎం వెంటనే జోక్యం చేసుకుని అప్పలరాజుపై మోపిన అభియోగాలను ఉపసంహరించుకుని, ఆయనను విడుదల చేసేలా ఆదేశించాలని కోరారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు హేయం

- ప్రతి ఒక్కరూ ఖండించాలి: మాధవ్

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై జరుగుతోన్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం లేని బంగ్లాదేశ్‌లో భారత్‌పై కుట్రపూరిత వ్యతిరేకత పెంచుతూ, హిందువులపై జరుగుతున్న వరుస దాడులు, మూక హత్యలపై నిరసన వ్యక్తం చేయాలని ఒక ప్రకటనలో సూచించారు. దళిత హిందూ యువకుడు దీపూ చంద్రదాస్, తాజాగా రాజ్‌బరి జిల్లాలో మరో హిందూ యువకుడిని కిరాతకంగా కొట్టి చంపడం తీవ్రమైన చర్యగా పేర్కొన్నారు. ఇప్పటికే సినీనటులు ఖండిస్తున్నారని, అన్ని వర్గాలు నిరసనకు దిగితే ప్రపంచ వ్యాప్తంగా బంగ్లాదేశ్‌పై ఒత్తిడి పెరిగి అక్కడి మైనార్టీ హిందువుల ప్రాణాలు పోకుండా ఆగుతాయన్నారు.

ఫిబ్రవరి 2న 'నరేగా' సభకు బండ్లపల్లి రండి

- కాంగ్రెస్ అగ్రనేతలకు రఘువీరా, గిడుగు విజ్ఞప్తి


ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసిన రఘువీరా, గిడుగు రుద్రరాజు

న్యూఢిల్లీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని బండ్లపల్లిలో ఫిబ్రవరి 2న నరేగా బహిరంగ సభకు రావాలని కాంగ్రెస్ అగ్రనేతలను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సభ్యులు రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు కోరారు. శనివారం ఇందిరా భవన్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశాల్లో పాల్గొని, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలను ఆహ్వానించారు. సమావేశం అనంతరం మల్లికార్జున ఖర్గేను రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు ప్రత్యేకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి కొంతసేపు ముచ్చటించారు. అనంతరం గిడుగు రుద్రరాజు మీడియాతో మాట్లాడారు. కేంద్రం ఉపాధి హామీ పథకం పేరు, చట్టంలో మార్పులు చేయడం సరికాదన్నారు. 2006 ఫిబ్రవరి 2న బండ్లపల్లిలో ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 2వ తేదీకి 20 సంవత్సరాలు పూర్తవుతుందని, ఈ సందర్భంగా మళ్లీ బండ్లపల్లిలో సభ నిర్వహించే బహిరంగ సభకు రావాలని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలను ఆహ్వానించామని చెప్పారు.

ఆర్టీఐ కమిషనర్‌గా మాజీ పాత్రికేయుడు వీఎస్‌కే చక్రవర్తి..!

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు కమిషనర్ల నియామక ప్రక్రియ దాదాపు పూర్తయింది. ప్రధాన సమాచార కమిషనర్‌గా న్యాయవాది వజ్జా శ్రీనివాసరావు నియామకాన్ని ఖరారు చేసిన సీఎం మరో నలుగురు కమిషనర్ల నియామకాన్ని కూడా ఖరారు చేశారు. ఇప్పటికే రవి యాదవ్, ఆదెన్న, పీఎస్ నాయుడు పేర్లు ఖరారు కాగా తాజాగా మాజీ పాత్రికేయుడు వీఎస్‌కే చక్రవర్తిని మరో కమిషనర్‌గా ఖరారు చేశారు. వీరిలో రవియాదవ్, ఆదెన్న, పీఎస్ నాయుడు న్యాయవాదులు. ప్రస్తుతానికి ఒక ప్రధాన కమిషనర్, నలుగురు కమిషనర్లతో నియామక ప్రక్రియను ముగించారు. సీఎం నేతృత్వంలోని సెలక్ట్ కమిటీ ఇప్పటికే వీరి పేర్లను ఖరారు చేయగా, ఈ నియామకాలకు సంబంధించిన ప్రక్రియ ప్రస్తుతం జీఏడీ(జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) వద్ద ఉంది. జీఏడీ నుంచి గవర్నర్‌కు ఫైలు వెళుతుంది. గవర్నర్ ఆమోదం తర్వాత జీవో విడుదల చేస్తారు.

వెంకన్నకు వైసీపీ ముఠా ద్రోహం: బుచ్చిరాం ప్రసాద్

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు లేకున్నా వైసీపీ ముఠా తప్పుడు ప్రచారం చేస్తోంది. వైసీపీ తిరుమల వెంకన్నకు తీరని ద్రోహం చేస్తోంది' అని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్ ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'భక్తుల ముసుగులో వైసీపీ ముఠాలు తిరుమలలో అసత్య ప్రచారాలు చేస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు నెయ్యి నుంచి తలనీలాల వరకు ప్రతి పనిలో అక్రమాలకు, అవినీతికి పాల్పడిన వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా తిరుమల వెంకన్నను లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారాలు చేస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు.

వణికిస్తున్న చలి

- జి.మాడుగులలో 5.1 డిగ్రీల ఉష్ణోగ్రత


విజయనగరంలో ఉదయం పూట మంచులో దారి కనపడక లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు

విశాఖపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాయవ్య భారతం నుంచి అతిశీతల గాలులు మధ్యభారతం మీదుగా దక్షిణాది వరకూ వీస్తున్నాయి. దీంతో ఉత్తరాంధ్రలోని ఏజెన్సీ, మధ్య కోస్తా, రాయలసీమల్లోని కొన్ని ప్రాంతాల్లో శనివారం తీవ్రమైన చలి కొనసాగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రజల దైనందిన కార్యకలాపాలపై ప్రభావం పడింది. ఉదయం 10 గంటల వరకు ప్రజలు బయటకు రావడానికి వెనుకంజ వేస్తున్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచే మళ్లీ చలి వాతావరణం నెలకొంటోంది. 3వారాలుగా ఏజెన్సీలో రాత్రి ఉష్ణోగ్రతలు పదిలోపే నమోదవుతున్నాయి. శనివారం జి.మాడుగులలో 5.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోస్తా, రాయలసీమల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 2 నుంచి 4డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. వాయవ్య, మధ్యభారతాల్లో చలి తీవ్రత కొనసాగినంత కాలం రాష్ట్రంలోనూ ప్రభావం ఉంటుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

'తూర్పు'లో రప్పా రప్పా

జగన్ ఫ్లెక్సీ వద్ద మేకపోతు తల నరికి.. వైసీపీ సైకోల ఉన్మాదం

- 2029లో జాతరే... అంటూ శివాలు
- నాటు సారా తాగుతూ వీరంగం
- ఏడుగురి అరెస్టు.. పరారీలో ఒకడు.
- నిందితులను రోడ్డుపై నడిపించిన పోలీసులు
- రప్పారప్పా అంటే కటకటాలే: హోంమంత్రి


నల్లజర్లలో ఉన్మాదానికి పాల్పడిన వారిని రోడ్డుపై నడిపించుకుంటూ ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

నల్లజర్ల, అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం తూర్పుచోడవరంలో వైసీపీ సైకోలు రెచ్చిపోయారు. మాజీ సీఎం జగన్ ఫ్లెక్సీకి మేకపోతును బలి ఇచ్చి.. నాటుసారా తాగుతూ,ఉన్మాదంతో చెలరేగిపోయారు. 2029లో గంగమ్మ జాతరే.. రప్పా రప్పా.. అంటూ రాసిన ఫ్లెక్సీ ఎదుట వీరంగం చేశారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని రోడ్డుపై నడిపించుకుని తీసుకెళ్లారు. వీళ్లంతా 25ఏళ్ల లోపువారే కావడం గమనార్హం. తూర్పుచోడవరానికి చెందిన కత్తుల రమేశ్ శుక్రవారం రాత్రి 9గంటలకు గ్రామానికి చెందిన ఓ మాంసం వ్యాపారిని కలిశాడు. 'మేక పోతును నరికి తిరిగిచ్చేస్తాం. అందుకు రూ.3వేలు ఇస్తాం' అని చెప్పి మేకపోతును తీసుకున్నాడు. జగన్ జన్మదినం సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ వద్దకు దానిని తీసుకొచ్చాడు. అప్పటికే అక్కడకు అతని స్నేహితులు కొండాబత్తుల సాధు, పుట్టా నవీన్, ఉసుమర్తి పెదసాయి, ఆకాబత్తుల ఏసు, కనికెళ్ల రవి, తానింకి సమంజసరావు, దొడ్డిగర్ల రాజేశ్ చేరుకున్నారు. సాధు కత్తి తీసుకుని...'జై జగన్' అంటూ మేకపోతు తల నరికాడు. అందరూ కలిసి ఫ్లెక్సీపై రక్తం చిందించారు. ఉన్మాదంతో ఊగిపోతూ, రప్పా రప్పా.. అని అరుస్తూ, ఆ దృశ్యాలను వీడియో తీశారు. సోషల్ మీడియాలో ఆ వీడియో వైరల్ అయింది. దీంతో నల్లజర్ల పోలీసులు అదే రోజు రాత్రి తూర్పుచోడవరం చేరుకుని, ఈ ఘటనకు కారణమైన 8మందిలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. సమంజసరావు పరారీలో ఉన్నాడు. వారి నుంచి నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అందరిపై ఆయుధాల చట్టంతోపాటు జంతువులను హించించిన ఆరోపణలపై మరికొన్ని సెక్షన్లను నమోదు చేశారు. అందరూ చూస్తుండగానే నిందితులను నల్లజర్ల పోలీస్‌స్టేషన్ నుంచి సెంటర్ వరకు నడిరోడ్డుపై నడిపించి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు నిర్వహించి తాడేపల్లిగూడెం కోర్టుకు తరలించారు. కోర్టు రిమాండ్ విధించగా, వారందరినీ సబ్ జైలుకు తరలించారు. గత ఎన్నికల సమయంలో రమేశ్, సాధుపై కేసులు నమోదయినట్టు పోలీసులు తెలిపారు.

కేక్ కటింగ్‌కు కత్తులు, తల్వార్లా?

- వైసీపీపై హోంమంత్రి అనిత ఫైర్


జగన్ పుట్టిన రోజు నాడు.. భారీ కత్తులతో కేక్ కట్ చేస్తున్న వైసీపీ నేతల చిత్రాన్ని చూపుతున్న హోం మంత్రి అనిత

పుట్టిన రోజు అంటే అన్నదానం చేయడం, రోగులకు పండ్లు పంచడం చేస్తామని, కానీ వైసీపీ నాయకులు మాత్రం రౌడీయిజం ప్రదర్శిస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కేక్ కటింగ్‌కి వేటకొడవళ్లు, తల్వార్లు వాడటం ఒక్క వైసీపీ వారికే చెల్లిందన్నారు. ఇది సైకో తత్వానికి పరాకాష్ఠ అని ఆగ్రహించారు. "18 ఏళ్ల పిల్లలు కూడా కత్తులు పట్టుకుని రోడ్ల మీదకు రావడం బాధగా ఉంది. అధికారంలో ఉన్నప్పుడు గంజాయితో యువతను పాడు చేసిన జగన్, ఇప్పుడు తన పుట్టిన రోజు పేరుతో వారిని రౌడీలుగా తయారు చేస్తున్నారు." అని తెలిపారు. అయితే, రప్పా రప్పా అని గీత దాటి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, అలాంటి వారిని కటకటాల వెనక్కి పంపుతామని హెచ్చరించారు. కత్తులు, కటార్లతో రోడ్డుపైకి వస్తే ఆర్మ్స్ యాక్ట్ కింద కేసులు పెట్టి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు.

ఆర్థిక మోసాల కట్టడికి డిజిటల్ ఆడిట్ కీలకం

- సీఐడీ అధికారుల సమావేశంలో నిపుణులు
- దర్యాప్తులో ప్రతిభ చూపిన అధికారులకు హోంమంత్రి ప్రశంస


దర్యాప్తులో ప్రతిభ చూపిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేసిన అనంతరం వారితో హోంమంత్రి అనిత

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలు.. సైబర్ నేరాల దర్యాప్తులో డిజిటల్ ఆడిట్ కీలకమని సీఐడీ అధికారులకు నిపుణులు కీలక సూచనలు చేశారు. ఆధారాలు సేకరించడం, డిజిటల్ ఫోరెన్సిక్‌కు పంపడం, నేరాల తీరుతెన్నుల్ని విశ్లేషించుకోవడం, అవసరమైన ఆయా రంగాల్లో నిపుణుల్ని సంప్రదించడం, అంతిమంగా దోషుల్ని పక్కా ఆధారాలతో కోర్టు ముందు నిలబెడితేనే సమాజానికి మంచి జరుగుతుందని వివరించారు. మంగళగిరిలో శనివారం జరిగిన సీఐడీ రాష్ట్ర స్థాయి అధికారుల సమావేశంలో యూనివర్సిటీల ప్రొఫెసర్లు, ఐఆర్ఎస్ మాజీ అధికారులు, ఆడిటర్లు నేర దర్యాప్తులో అధునాతన పద్ధతుల గురించి వివరించారు. నేరాలు మారుతున్న తీరుతెన్నులను వివరిస్తూ ఎప్పటికప్పుడు దర్యాప్తు అధికారులు తమను తాము ఎలా సంస్కరించుకోవాలనే దానిపై వృత్తిపరమైన ఆరు కీలక సూచనలు చేశారు. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశం ముగింపునకు హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత హాజరయ్యారు. రాష్ట్రంలో జరిగిన నేరాల కట్టడిలో కీలకంగా వ్యవహరించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది సీఐడీ అధికారులకు అనిత చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. సీఐడీ న్యాయ సలహాదారు లక్ష్మణ రావు, జిల్లాల సీఐడీ అధికారులు పాల్గొన్నారు.



దుర్గగుడికి పవర్ కట్!

2023 ఫిబ్రవరి నుంచి 2.61 కోట్ల బకాయిలు

విజయవాడ/ఇంద్రకీలాద్రి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయమైన శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానానికి సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ (సీపీడీసీఎల్) అధికారులు విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేశారు. ఈ ఆలయానికి 10 ఎల్‌టీ, ఒకటి హెచ్‌టీ సర్వీసు (వీజేఏ257) కలిపి మొత్తం 11 విద్యుత్తు సర్వీసులు ఉన్నాయి. ఇందులో హెచ్‌టీ కనెక్షన్‌కు నెలకు రూ.11-12 లక్షల వరకూ బిల్లు వస్తోంది. 2023 ఫిబ్రవరి నుంచి ఈ కనెక్షన్‌కు సంబంధించిన బిల్లును దేవస్థానం చెల్లించడం లేదు. ఈ నెల బిల్లుతో కలుపుకుని బకాయిలు రూ.2.61 కోట్లకు చేరుకున్నాయి. బకాయిలు చెల్లించాలని సీపీడీసీఎల్ అధికారులు ప్రతినెలా నోటీసులు ఇస్తూనే ఉన్నారు. తాజాగా రెండు రోజుల క్రితం మరోసారి నోటీసు పంపారు. శనివారంలోగా బకాయిలు చెల్లించకపోతే సరఫరా నిలుపుదల చేస్తామని అందులో పేర్కొన్నారు. అయినా స్పందించకపోవడంతో విజయవాడ డీ1 (డిస్ట్రిబ్యూషన్-1) సబ్‌స్టేషన్ అధికారులు హెచ్‌టీ కనెక్షన్‌కు వెళ్లే సరఫరాను నిలుపుదల చేశారు. దీంతో ఆగమేఘాల మీద స్పందించిన దేవస్థానం అధికారులు.. శనివారం సాయంత్రంలోగా బిల్లు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సరఫరాను పునరుద్ధరించారు. సాయంత్రానికి రూ.2 కోట్లు చెక్ రూపంలో ఇస్తామని సీపీడీసీఎల్ ఎస్ఏవో (సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్) విజయకుమారికి సమాచారం ఇచ్చారు. చెక్కు కాకుండా డీడీ రూపంలో ఇవ్వాలని ఆమె కోరారు. అయితే శనివారం బ్యాంకులకు సెలవు కావడంతో డీడీ ఇవ్వడం సాధ్యం కాదని, సోమవారం ఎన్ఈఎఫ్‌టీ ద్వారా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ మొత్తం కాకుండా ఇంకా రూ.61లక్షలు చెల్లించాల్సి ఉంది. హెచ్‌టీ కనెక్షన్‌కు మాత్రమే కాకుండా 10 ఎల్‌టీ సర్వీసులకు కూడా బకాయిలు ఉన్నాయని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. ఈ కనెక్షన్లకు సరఫరాను నిలుపుదల చేస్తామని నోటీసులు ఇవ్వడంతో దసరా శరన్నవరాత్రుల్లో రూ.50లక్షలు చెల్లించినట్టు సమాచారం.

విద్యుత్తు సమస్యకు తాత్కాలిక పరిష్కారం: ఈవో

దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక చొరవతో దుర్గగుడి విద్యుత్తు సమస్య పరిష్కారమైందని ఆలయ ఈవో శీనానాయక్ తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రి క్షేత్రానికి సంబంధించి విద్యుత్తు బోర్డుతో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. గతంలో ఉన్న బకాయిలు చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. సోలార్ ప్లాంట్, విద్యుత్తు బోర్డుకు సంబంధించి అన్ని వివాదాలపై త్వరలోనే నిపుణులతో చర్చించి, శాశ్వతంగా పరిష్కరిస్తామని ఈవో స్పష్టం చేశారు.

రాహుల్‌ను ప్రధానిని చేసి 'ఉక్కు'ను రక్షించుకోండి

స్టీల్‌ప్లాంటును మోదీ క్యాన్సర్ రోగిలా చిత్రీకరిస్తున్నారు

- మాజీ సీఎంగా జగన్ మళ్లీ కార్మికులను మోసం చేస్తున్నారు
- 'విభజన' చేశారనే ఏపీ ప్రజలు కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా చేశారు
- సాగునీటి ప్రాజెక్టులపై నాడు కేసీఆర్-జగన్ విందు భోజనాలు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేసి విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలని రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి)పిలుపిచ్చారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 20 మంది లోక్‌సభ సభ్యులను గెలిపిస్తే రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని, స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షిస్తారని వెల్లడించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని హోదాలో ఇందిరాగాంధీ 1966లో రూ.14,000 కోట్లతో స్థాపించిన స్టీల్ ప్లాంట్ ప్రస్తుత సంపద దాదాపు రూ.రెండున్నర లక్షల కోట్లకు చేరిందని జగ్గారెడ్డి చెప్పారు. అత్యంత విలువైన స్టీల్ ప్లాంటు సంపదను తన వారికి అప్పగించుకోవాలన్న దురుద్దేశంతోనే.. ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కును క్రమంగా మూసివేసేలా చర్యలు తీసుకుంటున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. స్టీల్ ప్లాంటును నయం చేయలేని దశలో ఉన్న క్యాన్సర్ రోగిలా మోదీ చిత్రీకరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి మళ్లీ స్టీల్ ప్లాంట్ కార్మికులను మోసం చేస్తున్నారన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. మోదీ, జగన్, చంద్రబాబు, పవన్ నాటకాలు ఆగిపోతాయని వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజన చేసిందన్న ఒకే ఒక్క కారణంతో సోనియాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీని ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాష్ట్రంలో నామరూపాలు లేకుండా చేశారని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. కానీ ఆ సమయంలో రాష్ట్ర విభజనకు మద్దతుగా యూపీఏ అధ్యక్షురాలు సోనియాగాంధీకి వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు లేఖలు రాశారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆ సమయంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన తానొక్కడినే సమైక్యాంధ్రకు మద్దతుగా అధిష్ఠానానికి లేఖలు రాశానని, బాహాటంగా మాట్లాడానని వెల్లడించారు. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్ సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు తనకే ఉంటుందని జగ్గారెడ్డి అన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి గతంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఏపీ మాజీ సీఎం జగన్ పరస్పరం విందుభోజనాలు చేసుకున్నా.. నీటి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడున్న సీఎంల మధ్య ఇలాంటి విందు రాజకీయాలు నడవవని, నీటి సమస్యపై ఇరువురూ చర్చించుకుని పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ పాల్గొన్నారు.

సంప్రదాయ వైద్యం శాస్త్రీయం కాదన్నది అపోహే

సాంకేతికత, సంప్రదాయాలు కలసి సాగాలి.. జగన్‌కు విజ్ఞాన దృక్పథం లేదు

- అందుకే యోగా వృథా అంటున్నారు
- భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో మంత్రి సత్యకుమార్



తిరుపతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయ వైద్య రీతులు శాస్త్రీయం కావన్నది అపోహ మాత్రమేనని మంత్రి సత్యకుమార్ అన్నారు. శనివారం తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరుగుతున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనం రెండవ రోజు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'సంప్రదాయ వైద్య విధానాలు' అన్న అంశంపై జరిగిన సదస్సులో మాట్లాడారు. 'ప్రాచీన కాలంలో మునులు, రుషులు తమ జ్ఞానాన్ని, అనుభవాన్ని మేళవించి రూపొందించిన ఆయుర్వేద, సిద్ధ తదితర వైద్య రీతులు ఎంతో విలువైనవి. ఈ ప్రాచీన, సంప్రదాయ వైద్య విధానాలు అద్భుత వారసత్వ సంపద. 2,500ఏళ్ల కిందటే సుశ్రుతుడు 1,200 రకాల వ్యాధులను గుర్తించారు. 120 రకాల శస్త్రచికిత్సల్లో వాడే పరికరాలను (సర్జికల్ టూల్స్) తయారు చేశారు. వెయ్యేళ్ల క్రితమే చరకుడు జీర్ణ వ్యవస్థను అధ్యయనం చేసి జీర్ణ ప్రక్రియను, దానికి సోకే వ్యాధులను, చికిత్సా పద్ధతులను పేర్కొన్నారు. దేశ గ్రామీణ జనాభాలో 60 నుంచి 70 శాతం ఇప్పటికీ సంప్రదాయ, ప్రాచీన వైద్య చికిత్సలపైనే ఆధారపడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. గత పదేళ్లలో రాష్ట్ర ఆయుష్ వైద్య విభాగానికి కేంద్రం నుంచి రూ.119 కోట్లు మాత్రమే నిధులు కేటాయించారు. అదే ప్రస్తుత ప్రభుత్వంలో 18నెలల వ్యవధిలోనే రూ.250కోట్లు వచ్చాయి. సంప్రదాయాలు, టెక్నాలజీ... రెండూ కలసి పనిచేయాలి. రాష్ట్ర వైద్యశాఖ వార్షిక బడ్జెట్ రూ.30 వేల కోట్లు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయుర్వేద, హోమియో, యునానీ, సిద్ధ తదితర ప్రాచీన వైద్య చికిత్సలపై దృష్టి కేంద్రీకరించింది. ఏళ్ల తరబడి ఆయుష్ శాఖలో పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. తమ ప్రభుత్వం ఏకంగా 400 వైద్యుల పోస్టులు భర్తీ చేస్తోంది. రాష్ట్రంలో కొత్తగా 5ఆయుర్వేద ఆస్పత్రులు, 3 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నాం. ఇటీవలే ఆయుర్వేద పీజీ వైద్యులు శల్యతంత్రం విభాగంలో 53 రకాల సర్జరీలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది' అని సత్యకుమార్ పేర్కొన్నారు.

అనేక అంశాలపై విస్తృత చర్చలు

భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో రెండవ రోజు అనేక అంశాలపై నిపుణులు విస్తృతంగా చర్చించారు. తమ ఉపన్యాసాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్ అంశాలపై జరిగిన చర్చకు పెద్దఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. లెక్కలు, సైన్స్ అంశాల మీద నిర్వహించిన మ్యాథ్స్ స్కిట్, క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్నారు. ఖగోళ శాస్త్రం, భౌతిక శాస్త్రం, ఆర్థిక రంగాలపై చర్చలు జరిగాయి. న్యూటన్, స్టీఫెన్ హాకింగ్స్ మొదలు పాణిని, ఆర్యభట్ట వరకు చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఇక ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన డ్రోన్ అంబులెన్స్ సందర్శకులను అమితంగా ఆకట్టుకుంది. రెండవ రోజు జిల్లావ్యాప్తంగా అనేక విద్యా సంస్థల నుంచి వేలాది మంది విద్యార్థులు విజ్ఞాన సమ్మేళనానికి పోటెత్తారు.

ఆయుర్వేద వైద్యులపై ఐఎంఏ ఆరోపణలు అవాస్తవం

- మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ వేముల భానుప్రకాశ్

విజయవాడ(గాంధీనగర్), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యులపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపణలు చేయడాన్ని ది మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ వేముల భానుప్రకాశ్ ఖండించారు. ఆయుర్వేద వైద్యులు శస్త్ర చికిత్సలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, శాస్త్రీయ సూత్రాలు, వైద్యవిద్య నియంత్రణ చట్టాలను ఉల్లంఘిస్తున్నారని ఐఎంఏ ప్రతినిధులు ఆరోపణలు చేయడం సరికాదు. ఇటువంటి ఆరోపణలు చేయడం పార్లమెంట్ ఆమోదించిన చట్టాలు, కేంద్రప్రభుత్వ నోటిఫికేషన్లు, వైద్య నియంత్రణ సంస్థల అధికారాలను కించపరిచినట్టేనన్నారు. నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ నిబంధనల ప్రకారం థియరీ, క్లినికల్ ట్రైనింగ్, లైవ్ సర్జికల్ ఎక్స్‌పోజర్, ఇంటర్న్‌షిప్ లేకుండా ఎలాంటి పీజీడిగ్రీ మంజూరు చేయదన్నారు. అనేక రాష్ట్రాల్లో ఇప్పటికే ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ కాలేజీలు, టీచింగ్ ఆసుపత్రులు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆయుర్వేద వైద్యులు 58 శస్త్రచికిత్సలు చట్టబద్ధంగా, ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారన్నారు. ఐఎంఏ ప్రతినిధులు వాస్తవాలు అంగీకరించి వివాదాలు సృష్టించకుండా ప్రజా ఆరోగ్య ప్రయోజనాలకు సహకరించాలని భానుప్రకాష్ కోరారు.

784 మంది పీజీ వైద్యులకు పోస్టింగ్

- 'ఏడాది సర్వీస్' రూల్ కింద ఎస్ఆర్‌గా సేవలు
- 1 నుంచి సెకండరీ, బోధనాసుపత్రుల్లో విధుల్లోకి..

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద పీజీ వైద్యవిద్య పూర్తిచేసిన విద్యార్థులు తప్పనిసరి ఏడాది పాటు సర్వీస్ చేయాలన్న నిబంధనల మేరకు.. 784 మంది పీజీ వైద్యులకు సీనియర్ రెసిడెంట్లు (ఎస్ఆర్)గా ఆరోగ్య శాఖ పోస్టింగ్ ఇవ్వనుంది. వీరు సెకండరీ, బోధనాసుపత్రుల్లో జనవరి 1 నుంచి విధులు నిర్వహించనున్నారు. స్పెషాలిటీల వారీగా వీరి సేవలను సదరు ఆస్పత్రుల్లో అవసరాలకు తగ్గట్లు పొందేందుకు వీలుగా అధికారులు జాబితాలు రూపొందించారు. ఇప్పటికే ప్రారంభమైన ఆప్షన్ల నమోదు ప్రక్రియ 29 వరకు కొనసాగుతుంది. ఆప్షన్లు పెట్టుకున్న వారికి వెంటనే పోస్టింగులు ఇవ్వనున్నారు. పోస్టింగ్ పొందిన వారు జనవరి 5లోగా విధుల్లో చేరాల్సి ఉంటుంది. 784 మంది సీనియర్ రెసిడెంట్లు (ఎస్ఆర్) రావడంతో ఆస్పత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ కాబోతున్నాయని ఆరోగ్య మంత్రి సత్యకుమార్ హర్షం వ్యక్తంచేశారు. ప్రాంతీయ, సామాజిక, జిల్లా ఆస్పత్రుల్లో 393 మంది, మిగిలిన వారిని 17 బోధనాసుపత్రుల్లో పనిచేసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.

ఎస్ఆర్ షిప్‌గా పరిగణించాలి..

నిబంధనల ప్రకారం ఏడాదిపాటు తప్పనిసరి సర్వీస్‌కు పీజీ పూర్తిచేసిన విద్యార్థులు సిద్ధమయ్యారు. ఇదే సమయంలో కీలక డిమాండ్‌ను ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు. తాము ప్రభుత్వాస్పత్రుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం పొందాలంటే.. నిబంధనల మేరకు కచ్చితంగా ఒక ఏడాది ఎస్ఆర్ షిప్ పూర్తిచేసి ఉండాలి. ఈ నేపథ్యంలో తప్పనిసరి ఏడాది ప్రభుత్వ సర్వీస్‌ను ఎస్ఆర్ షిప్‌గా పరిగణించాలని కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఏడాదిలోనే ఏపీకి రూ.9500 కోట్ల రైల్వే ప్రాజెక్టులు

మోదీ.. బాబు నాయకత్వంలో అభివృద్ధి పరుగులు

- రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న
- హిందూపురంలో వందే భారత్ స్టాపింగ్ ప్రారంభోత్సవం

హిందూపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో అభివృద్ధి పరుగులు పెడుతోందని రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం, సోమందేపల్లిలో ఆయన శనివారం పర్యటించారు. సోమందేపల్లి మండలం చాకర్లపల్లి వద్ద రూ.4 కోట్లతో అభివృద్ధి చేసిన రైల్వే స్టేషన్‌ను ప్రారంభించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం హిందూపురం చేరుకుని, ఎంపీ బీకే పార్థసారథితో కలిసి యశ్వంత్‌పురం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వందేభారత్ రైలు స్టాపింగ్‌ను మంత్రి సోమన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, '2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏపీలో రూ.9,470 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం అనుమతిచ్చింది. రాష్ట్రంలో ఎనిమిది వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. తాలూకా స్థాయిలో వందేభారత్ రైలును ఆపడం హిందూపురంలోనే మొదటిసారి. ఇది హిందూపురం ప్రజలకు మోదీ ఇచ్చిన గిఫ్ట్' అని అన్నారు. ఇక, రాష్ట్ర వ్యాప్తంగా 1560 కి.మీ. కొత్త రైల్వే మార్గాల నిర్మాణం జరుగుతోందని మంత్రి తెలిపారు. 717 ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీల నిర్మాణం పూర్తయిందన్నారు. అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి పథకం కింద రాష్ట్రంలో 73 రైల్వేస్టేషన్‌లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో తిరుపతి, నెల్లూరు, విశాఖపట్నం, హిందూపురం, ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఏపీ రాజధాని అమరావతికి రైల్వేశాఖ మరిన్ని నిధులు కేటాయించిందని మంత్రి తెలిపారు.



హిందూపురంలో వందే భారత్ రైలు స్టాపింగ్‌ను ప్రారంభిస్తున్న రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, పక్కన ఎంపీ బీకే పార్థసారథి

తిరుమలలో రెండెకరాలు ఇవ్వండి!

- పీఆర్, రెవెన్యూ అతిథి గృహాలు నిర్మిస్తాం
- డిప్యూటీ సీఎం, రెవెన్యూ మంత్రి అభ్యర్థన
- నిర్ద్వంద్వంగా తిరస్కరించిన టీటీడీ బోర్డు



తిరుపతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో ఐదేళ్లు అస్తవ్యస్తమైన తిరుమల వ్యవహారాలను గాడి లో పెట్టేందుకు టీటీడీ కఠినంగా వ్యవహరిస్తోంది. రాజకీయ కోణంలో కాకుండా క్షేత్రం పవిత్రతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటోం ది. తిరుమలలో పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలకు అతిథిగృహాల నిర్మాణానికి భూమి కేటాయించాలని కోరుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన అభ్యర్థనలను సైతం టీటీడీ తిరస్కరించిన విషయం తాజాగా వెలుగు చూసింది. వీఐపీల ప్రొటోకాల్, తిరుమలలో ఉత్సవాల ఏర్పాట్లలో రెవెన్యూ శాఖది కీలక పాత్ర. ఈ అవసరాల దృష్ట్యా తిరుమలలో తమకు ప్రత్యేకంగా అతిథిగృహం అవసరమని ఆ శాఖ భావించింది. విషయాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో తిరుమల కొండపైన 2ఎకరాల భూమి కేటాయించాలని కోరుతూ ఆయన టీటీడీకి లేఖ రాశారు. దీనికన్నా ముందు పంచాయతీరాజ్ భవన్ పేరుతో అతిథిగృహం నిర్మించుకోవడానికి తిరుమలలో స్థలం కేటాయించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం నుంచి కూడా లేఖ అందింది. ఈ రెండింటిపై 16న జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో చర్చించారు. కొండపైన భూమి లభ్యత పరిమితంగా ఉన్నందున కొన్నేళ్లుగా కొత్త నిర్మాణాలపై నిషేధం ఉంది. ఈ విషయంలో హైకోర్టు పలు పరిమితులు విధించడంతో శిథిలావస్థకు చేరిన గెస్ట్‌హౌస్‌లు, కాటేజీలను పునర్నిర్మించడానికే టీటీడీ పరిమితమవుతోంది. ఇందులో భాగంగానే డిప్యూటీ సీఎం, మంత్రుల అభ్యర్థనలను టీటీడీ పాలకమండలి తిరస్కరించింది. అయితే ప్రత్యామ్నాయంగా తిరుమలలో ఇప్పటికే వున్న అతిథిగృహాల్లో అనువైన భవనాన్ని కేటాయించాలని నిర్ణయించింది.

పీపీపీ విధానానికి కేంద్రం కితాబు

- జగన్ ప్రేలాపనలు మానుకోవాలి: మంత్రి స్వామి



ఒంగోలు క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ఉండటాన్ని కేంద్ర ప్రభుత్వమే సమర్థించిందని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. శనివారం ఒంగోలు ఉత్తర బైపాస్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో జరిగిన తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఆయన ముందుగా మీడియాతో మాట్లాడారు. 'పీపీపీ విధానం ద్వారా నిర్మాణం చేసిన మెడికల్ కాలేజీలను తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. అయితే ఈ విషయంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ పిచ్చిపిచ్చి ప్రేలాపనలు పేలడం మానుకోవాలి. మెడికల్ కాలేజీల నిర్మాణం కోసం ముందుకు వస్తున్న సంస్థలకు ఫోన్లు చేసి బెదిరించడం మంచి పద్ధతి కాదు. ఏదిఏమైనా పీపీపీ విధానం ద్వారానే ప్రభుత్వం ముందుకు వెళుతుంది. ప్రజాస్వామ్యంలో అందరికీ మాట్లాడే స్వేచ్ఛ ఉంటుంది. కానీ అది శ్రుతిమించితే చర్యలు తప్పవు' అని మంత్రి పేర్కొన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్ విజయకుమార్ ఉన్నారు.

టీటీడీ భూముల్లో స్టార్ హోటల్ ఎలా నిర్మిస్తారు?

- ఒబెరాయ్ కేటాయింపులను రద్దు చేయండి: నారాయణ



ఒబెరాయ్‌కు కేటాయించిన భూములను పరిశీలిస్తున్న నారాయణ

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'అలిపిరి వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం భూమిని ఒబెరాయ్ స్టార్ హోటల్‌కు కేటాయించడం సరి కాదు. కేటాయింపును వెంటనే రద్దు చేయాలి' అని సీపీఐ జాతీయ కంట్రోల్ మిషన్ చైర్మన్ కె.నారాయణ డిమాండ్ చేశారు. హోటల్‌కు కేటాయించిన భూములను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ... 'టీటీడీ భూముల్లో స్టార్ హోటల్ ఎలా నిర్మిస్తారు? ఆ స్టార్ హోటల్‌లో పబ్బులు, బార్లు, మాంసం ఉంటాయి. వీటిని దేవుడు ఎలా ఒప్పుకొంటాడు. అలిపిరి వద్ద పవిత్రమైన ప్రదేశంలో ప్రైవేటు స్టార్ హోటల్‌కు అప్పనంగా భూములు కేటాయించడం అపచారం కాదా? ఈ భూములను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఇవ్వలేక టూరిజం, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు కేటాయించినట్లు చూపించి, అనంతరం ఒబెరాయ్ హోటల్‌కు 25 ఎకరాలు కేటాయించింది. ఢిల్లీ కార్పొరేట్ కంపెనీల పెద్దలు, ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రి ఈ భూ కేటాయింపులో జోక్యం చేసుకొని ఉంటారు. తిరుపతి గురించి బాగా తెలిసిన సీఎం చంద్రబాబుకు దేవుడిపై భక్తి ఉంటే ఈ స్థలాన్ని ఎలా అప్పగిస్తారు? గతంలో వైసీపీ ప్రభుత్వం ఇలాంటి ప్రయత్నం చేయగా, ఉద్యోగులు, ప్రజలు అడ్డుకోవడంతో ఆగింది' అని నారాయణ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, నేతలు పి.మురళి, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ నక్సల్స్‌పై ఉక్కుపాదం!

వారిపై కఠిన చర్యలకు కేంద్రం నిర్ణయం

- తెలంగాణలో పెద్ద సంఖ్యలో ఉన్నట్లు గుర్తింపు
- నక్సల్స్‌కు ఆర్థిక, వైద్య, ఇంటెలిజెన్స్ సాయంపై దృష్టి
- వారి సోషల్ మీడియా ఖాతాలపై ఎన్ఐఏ ఆరా
- రాబోయే కొద్ది రోజుల్లోనే మరిన్ని అరెస్టులకు రంగం సిద్ధం

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చినాటికి మావోయిస్టులను నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం.. వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్న అర్బన్ నక్సల్స్‌పై దృష్టి సారించిందా!? కేంద్రం పిలుపునకు స్పందించి ఓవైపు మావోయిస్టులు లొంగిపోతుంటే.. మరోవైపు యువతను అర్బన్ నక్సల్స్ మావోయిజం దిశగా ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించిందా!? ఇందులో భాగంగానే మావోయిస్టులను హీరోలుగా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతోందని అనుమానిస్తోందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. అందుకే, రాబోయే రోజుల్లో అర్బన్ నక్సల్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపనుందని తెలిపాయి. అర్బన్ నక్సల్స్, వారికి సహకరించే వారిపై చర్యలు తీసుకోవాలని ఇటీవల సీఆర్పీఎఫ్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిర్దేశించారని గుర్తు చేశారు. నక్సలైట్లకు సైద్ధాంతిక ప్రోత్సాహం, ఆర్థిక, న్యాయ సహాయం అందిస్తున్న వారిని గుర్తించి, చర్యలు తీసుకున్నప్పుడే నక్సలిజమనే భూతం అంతమవుతుందని కూడా ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో అమిత్ షా వ్యాఖ్యానించారని తెలిపాయి. ఈ నేపథ్యంలోనే, నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల్లో తెలంగాణలోనే అత్యధిక సంఖ్యలో అర్బన్ నక్సల్స్ ఉన్నట్లు గుర్తించిన కేంద్రం.. వారి కదలికలపై నిఘా పెంచాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను ఆదేశించింది. ఇందులో భాగంగా ఇప్పటికే పలువురి సోషల్ మీడియా అకౌంట్లపై ఎన్ఐఏ అంతర్గత విచారణ జరిపింది. రాబోయే కొద్ది రోజుల్లోనే పలువురు అర్బన్ నక్సల్స్‌ను అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

2047 నాటికి నంబర్‌వన్ ఆర్థిక వ్యవస్థగా భారత్!

- యువత అధికంగా ఉన్నది మన దేశంలోనే
- దేశంలో హైక్లాస్‌కు చిరునామాగా 2 రాష్ట్రాలు
- 2040 నాటికి దేశంలోనే నంబర్ వన్‌గా ఉండాలి: చంద్రబాబు
- హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విద్యాసంస్థల వార్షికోత్సవానికి హాజరు

చేవెళ్ల/మొయినాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా 2047 నాటికి భారతదేశం ఎదుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌లో శనివారం ఎన్టీఆర్ విద్యాసంస్థల వార్షికోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచంలోనే అధికంగా యువత ఉన్నది భారత్‌లోనే అన్నారు. 2047 సంవత్సరానికి వికసిత్ భారత్‌గా తయారు చేసుకుందామని పిలుపునిచ్చారు. దేశంలోనే హైక్లాస్‌కు చిరునామాగా తెలుగు రాష్ట్రాలు తయారవడం గౌరవంగా ఉందన్నారు. దేశంలో నాల్గవ ఆర్థిక వ్యవస్థగా ఉన్నాయని, 2038 నాటికి మూడవ ఆర్థిక వ్యవస్థగా తయారవుతాయని తెలిపారు. 2040 నాటికి దేశంలోనే ఏపీ, తెలంగాణ నంబర్ వన్‌గా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. ఆ రోజుల్లోనే హైదరాబాద్ విజన్-2020ని విడుదల చేస్తే చాలామంది ఎగతాళి చేయగా, ఈరోజు అది రెట్టింపుగా తయారైందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యార్థులు హైదరాబాద్‌కు వచ్చి చదువుకునే విధంగా ఉమ్మడి రాష్ట్రంలో విద్యాసంస్థలను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.



హైదరాబాద్‌లో జరిగిన ఎన్టీఆర్ విద్యాసంస్థల వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

పిల్లలకు పెద్ద దిక్కుగా ఉండాలనే..

'గండిపేటలోని ఎన్టీఆర్ విద్యా సంస్థకు వస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది' అని చంద్రబాబు చెప్పారు. ఒకప్పుడు రాజకీయ పార్టీ ప్రధాన కార్యాలయం ఇక్కడ ఉండేదని, ఇక్కడ పార్టీ నేతలకు శిక్షణ ఇచ్చేవారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఈ స్థలంలో పిల్లలకు చదువు నేర్పుతున్నారని తెలిపారు. 'రకరకాల కార ణాల వల్ల చాలా మంది పిల్లలు అనాథలుగా మారేవారు. ఆ పిల్లలకు పెద్ద దిక్కుగా ఉండాలనే ఈ విద్యాసంస్థలను ఏర్పాటు చేశాం. ఆనాడు నాటి చిన్న మొక్క ఇవాళ పెద్ద వృక్షంగా తయారైంది. ఈ విద్యా సంస్థలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఘనత ట్రస్ట్ చైర్మన్ భువనేశ్వరిదే' అని కొనియాడారు. ఇక్కడ చదువుకున్న నలుగురు గ్రూప్ వన్ పోస్టులు సాధించారని, ఐఐటీలు, ఎన్ఐటీల్లో 29మంది సీట్లు పొందారని తెలిపారు. ప్రస్తు తం 1641 మంది పిల్లలు చదువుతున్నారని, చిన్న పాఠశాలగా మొద లై ఇంటర్, డిగ్రీ కాలేజీ వరకు ఈ సంస్థ ఎదిగిందని చెప్పారు. హైటెక్‌సిటీ కట్టి ఐటీని ప్రోత్సహించానని, ఈ రోజు మళ్లీ డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్ వ్యాలీ, క్వాం టమ్ కంప్యూటర్స్, గ్రీన్‌ఎనర్జీ, సెమీ కండక్టర్, డ్రోన్, స్పేస్ టెక్నాలజీలకి చిరునామా గా ఏపీని తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సీఈవో రాజేందర్ ప్రసాద్, సీఏఓ గోపీ, డైరెక్టర్ వేంకటేశ్వర్లు, డీన్ రామారావు, ప్రిన్సిపాల్ ఎస్‌జే రెడ్డి, హెరిటేజ్ డైరెక్టర్ సాంబశివరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో జరిగిన ఎన్టీఆర్ విద్యాసంస్థల వార్షికోత్సవంలో సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి



విద్యార్థిని కృత్రిమ చెయ్యిని పరిశీలించి.. మాట్లాడుతున్న సీఎం



హైదరాబాద్‌లో జరిగిన ఎన్టీఆర్ విద్యాసంస్థల వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

నేడు అయోధ్యకు సీఎం చంద్రబాబు

- ఎల్లుండి విదేశీ పర్యటనకు...

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం అయోధ్యకు వెళుతున్నారు. ఉదయం 9 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 11 గంటలకు అయోధ్య చేరుకుంటారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి కాంప్లెక్స్‌లో కొలువైన శ్రీరాముడిని దర్శించుకుంటారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు మూడు గంటలపాటు అయోధ్య శ్రీరాముడి ఆలయంలో సీఎం ఉంటారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు అయోధ్య నుంచి బయలుదేరి నేరుగా అమరావతి చేరుకుంటారు. కాగా, డిసెంబరు 30 నుంచి ఆయన విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. కుటుంబ సభ్యులతో వ్యక్తిగత పర్యటనకు వెళుతున్న బాబు తిరిగి జనవరి 4న రాష్ట్రానికి వస్తారు.

కొబ్బరి రైతులకు అండగా నిలవండి

- కొబ్బరి అభివృద్ధికి 200 కోట్లు ఇవ్వండి
- కేంద్ర వ్యవసాయ మంత్రికి సీఎం లేఖ

న్యూఢిల్లీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సవాళ్లను పరిష్కరించి, వారి ఆదాయాన్ని పెంచేందుకు రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న చర్యలకు మద్దతునివ్వాలని కేంద్రప్రభుత్వానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కొబ్బరి రైతులను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న సమీకృత కొబ్బరి అభివృద్ధి, మార్కెట్ బలోపేత కార్యక్రమం(ఇంటిగ్రేటెడ్ కోకోనట్ డెవలప్‌మెంట్ అండ్ మార్కెట్ స్ట్రెంత్‌నింగ్ ప్రోగ్రామ్)కు సత్వరమే రూ.200 కోట్లు ఆర్థికసాయం అందించాలని కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌కు లేఖ రాశారు. 'దేశంలో కొబ్బరి సాగులో ఏపీ నాలుగో స్థానంలో ఉంది. అయితే సరైన మార్కెటింగ్ లేక, దళారుల దోపిడీ వల్ల రైతులకు కాయకు రూ.11-15 మించి రావడం లేదు. ఈ పరిస్థితిని మార్చి రైతుకు కాయకు రూ.35-40 వచ్చేలా చూడడమే తమ ప్రాజెక్టు లక్ష్యం. ఈ ప్రాజెక్టు ద్వారా కేవలం రైతులకు లాభమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో 15 వేల మందికి ప్రత్యక్షంగా, 40 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నాం. కొబ్బరి సాగు విస్తీర్ణాన్ని 2 లక్షల హెక్టార్లకు పెంచడంతో పాటు, అంతరపంటగా కోకోసాగును ప్రోత్సహించనున్నాం' అని సీఎం లేఖలో పేర్కొన్నారు.

జనగణన తర్వాతే గ్రేటర్ సిటీలు

- తిరుపతి, విజయవాడ గ్రేటర్ సిటీల ప్రతిపాదనలు ప్రస్తుతానికి వాయిదా
- జనగణన నోటిఫికేషన్ రావడంతో బ్రేక్.. 2027 మార్చి తర్వాతే ప్రక్రియ

అమరావతి/తుళ్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ విజయవాడ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నప్పటికీ తాజా జనగణన పూర్తి అయిన తర్వాత ఈ ప్రక్రియ ప్రారంభించాలని భావిస్తోంది. ఇప్పటికే జనగణన నోటిఫికేషన్ వెలువడగా, మరో మూడు నెలల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో దేశ వ్యాప్తంగా ఎలాంటి భౌగోళిక మార్పులు చేపట్టే అవకాశం లేనందున జనగణన తర్వాతనే గ్రేటర్ అంశాలను పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రి నారాయణ శనివారం ఈ విషయం వెల్లడించారు. తిరుపతి, విజయవాడలను గ్రేటర్ సిటీలుగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ప్రస్తుతానికి వాయిదా పడ్డాయి. ప్రస్తుత తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరించి, చుట్టుపక్కల ఉన్న గ్రామాలను కలిపి గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు తిరుపతి మున్సిపల్ కౌన్సిల్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనలో తిరుపతి రూరల్, రేణిగుంట, చంద్రగిరి, యేర్పేడు మండలాల పరిధిలోని 60కి పైగా గ్రామాలు విలీనం చేయనున్నట్లు సమాచారం. దీనివల్ల ప్రస్తుతం సుమారు 30 చదరపు కిలోమీటర్లుగా ఉన్న నగర విస్తీర్ణం 280-300 చదరపు కిలోమీటర్లు పైగా పెరగనుంది. అలాగే విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరించి, నగరానికి ఆనుకుని ఉన్న గ్రామాలు, పంచాయతీలను విలీనం చేసి గ్రేటర్ విజయవాడగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. 70-75 గ్రామాలను నగర పరిధిలోకి తీసుకురావాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. 2027 మార్చి తర్వాతనే ప్రక్రియ ప్రారంభించే అవకాశముంది.

జనగణన తర్వాత ఏర్పాటు: మంత్రి నారాయణ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ విజయవాడ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి పి.నారాయణ తెలిపారు. రాజధాని అమరావతి తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో శనివారం ముగ్గురు సభ్యుల కమిటీ సమావేశం జరిగింది. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జనగణన ప్రారంభించిందని, అది పూర్తి అయ్యేదాక డీలిమిటేషన్ చేయవద్దని ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత విజయవాడ, తిరుపతిలను మహానగరాలుగా మారుస్తామన్నారు.

ఎవర్ని చంపడానికి వచ్చారు?

మీ సానుభూతి మాకొద్దు

- ఎమ్మెల్యే వల్లే రాజధాని రైతు రాములు మృతి
- పెమ్మసాని సమక్షంలో బంధువుల ఫైర్
- ఫోన్‌లో రాములు కుటుంబానికి సీఎం చంద్రబాబు పరామర్శ

తుళ్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): "ఎవరిని చంపడానికి వచ్చారు.. మీ సానుభూతి మాకొద్దు.. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ వల్లే రాములు చనిపోయాడు..' అంటూ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌పై రాములు బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానిలో ఎన్-8 రహదారి విషయమై మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌ల నేతృత్వంలో జరిగిన సమావేశంలో మాట్లాడి.. ఆ వెంటనే గుండెపోటుకు గురై దొండపాటి రామారావు (రాములు) మరణించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కలిసి పెమ్మసాని.... రాములు మృతికి నివాళులు అర్పించేందుకు రాములు స్వగ్రామం మందడం వచ్చారు. రాములు బంధువులు వారిని నిలదీశారు. రోడ్డు కింద ఇళ్లు పోకుండా పక్కకు జరిపితే ఏమౌతుందంటూ రాములు బావమరిది జయరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ వల్లే మా బావ చనిపోయాడ'ంటూ ఎమ్మెల్యేపై ధ్వజమెత్తారు. ఆయనను పెమ్మసాని ఓదార్చారు. బంధువులకు సర్ది చెప్పారు. మంత్రి నారాయణ కూడా రాములు ఇంటికి వచ్చి నివాళి అర్పించారు. రాములు భార్య, కుమారుడు, కుమార్తెలతో సీఎం చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడించారు. రాములు మృతి దురదృష్టకరమని, అండగా ఉంటామని చంద్రబాబు వారికి భరోసా ఇచ్చారు. మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అందుబాటులో ఉంటారని, ఏ కష్టం వచ్చినా వారిని కలవొచ్చునంటూ ధైర్యం చెప్పారు.



రాములు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు పదోన్నతులు

41 మంది ఐఏఎస్‌లు, 17 మంది ఐపీఎస్‌లకు ప్రమోషన్

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. వీరిలో 41 మంది ఐఏఎస్‌లు, 17 మంది ఐపీఎస్‌లు ఉన్నారు. ఈ మేరకు సీఎస్ విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. 1996 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్‌లు ముద్దాడ రవిచంద్ర, లవ్ అగర్వాల్, శశిభూషణ్ కుమార్, కె.సునీతలకు ముఖ్య కార్యదర్శుల నుంచి ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఉన్న రవిచంద్ర ఇకపై అదే స్థానంలో సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉంటారు. కేంద్ర సర్వీసులో ఉన్న లవ్ అగర్వాల్ అక్కడే కొనసాగనున్నారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదరి శశిభూషణ్‌కుమార్ అదే విభాగంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తారు. ఈడబ్ల్యూఎస్ ముఖ్య కార్యదర్శి కె.సునీత అదే స్థానంలో ఈడబ్ల్యూఎస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతారని పేర్కొన్నారు. కేంద్ర సర్వీసులో ఉన్న 2001 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సిద్ధార్థ జైన్ ప్రస్తుతం సెక్రటరీ హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. ఇకనుంచి ముఖ్య కార్యదర్శి హోదాలో అక్కడే కొనసాగుతారు. 2010 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు సీనియర్ ఐఏఎస్‌లు అడిషనల్ సెక్రటరీ నుంచి సెక్రటరీగా పదోన్నతి పొందారు. వీరిలో నారాయణ భరత్ గుప్తా, ఆమ్రపాలి, జె.నివాస్, గంధం చంద్రుడు, సి.నాగరాణి ఉన్నారు. చంద్రుడు మినహా మిగిలిన నలుగురూ సెక్రటరీలుగా యథాస్థానంలో కొనసాగనున్నారు. కార్మిక శాఖలో అడిషనల్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న గంధం చంద్రుడికి సెక్రటరీ హోదా కల్పించి, కార్మిక శాఖ కమిషనర్‌గా నియమించింది. అక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.వి. శేషగిరిబాబును రిలీవ్ చేసింది. ఈ ఏడాది పదోన్నతి పొందినవారిలో 2013 బ్యాచ్ ఐఏఎస్‌లు 13 మంది ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది జిల్లాల్లో కలెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జాయింట్ సెక్రటరీ హోదాలో ఉన్న వీరికి ప్రభుత్వం అడిషనల్ సెక్రటరీగా పదోన్నతి కల్పించింది. వారిలో హిమాన్షు శుక్లా (నెల్లూరు), కృతిక శుక్లా (పల్నాడు), ఎస్.షణ్మోహన్(కాకినాడ), దినేష్‌కుమార్ (అల్లూరి సీతారామరాజు), కె.విజయ (అనకాపల్లి), జి. లక్ష్మీశ (ఎన్టీఆర్), ఎన్.ప్రభాకర్‌రెడ్డి (పార్వతీపురం మన్యం), పి.రాజాబాబు (ప్రకాశం) ఉన్నారు. మరికొంత మంది హెచ్‌వోడీలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక 2017 బ్యాచ్‌కు చెందిన 10మంది ఐఏఎస్‌లు డిప్యూటీ సెక్రటరీ నుంచి జాయింట్ సెక్రటరీలుగా పదోన్నతులు పొందారు. అసిస్టెంట్ సెక్రటరీ హోదాలో ఉన్న 2022 బ్యాచ్‌కు చెందిన మరో 8 మందికి ప్రభుత్వం డిప్యూటీ సెక్రటరీ హోదా కల్పించింది.

పదోన్నతి పొందిన ఐపీఎస్‌లు వీరే...

ఏపీ కేడర్ 17మంది ఐపీఎస్‌లకు పదోన్నతి లభించింది. ఏడీజీ ర్యాంకులో ఉన్న శంకబ్రత్ బాగ్చి(విశాఖ సీపీ)కి డీజీపీ స్థాయి.. కేంద్ర సర్వీసుల్లో ఉన్న వినీత్ బ్రిజిలాల్‌కు ఏడీజీ ర్యాంకు, విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టితో పాటు సెంథిల్ కుమార్, షేముషి బాజ్‌పాయ్‌కి ఐజీ హోదాతో ప్రమోషన్ ఇస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. గజరావ్ భూపాల్(తెలంగాణ సర్వీస్), గ్రేవల్ నవ్‌దీప్ సింగ్(కేంద్ర సర్వీసుల్లో)కు పదోన్నతి ఇస్తూనే.. రాష్ట్ర కేడర్‌కు తిరిగి వచ్చాకే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు డీఐజీగా పదోన్నతి దక్కింది. ఇక 9మంది ఎస్పీ స్థాయి అధికారులకు సీనియర్ స్కేల్ హోదా కల్పించారు. వీరిలో అద్నాన్ నయీమ్ హస్మి, ఐశ్వర్య రస్తోగి, ఏఆర్ దామోదర్, హర్షవర్ధన్ రాజు, నరసింహ కిశోర్, రవిశంకర్ రెడ్డి, గంగాధర్ రావు, గీతా దేవి, మేరీ ప్రశాంతి ఉన్నారు.



ముద్దాడ రవిచంద్ర



లవ్ అగర్వాల్



శశిభూషణ్ కుమార్



శంకబ్రత్ బాగ్చి

ఏ11గా అల్లు అర్జున్

»» సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై కోర్టులో పోలీసుల చార్జిషీట్

»» చార్జిషీట్‌లో 23 మంది పేర్లు.. ఏ11గా అల్లు అర్జున్



ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి ఓపెన్‌టాప్ జీప్‌లో అభివాదం చేస్తూ వస్తున్న అల్లు అర్జున్ (ఫైల్)

హైదరాబాద్ సిటీ/చిక్కడపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనపై చిక్కడపల్లి పోలీసులు న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేశారు. ఆ ఘటనలో మహిళ మృతి, ఆమె కుమారుడు జీవచ్ఛవంగా మారడానికి.. థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యంతోపాటు అల్లు అర్జున్ రాక కూడా కారణమని పేర్కొన్నారు. ఈ మేరకు చార్జిషీట్‌లో 23 మంది నిందితుల పేర్లను చేర్చారు. ఈ నెల 24నే కోర్టులో ఈ చార్జిషీటు దాఖలు చేసినా.. ఆ వివరాలను శనివారం వెల్లడించారు. చార్జిషీట్‌లో పోలీసులు పేర్కొన్న వివరాల మేరకు.. గత ఏడాది డిసెంబర్ 4న రాత్రి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య 70 ఎంఎం థియేటర్‌లో పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో వేశారు. ఈ షోకు అల్లు అర్జున్ రావొద్దని, శాంతిభద్రతల సమస్యలు వస్తాయని పోలీసులు చెప్పినా వినకుండా.. థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులు, అల్లు అర్జున్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పోలీసుల మాట లెక్క చేయకుండా ప్రీమియర్ షోకు అల్లు అర్జున్ రావడం, థియేటర్‌కు కొంత దూరం నుంచే ఓపెన్ టాప్ జీపులో అభిమానులకు అభివాదం చేసుకుంటూ రావడం, బౌన్సర్లు, ప్రైవేట్ సెక్యూరిటీ సాధారణ ప్రజలను, అభిమానులు నెట్టివేయడంతో తొక్కిసలాట జరిగింది. వందలాది మంది ఒకరిపై ఒకరు పడిపోవడంతో రేవతి అనే ప్రేక్షకురాలు చనిపోయారు. ఆమె కుమారుడు శ్రీతేజ్ అపస్మారక స్థితికి చేరి.. ఇప్పటికీ బెడ్‌మీదనే చికిత్సపొందుతున్నాడు. ఈ ఘటనలో థియేటర్ నిర్వాహకులతోపాటు అల్లు అర్జున్, బౌన్సర్లు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను అరెస్టు చేసి జైలుకు తరలించామని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు.

ఏ 11గా అల్లు అర్జున్ పేరు

తొక్కిసలాట ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు చేశామని,50మంది సాక్షులను విచారించామని చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ తెలిపారు. అల్లుఅర్జున్ సహా 23 మంది ఈ దుర్ఘటనకు బాధ్యులని గుర్తించామని చెప్పారు. థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులను ఏ1, ఏ2గా, అల్లు అర్జున్‌ను ఏ11గా చేర్చామని తెలిపారు. మొత్తంగా థియేటర్ యాజమాన్యం, సిబ్బంది 10 మంది, 8 మంది బౌన్సర్లు, అల్లు అర్జున్, ఆయన వ్యక్తిగత సిబ్బంది నలుగురు నిందితుల్లో ఉన్నారని వివరించారు. నిందితులు, సాక్షుల వాంగ్మూలాలు, బలమైన ఆధారాలతో చార్జిషీట్ దాఖలు చేశామని వెల్లడించారు.

నన్ను చంపేస్తారా? దమ్ముంటే రండి!

»» నిమ్మాడ జంక్షన్‌లో దువ్వాడ హల్‌చల్

»» కృష్ణదాస్ వర్గానికి బహిరంగ సవాల్




ఎస్పీ మహేశ్వరరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ

శ్రీకాకుళం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ బహిష్కృత నేత, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో కలకలం రేపారు. నడిరోడ్డుపై కారు ఆపి మరీ వైసీపీలోనే తన ప్రత్యర్థులకు బహిరంగ సవాల్ విసిరారు. తనకు ప్రాణహాని ఉందని, తనను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయని ఆరోపిస్తూ నిమ్మాడ జంక్షన్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వస్తున్న క్రమంలో దువ్వాడ శ్రీనివాస్ నిమ్మాడ హైవే జంక్షన్ వద్ద తన కాన్వాయ్‌ను నిలిపివేశారు. అక్కడ ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేత, మాజీమంత్రి ధర్మాన కృష్ణదాస్ వర్గం నుంచి తనకు బెదిరింపులు వచ్చాయని తీవ్ర ఆరోపణలు చేశారు. 'నేను హైదరాబాద్ నుంచి వస్తున్నానని తెలిసి కింజరాపు అప్పన్న అనే వ్యక్తి ద్వారా కృష్ణదాస్ నాకు కబురు పంపారు. దమ్ముంటే రమ్మని, వస్తే చంపేస్తాం, నరికేస్తాం, అటాక్ చేస్తాం అని బెదిరించారు' అని దువ్వాడ పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి వారి అవినీతిని, చిల్లర రాజకీయాలను బయటపెట్టినందుకే తనను అంతం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. 'మీరు చేస్తున్న కేడీ రాజకీయాలను ఎండగట్టినందుకు నన్ను చంపేస్తారా? చంపేస్తామని బెదిరిస్తే అదిరిపోతాడు, బెదిరిపోతానని అనుకుంటున్నారా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కింజరాపు అప్పన్న తనకు ఫోన్ చేసి వెనక్కి వెళ్లిపోమని చెప్పారని.. కానీ తాను భయపడే రకం కాదని స్పష్టం చేశారు. 'ఇప్పుడు రాత్రి 9.30 అవుతోంది. రాత్రి 11.30 గంటలయినా ఇక్కడే ఉంటా. దమ్ముంటే రండి.. చంపాలంటే చంపండి' అంటూ దువ్వాడ సవాల్ విసిరారు. వైసీపీ తనను సస్పెండ్ చేసినా, బహిష్కరించినా తాను స్వతంత్రంగానే ప్రజా సమస్యలపై పోరాడతానన్నారు. కాగా, ధర్మాన కృష్ణదాస్, ధర్మాన ప్రసాదరావుల వల్ల తనకు ప్రాణహాని ఉందని దువ్వాడ శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం రాత్రి ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలిసి ఫిర్యాదును అందించారు. విచారణ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు.

రద్దుబాటలో 'అన్నమయ్య'

(మొదటి పేజీ తరువాయి)



డివిజన్లు, మండలాలను కడప, తిరుపతితో పాటు కొత్తగా ఏర్పాటు చేసే మదనపల్లె జిల్లాలో విలీనం చేయాలనుకుంటున్నారు. దీనిపై ఆదివారం మరోసారి సీఎం దగ్గర జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. అనంతరం సోమవారం జరిగే క్యాబినెట్ సమావేశం ఆమోదానికి పంపించనున్నారు. జిల్లాల జాబితాలో నుంచి అన్నమయ్యను తొలగిస్తే, కొత్తగా ఏర్పాటు చేసే మూడింటితో కలిపి మొత్తం జిల్లాలు 28 ఉంటాయి. మరోవైపు డివిజన్ల ఏర్పాటు, పునర్వ్యవస్థీకరణపై ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకొని స్వల్పమార్పులు ప్రతిపాదించారు.

ప్రజాభిప్రాయం మేరకే..

రాష్ట్రంలో కొత్తగా మదనపల్లె, మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గత నెల ప్రాథమిక నోటిఫికేషన్లు ఇచ్చింది. ఆరు రెవెన్యూ డివిజన్లు, ఓ కొత్త మండలం ఏర్పాటుపై కూడా నోటిఫికేషన్లు ఇచ్చి నెల రోజుల పాటు ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు స్వీకరించింది. అధికారిక లెక్కల ప్రకారం శనివారం నాటికి ఆయా జిల్లాల కలెక్టర్లకు ప్రజల నుంచి 927 వినతులు వచ్చాయి. అన్నమయ్య జిల్లాకు రాజంపేటను ప్రధాన కేంద్రంగా చేయాలని కొందరు.. లేనిపక్షంలో కడప జిల్లాలో విలీనం చేయాలని, రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించవద్దని మరి కొందరు కోరుతున్నారు. ఈ సమస్య మొదటి నుంచి ఉంది. అయితే జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి రాజంపేటకు మారిస్తే రాజీనామా చేస్తానని ఆ జిల్లా మంత్రి ప్రకటించినట్లుగా వార్తలొచ్చాయి. దీంతో సమస్యను పెద్దదిగా మార్చకూడదని ప్రభుత్వం తొలుత వెనక్కి తగ్గింది. కానీ, ప్రభుత్వానికి వచ్చిన విన్నపాలు, అభ్యంతరాల్లో సింహభాగం రాయచోటిని జిల్లా కేంద్రం నుంచి తప్పించాలన్నవే ఉన్నాయి. మరోవైపు రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్న డిమాండ్‌పై ప్రజలు, పార్టీలు ఆందోళన చేస్తున్నాయి. అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన నేపథ్యంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన విన్నపాలు, అభ్యంతరాలను క్రోడీకరించి రెవెన్యూ శాఖ నివేదిక కూడా ఇచ్చింది. రాయచోటిని జిల్లా కేంద్రంగా కదిలించాలని రాజంపేట వాసులు, కదిలించొద్దని స్థానికులు పోటాపోటీ డిమాండ్లు చేస్తున్నారు. మెజార్టీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అన్నమయ్య జిల్లాను రద్దు చేయాలని సమావేశంలో ప్రాథమికంగా నిర్ణయించారు. రాజంపేటను కడప జిల్లాలో విలీనం చేయాలని, రాయచోటిని కొత్తగా ఏర్పాటు చేయనున్న మదనపల్లె జిల్లాలో కలపాలని నిర్ణయించారు. దీని వల్ల ఆయా ప్రాంతాలు తమకు నచ్చిన జిల్లాలో కొనసాగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లా కేంద్రం విషయంలో విబేధాలు, వైషమ్యాలకు చెక్ పెట్టినట్లు అవుతోందని అంచనా వేస్తున్నారు. ఈ దిశగా ప్రతిపాదనలు రూపొందించాలని రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆదివారం మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇదే అంశంపై తుది సమావేశం నిర్వహించి ప్రతిపాదనలను ఖరారు చేయనున్నారు.

మొత్తం జిల్లాలు 28

ప్రస్తుతం అన్నమయ్య జిల్లాతో కలిపి రాష్ట్రంలో 26 జిల్లాలు ఉన్నాయి. కొత్తగా మదనపల్లె, మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్లు ఇచ్చారు. దీంతో మొత్తం జిల్లాల సంఖ్య 29కు చేరింది. అయితే ఇప్పుడు అనూహ్యంగా అన్నమయ్య జిల్లాను రద్దు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించిన నేపథ్యంలో మొత్తం జిల్లాల సంఖ్య 28కు పరిమితం కానుంది. ఆంధ్రప్రదేశ్ జిల్లాల ఏర్పాటు చట్టం-1974 అమల్లోకి వచ్చిన తర్వాత పలు దఫాలుగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. కానీ అమల్లో ఉన్న జిల్లాను రద్దు చేసిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఓ జిల్లాను రద్దు చేయనున్నారు.

సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు

- కొత్తగా మదనపల్లె, మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేస్తూ ఇచ్చిన నోటిఫికేషన్లపై ప్రజల నుంచి పెద్దగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాలేదని తెలిసింది. దీంతో ఆ జిల్లాల ఏర్పాటుపై తుది గెజిట్ నోటిఫికేషన్లు ఇస్తారు.
- గూడూరు ప్రజల అభిప్రాయం మేరకు తిరుపతి జిల్లాలో విలీనం చేసిన 3 మండలాలను తిరిగి నెల్లూరులోకి తీసుకురావాలని నిర్ణయించారు.
- అన్నమయ్య జిల్లాలో ఉన్న రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలోకి తీసుకొస్తారు.
- ఇప్పటికే సిద్దవటం, ఒంటిమిట్టను కడప జిల్లాలో విలీనం చేసేలా నోటిఫికేషన్లు ఇచ్చారు. ఇప్పుడు వీటికి తోడు రాజంపేటను కూడా కడపలోకి తీసుకువస్తూ తుది గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.
- అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే ఎమ్మెల్యేల మధ్య విబేధాల నేపథ్యంలో అడ్డరోడ్డు జంక్షన్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నిజానికి ప్రతిపాదిత నక్కపల్లి డివిజన్‌లోనే అడ్డరోడ్డు జంక్షన్ ఉంది. ఇప్పుడు దాన్నే రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయనున్నారు.
- మునగపాకను అనకాపల్లి డివిజన్‌లో, అచ్యుతాపురంను అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్‌లో చేర్చాలని నిర్ణయించారు.
- రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటుకానున్న పోలవరం జిల్లాలో ఎలాంటి మార్పులూ లేవు.

జడ్జీల కళ్లకు గంతలేమీ లేవు!

వాణిజ్య నిర్మాణాన్ని నివాస గృహంగా చెబుతారా? కోర్టును తప్పుదారి పట్టిస్తారా? : హైకోర్టు ఆగ్రహం

»» గత భీమవరం మున్సిపల్ కమిషనర్‌పై ఫైర్

»» రూ. 2.5 లక్షలు చెల్లించాలని ఆదేశం

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఓ భవన నిర్మాణం విషయంలో కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించిన పురపాలక శాఖ అధికారులపై హైకోర్టు ధర్మాసనం మండిపడింది. న్యాయదేవత కళ్లకు గంతలు కట్టి ఉండవచ్చు కానీ.. న్యాయమూర్తులకు కాదని ఘాటు వ్యాఖ్యలు చేసింది. వాణిజ్య అవసరాల కోసం నిర్మాణం చేపడుతున్నా, నివాస గృహంగా కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించిన అప్పటి భీమవరం మున్సిపల్ కమిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిర్మాణ ఫోటోలను పరిశీలిస్తే.. సామాన్యులకు సైతం అది వాణిజ్య అవసరాల కోసం నిర్మాణం చేస్తున్నట్లు అర్థమవుతుందని పేర్కొంది. మున్సిపల్ కమిషనర్ కోర్టును తప్పుదోవ పట్టించేలా నివేదించారని తెలిపింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిపిన మణిమంజరి, నరసింహారావులకు రూ.50 వేలు మాత్రమే సింగిల్ జడ్జి ఖర్చులు విధించారని, ఆ సొమ్మును రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు పేర్కొంది. ఖర్చుల కింద రూ.2.5 లక్షలు చెల్లించాలని కమిషనర్‌ను ఆదేశించింది. భవన నిర్మాణం చేసిన యజమానులకు మరో రూ.2.5 లక్షలు ఖర్చులు విధించింది. సొమ్మును హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వద్ద జమ చేయాలని వారిని ఆదేశించింది. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఆ సొమ్మును అంధులు, మూగ వారి కోసం వినియోగించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది.

కేసు వివరాలు ఇవీ..

భీమవరం పట్టణంలోని సర్వేనెం.99/5, 99/6లో ఓ నివాస భవనం (గ్రౌండ్ ప్లస్1) నిర్మాణం కోసం 2022 ఫిబ్రవరిలో మున్సిపల్ అధికారులు అనుమతి ఇచ్చారు. అయితే నివాస గృహానికి బదులు షాపింగ్ మాల్/గోదాం తరహా నిర్మాణం చేపడుతున్నారని దండు శ్రీనివాసకుమార్ వర్మ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు.. పిటిషనర్ వినతిని పరిగణలోకి తీసుకొని తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించింది. అయితే ప్లాన్ ప్రకారమే నిర్మాణం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఆ వినతిని పరిష్కరించారు. కమిషనర్ ఉత్తర్వులతో పాటు నిర్మాణాన్ని సవాల్ చేస్తూ మరికొందరు కోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. అలాగే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మణి మంజరి, సీహెచ్‌వీ నరసింహారావు మరో పిటిషన్ వేశారు. రికార్డులు పరిశీలించిన సింగిల్ జడ్జి.. నివాస భవనానికి అనుమతి తీసుకొని, వాణిజ్య భవనాన్ని నిర్మించారని నిర్ధారించారు. అయితే నిర్మాణం ఉన్న ప్రాంతాన్ని 2024 జనవరిలో నివాస జోన్ నుండి వాణిజ్య జోన్‌గా మార్చిన నేపథ్యంలో వాణిజ్య భవనం నిర్మాణానికి ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఇచ్చిన అనుమతికి చట్టబద్ధత ఉందని స్పష్టత ఇచ్చింది. వాస్తవాలు వెల్లడించకుండా నివాస నిర్మాణంగా చూపించేందుకు ప్రయత్నించిన మణి మంజరి, నరసింహారావులకు రూ.50 వేలు ఖర్చులు విధించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ దండు శ్రీనివాసకుమార్ ద్విసభ్య బెంచ్‌ముందు అప్పీల్ వేశారు. వ్యాజ్యం పెండింగ్‌లో ఉండగా అధికారులు వాణిజ్య నిర్మాణానికి అనుమతులు ఇచ్చి ఉండాల్సింది కాదని పేర్కొన్నారు. అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. వాణిజ్య నిర్మాణం కోసం ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ 2024 జూన్ 19న అనుమతులు ఇచ్చిందని గుర్తుచేసింది. ఆ అనుమతులను రద్దు చేయడం లేదని తెలిపింది.

ప్రజలే రాజకీయం చేయాలి

అప్పుడే పాలకులు సవ్యంగా ఉంటారు

»» స్టీల్ ప్లాంటైనా, మెడికల్ కాలేజీలైనా.. ప్రైవేటీకరణ ఆగాలంటే పోరాటం తప్పదు

»» టికెట్ రేట్లు పెంచితే ఆ సినిమా చూడటం మానేయండి: సినీ నటుడు ప్రకాశ్‌రాజ్



సీఐటీయూ 'శ్రామిక ఉత్సవ్'లో మాట్లాడుతున్న ప్రకాశ్‌రాజ్

విశాఖపట్నం/బీచ్‌రోడ్డు (విశాఖపట్నం), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజలు రాజకీయం చేసినప్పుడే పాలకులు సవ్యంగా ఉంటారని, కానీ మన దేశంలో నాయకులే రాజకీయాలు చేస్తున్నారని సినీనటుడు ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యానించారు. సీఐటీయూ అఖిల భారత మహాసభలు విశాఖలో నిర్వహిస్తున్న సందర్భంగా ఏర్పాటుచేసిన శ్రామిక ఉత్సవ్‌లో పాల్గొనడానికి ఆయన శనివారం ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కార్మికుల కోసం పోరాటం చేసేవారంటే తనకు ఇష్టమని చెప్పారు. అభ్యుదయ ఆలోచనలు, ఆందోళనలకు అండగా ఉంటానని, అందుకే సీఐటీయూ నాయకులు పిలవగానే విశాఖ వచ్చానని తెలిపారు. మావోయిస్టులను జనజీవన స్రవంతిలోకి తీసుకురావాల్సిన బాధ్యతను విస్మరించి వారిని చంపేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ దేశంలో ప్రశ్నించే వారిపై పీడీ యాక్ట్ కేసులు పెడుతున్నారని, గౌరీ లంకేశ్‌ను చంపినవారిని బెయిల్ ఇచ్చి బయటకు వదులుతున్నారని వ్యాఖ్యానించారు. వందేళ్ల ఉత్సవం చేసుకుంటున్న ఆరెస్సెస్‌లో ఒక్క మహిళ కూడా లేరని, వారిలో ఒక్కరూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనలేదని ప్రకాశ్‌రాజ్ విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణపై మాట్లాడుతూ, 'అమ్మేవాడు, కొనేవాడు ఇద్దరూ మన కళ్ల ముందే ఉన్నారు. వ్యాపారం చేసుకుంటున్నారు.' అని విమర్శించారు. ప్రభుత్వాలను నడిపేవారే అమ్ముడుపోతున్నారని ఆరోపించారు. దేశంలో విమానరంగం పదేళ్లుగా ఇద్దరి చేతుల్లోనే ఉందని, అందుకే సమస్యలు వస్తున్నాయని అన్నారు. స్టీల్ ప్లాంటు అయినా, మెడికల్ కాలేజీలు అయినా ప్రైవేటీకరణ కాకుండా ఆగాలంటే నిరంతర పోరాటం చేయక తప్పదని స్పష్టం చేశారు.

మహిళలపై శివాజీ వ్యాఖ్యలు తప్పే

మహిళలపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ తప్పేనని ప్రకాశ్ రాజ్ స్పష్టం చేశారు. ఆడవాళ్లకు ఆది నుంచి అన్యాయం చేస్తున్నది మగవారేనని, గిల్లితే గిల్లించుకోవడానికి అదేమీ 'పోకిరి' సినిమా కాదని అన్నారు. శివాజీ చెప్పిన క్షమాపణలు కూడా సంస్కారవంతంగా లేవని అభిప్రాయపడ్డారు. సినిమా టికెట్ల ధరలు ఇష్టానుసారం పెంచేయడంపై స్పందిస్తూ... అలాంటి సినిమాలు చూడటం మానేయాలని సూచించారు.

పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన

»» కమలం కిందున్న ఆరెస్సెస్‌ను కూకటివేళ్లతో పెకలించాలి

»» సీఐటీయూ 'శ్రామిక ఉత్సవ్'లో ప్రకాశ్‌రాజ్

పోరాటాలు చేస్తే తప్ప కార్మిక హక్కులు సాధించుకోలేమని సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన 'శ్రామిక ఉత్సవ్'లో ఆయన ప్రసంగించారు. భారతదేశం సరోవరం అయితే అందులో బయటకు కనిపించే కమలం బీజేపీ అని, ఆ పుష్పం కింద ఉన్న బలమైన వేళ్లు ఆరెస్సెస్ అని అభివర్ణించారు. దాన్ని కూకటివేళ్లతో పెకలించాల్సి ఉందన్నారు. దేశాన్ని కార్పొరేట్ సంస్థలే నడిపిస్తున్నాయని చెప్పారు. రాజకీయ పార్టీలు కార్పొరేట్ సంస్థలకు అమ్ముడుపోయాయని మండిపడ్డారు. శ్రమ దోపిడీపై మాట్లాడాలని, గొంతు విప్పాలని...అప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. 'చావు రాకముందే చావకూడదని నేను గొంతు విప్పుతున్నా. ఇది నా బాధ్యత'...అని చెప్పారు. దేశంలో ప్రశ్నించే వారి గొంతు నొక్కేయడం పరిపాటిగా మారిందని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ తెలకపల్లి రవికి ప్రకాశ్‌రాజ్ జ్ఞాపికను అందజేశారు.



హైదరాబాద్ రవీంద్రభారతిలో 'ఆటా వేడుకలు-2025 గ్రాండ్ ఫినాలే'లో ఆటా ప్రతినిధులు

ఘనంగా 'ఆటా' వేడుకలు

»» దర్శకుడు కోదండరామిరెడ్డికి ఆటా జీవన సాఫల్య పురస్కారం

రవీంద్రభారతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ఆధ్వర్యంలో 'ఆటా వేడుకలు-2025 గ్రాండ్ ఫినాలే' హైదరాబాద్ రవీంద్రభారతిలో శనివారం వైభవంగా జరిగాయి. దేశ విదేశాల నుంచి తరలివచ్చిన తెలుగు ప్రజలతో సభా ప్రాంగణం కళకళలాడింది. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యంగా ఆటా చేపట్టిన ఈ కార్యక్రమం సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరై.. తెలుగు భాషకు, సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తున్న ఆటా సేవలను కొనియాడారు. ప్రముఖ సినీ దర్శకుడు ఏ.కోదండరామిరెడ్డికి ఆటా జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. వివిధ విభాగాలకు చెందిన పలువురు ప్రముఖులకు ఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. కళలు, సాహిత్యం, విద్య, వైద్య, సామాజిక సేవా రంగాల్లో సేవలందించిన వారిని సత్కరించారు. సంప్రదాయ నృత్యాలు, జానపద గీతాలు, శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు అలరించాయి. ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, కాబోయే అధ్యక్షుడు సతీష్ రామసహాయంరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు కార్యక్రమ నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.